అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 28-1 -2018


సమగ్ర తెలుగు దినపత్రిక


సంపుటి : 4 సంచిక : 30 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు + సోపతి వెల : 6.00


కెఎల్ రాహుల్


మనీశ్ పాండే


బెన్ స్టోక్స్


చాహల్


రషీద్ ఖాన్

కురిసింది.. కాసుల వర్షం

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఆటగాళ్ల వేలంలో ప్రాంఛైజీలు కాసుల వర్షం కురిపించాయి. గెలుపు గుర్రాల కోసం ప్రాంఛైజీలు పోటీపడగా.. క్రికెటర్లు కోట్లు కొల్లగొట్టారు. కెఎల్ రాహుల్, మనీశ్ పాండేలు వేలంలో చెరో రూ. 11 కోట్లు దక్కించుకోగా, బెన్ స్టోక్స్‌కు రూ. 12.5 కోట్లు లభించాయి. యువ ఆటగాళ్లపై ప్రధానంగా దృష్టి సారించిన ప్రాంఛైజీలు ప్రతిభావంతులను కోట్లు వెచ్చించి దక్కించుకున్నాయి. క్రిస్ గేల్, జో రూట్, మురళీ విజయ్, లసిత్ మలింగ వంటి స్టార్స్‌ను వేలంలో ఎవ్వరూ తీసుకోలేదు. 12లో

మనోళ్లు గెలిచారు

దక్షిణాఫ్రికాపై టీమ్ ఇండియా ఊరట విజయం సాధించింది. మూడో టెస్టులో మహ్మద్ షమి (5/28) మెరవటంతో 241 పరుగుల ఛేదనలో సఫారీ 177 పరుగులకే కుప్పకూలింది. దీంతో భారత్ 63 పరుగుల తేడాతో గెలుపొందింది. మూడు మ్యాచుల ఫ్రీడం టెస్టు సిరీస్‌ను 1-2తో కోల్పోయినా. సఫారీ గడ్డపై నెగ్గగలమని కోహ్లిసేన నిరూపించుకున్నది. 10లో

చలాన్లు కట్టకుంటే జైలుకే

ఐదురోజుల్లో 493 మందిపై చార్జ్‌షీట్స్

- చలాన్ కట్టని ముగ్గురికి జైలు శిక్ష
- 30 మంది లైసెన్స్‌లు రద్దు... అందులో నలుగురివి శాశ్వతం



నవతెలంగాణ-సిటీబ్యూరో

డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడటం..ట్రాఫిక్ సిగ్నళ్ల జంపింగ్ చేయటం..రాంగ్ రూట్‌లో వెళ్లటం..ఇష్టానుసారంగా పార్కింగ్ చేయటం...హెల్మెంట్ ధరించకపోవటం...తదితర ఘటనల్లో సీసీ పుటేజీల ద్వారా, ప్రత్యక్షంగా ట్రాఫిక్ పోలీసులు చలాన్లు విధిస్తున్నారు. ఏ చలాన్లే కదా? కట్టకపోతే ఏమవుతుంది? పట్టుకున్నప్పుడు చూద్దాంలే? అంటూ కొందరు చలాన్లను పెడచెవిన పెడుతున్నారు. దర్జాగా రహదారులపై తిరుగుతున్నారు. అలాంటి వారిపై ట్రాఫిక్ పోలీసులు కొరఢా ఝులిపిస్తున్నారు. ఐదురోజుల్లో 493 మంది వాహనదారులపై చార్జ్‌షీట్స్ నమోదుచేశారు. 30 మంది లైసెన్స్ రద్దు చేశారు. ముగ్గురికి కోర్టు జైలు శిక్ష విధించింది.

హైదరాబాద్‌లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినవారిపై ట్రాఫిక్ పోలీసులు కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఈ నెల 22నుంచి 26వరకు 493 మందుబాబులపైనా, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినవారిపైనా కోర్టులో చార్జ్‌షీట్ వేశారు. వారిని ఎర్రమంజిల్ 3వ, 4వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ల ముందు హాజరు పర్చారు. అందులో కోర్టు 94 మందికి జైలు శిక్ష విధించింది. అందులో ముగ్గురు చలాన్లు కట్టని వారున్నారు. శిక్షపడ్డవారిలో ఒక్కరికి 20 రోజులు, మరో వాహనదారునికి 10రోజులు, ఒకరికి ఆరు రోజులు, నలుగురికి ఐదురోజులు, ఏడుగురికి నాలుగురోజులు, 22 మందికి మూడురోజులు, 58 మందికి రెండురోజులపాటు జైలు శిక్ష పడింది.

శాశ్వతంగా నలుగురి లైసెన్స్‌ల రద్దు

పోలీసులు చలాన్లు విధించినా చెల్లించకుండా తప్పించుకొని తిరుగుతున్న, మద్యం సేవించి వాహనాలు నడిపిస్తున్న 30 మంది వాహనదారుల లైసెన్స్‌లను కోర్టు రద్దు చేసింది. వారిలో నలుగురి లైసెన్సులను శాశ్వతంగా రద్దుచేశారు. మూడేండ్లపాటు ఒకరి, రెండేండ్ల పాటు మరొకరిది, ఏడాదిపాటు 10 మంది, ఆరునెలలు ఇద్దరివి, మూడు నెలలపాటు 12 మంది లైసెన్స్‌లను రద్దు చేశారు.

చెరువు నిండా నీళ్లు..

రైతన్నకు కన్నీళ్లు

పంటలు వేయలేక అశ్వరావుపల్లి రైతుల ఆందోళన

- తూము నిర్మాణంలో అవినీతి
- గతేడాదిగా సాగుకు దూరమైన రైతులు
- ఈసారి ఎండిపోతున్న నారుమళ్లు

అది దేవాదుల ప్రాజెక్టు కింద నిర్మాణం చేసిన రిజర్వాయర్. దీని నీటి సామర్థ్యం 0.74 టీఎంసీలు. రిజర్వాయర్ కింద సాగు భూమి 1800 ఎకరాలు. ఏం లాభం గతేడాది నుంచీ రైతులు సాగుకు దూరమయ్యారు. నార్లు పోసి నీటి విడుదల కోసం ఎదురు చూసినా అధికారులు, ప్రజాప్రతినిధులు కనికరించడం లేదు. దీనిలో ఏం చేయాలో పాలుపోక ఎండిపోతున్న నారుమళ్లను చూసి అన్నదాతలు కండ్లల్ల నీళ్లు దెచ్చుకుంటున్నరు. 'అయ్యా మా గోడు ఆలకించండి' అంటూ కనిపించిన అధికారినల్లా వేడుకుంటున్నారు.

వివరాలు 9లో





ఎస్సారెస్పీ డీ-83 కాలువకు గండి



నవతెలంగాణ-ధర్మారం

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని ఎస్ఆర్ఎస్పీ డీ-83/బీకి శనివారం తెల్లవారుజామున అండర్ టన్నెల్ వద్ద గండి పడింది. సరఫరా అవుతున్న నీరంతా ఎర్రగుంటపల్లి, మేడారం శివారు గ్రామాల్లో సుమారు 8 ఎకరాల్లో ఇసుక మేట పెట్టింది. ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ కాలువకు గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. 180 క్యూసెక్కుల సామర్థ్యం గల కాలువకు 170 క్యూసెక్కులు వదలడం, గతంలో నీరందక రైతులు కాలువలో అడ్డుకట్ట వేయడం వల్లే కాలువ కుంగి తెగినట్టు అధికారులు తెలిపారు. ఈ గండి పడటంతో వరి పొలాల్లో ఇసుక మేట వేసి 15 మంది రైతులు నష్టపోయారని తహసీల్దార్ కె.వై ప్రసాద్ తెలిపారు. రైతుల వివరాలతో నివేదిక తయారు చేయించి కలెక్టర్‌కు పంపిస్తామన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాఘవులు. చిత్రంలో జ్యోతి, జూలకంటి, తమ్మినేని, వెంకట్

సాగు కేటాయింపులపై

ప్రత్యేక చట్టం చేయాలి

కేంద్రం ఆ దిశగా ఆలోచించాలని రాఘవులు డిమాండ్

- డ్రైపోర్టుల నిర్మాణానికి కేంద్రంపై ఒత్తిడి తెండి..
- సీఎంకు సూచన
- కేసీఆర్‌వి తప్పుడు నిర్ణయాలు : తమ్మినేని
- సీపీఐ (ఎం) రాష్ట్ర మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో రైతుల ఆత్మహత్యలను ఆపేందుకు, వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చెందించేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో సాగుకు అత్యధిక నిధులు కేటాయించాలని సీపీఐ (ఎం) డిమాండ్ చేసింది. ఇందుకనుగుణంగా ప్రత్యేక చట్టం చేయాలని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో రెండు రోజులపాటు జరిగిన సీపీఐ (ఎం) రాష్ట్ర కమిటీ సమావేశాలు ...9లో

బిల్లుల చెల్లింపులో జాప్యం

- టీఆర్ఎస్ సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

వివరాలు 9లో

రేపటి నుంచి పార్లమెంట్

- ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్

వివరాలు 2లో

కాబూల్‌లో మారణహోమం

- అంబులెన్స్ బాంబు దాడిలో 95 మంది మృతి, 158 మందికి గాయాలు

వివరాలు 7లో

త్వరితగతిన పూర్తి చేయాలి


క్వార్టర్లను పరిశీలిస్తున్న స్పీకర్ మధుసూధనాచారి, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్, మండలి చైర్మెన్ స్వామిగౌడ్, మంత్రి తుమ్మల

- ఎమ్మెల్యేలకు కొత్త క్వార్టర్స్.. వచ్చే నెలలో ప్రారంభం

వివరాలు 9లో



దేశ ఐక్యతను, సమగ్రతను కాపాడాలని కోరుతూ కోల్‌కతాలో 17 వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శనివారం భారీ ఎత్తున నిర్వహించిన మానవహారం

యూపీలో ఆగని మత ఉద్రిక్తతలు

- పారామిలటరీ బృందాల మోహరింపు

కసగంజ్ : ఉత్తరప్రదేశ్‌లోని కాసగంజ్ పట్టణంలో రెండు గ్రూపుల మధ్య చెలరేగిన హింసాకాండ శనివారం కూడా కొనసాగింది. రిపబ్లిక్ డే సందర్భంగా వీహెచ్‌పీ, ఏబీవీపీ కార్యకర్తలు శుక్రవారం నిర్వహించిన ర్యాలీ మత ఉద్రిక్తతలకు దారితీసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రెండు వర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ ఘర్షణలో చందాన్ (16) చనిపోగా, పలువురు యువకులు గాయపడ్డారు. కాగా, చందాన్‌ను అమరవీరుడిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఒక గ్రూపు ఆందోళనకు దిగింది. జాతీయజెండా చుట్టి ఆ మృతదేహాన్ని ఊరేగించారు. చందన్ మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం కాలినదీ ప్రాంతానికి తీసుకెళ్ళారు. ఈ కార్యక్రమానికి ఎంపీ రాజ్వీర్ సింగ్, కాసగంజ్ ఎమ్మెల్యే దేవేందర్ సింగ్‌లు హాజరయ్యారు. కాగా, చందన్‌ను అమరవీరుడిగా ప్రకటించాలని, అతని కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని, అతని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి.. ఆ విషయాన్ని అక్కడే ప్రకటించాలని ఎంపీ, ఎమ్మెల్యేపై ఒత్తిడి తెచ్చారు. అప్పటివరకూ అంత్యక్రియలు నిర్వహించేది లేదని స్థానికులు పట్టుపట్టారు. ఆ డిమాండ్లకు ఎంపీ, ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో అంత్యక్రియలు ముగిశాయి. అయితే.. అక్కడ నుండి తిరిగి వస్తున్న స్థానికులు కోపోద్రిక్తులై వారు దుకాణాలను బలవంతంగా మూయించారు. దీనికి ప్రతిగా మరో వర్గం రెచ్చిపోయి దుకాణాలను, వాహనాలను తగులబెట్టింది. ఈ హింసాకాండకు సంబంధించి పోలీసులు 50 మందిని అరెస్టు చేసినట్టు జిల్లా మేజిస్ట్రేట్ ప్రకటించారు. పట్టణంలో 144 సెక్షన్ విధించారు. 'దర్యాప్తు జరుపుతున్నాం. ఈ హింసాత్మక ఘటనలకు పాల్పడినవారిని త్వరలో అరెస్టు చేస్తాం' అని పోలీసు అడిషనల్ సూపరింటెండెంట్ పిఎం త్రిపాఠి అన్నారు.

హెూంవర్క్ చేయలేదని..చెంపదెబ్బలు

- మధ్యప్రదేశ్‌లో స్కూలు టీచర్ నిర్వాకం

భోపాల్ : మధ్యప్రదేశ్‌లోని ఆదివాసీ ప్రాంతంలోని ఝుభువా జిల్లాలో ఓ ప్రభుత్వ గిరిజన పాఠశాల ఉన్నది. పన్నెండేళ్ల వయస్సు ఉన్న ఓ విద్యార్థి హోం వర్క్ చేయకుండా స్కూలుకు వచ్చాడు. అతనికి ఆ పాఠశాల టీచర్ పనిష్మెంట్ ఇచ్చాడు. క్లాసులో ఉన్న అమ్మాయిలతో ఆరు రోజులపాటు 168 చెంపదెబ్బలు కొట్టించాడు. బుగ్గలు కందిపోగా.. విషయం తెలిసిన ఆ విద్యార్థి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా కేంద్రం నుంచి 34 కిలోమీటర్ల దూరంలో ఉన్న ధందలా తహశీల్ కార్యాలయం పరిధిలోని గిరిజన పాఠశాలలో విద్యార్థి అనుష్కసింగ్ తండ్రి శివ్‌ప్రతాప్‌సింగ్ ఫిర్యాదు చేశారు. తన బిడ్డ హోం వర్క్ చేయలేదని పాఠశాల మాస్టర్ ఆరురోజులపాటు విద్యార్థినులచేత తలా రెండు చెంపదెబ్బలు కొట్టించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో తనయుడి ఆరోగ్యంపై ప్రభావం చూపిందని తెలిపారు. అనారోగ్యంతో కోలుకోవటంలేదని ఆయన వాపోయారు. స్కూలుకు పోవటానికి భయపడుతున్నాడని చెప్పారు. ఈ ఘటనపై పలువురు విద్యార్థుల తలిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పద్మావత్ ప్రదర్శిస్తున్న థియేటర్‌పై బాంబు దాడి



చెన్నై : తమిళనాడులో పద్మావత్ సినిమా ప్రదర్శించే థియేటర్‌పై పెట్రోల్ బాంబు విసిరిన సంఘటన సంచలనం కలిగించింది. కాగా ఈ ప్రమాదంలో ఎవరికి గాయలు కాలేదని పోలీసులు పేర్కొన్నారు. సేలం జిల్లాలో కొత్త బస్టాండుకు సమీపంలో ఉన్న థియేటర్ల సముదాయంలోని ఒక హాల్లో పద్మావత్ చిత్రాన్ని ప్రదర్శిస్తున్నారు. ఆసమయంలో బైకులపై వచ్చిన నలుగురు వ్యక్తులు పెట్రోల్ బాంబు విసిరారు. వెంటనే అప్రమత్తమైన శడ థియేటర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. దీంతో థియేటర్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుల కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. కాగా, ఈ బాంబు దాడితో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. దక్షిణ భారతంలో ఈ చిత్రప్రదర్శనకు ఎలాంటి ఆటంకాలు లేవని భావిస్తున్న తరుణంలో ఈ బాంబు విసరడం గమనార్హం.

బలగాల కాల్పుల్లో ఇద్దరు పౌరులు మృతి

- కాశ్మీర్‌లో ఘటన

శ్రీనగర్ : నిరసనకారులపై భద్రతాదళాలు కాల్పులు జరపడంతో ఇద్దరు పౌరులు ప్రాణాలు కోల్పోగా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జమ్మూకాశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో చోటు చేసుకున్నది. షోపియాన్‌లోని గంగాపోరా ప్రాంతంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఆర్మీ, పోలీసు బలగాలకు, స్థానికులకు మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. ఈ క్రమంలోనే బలగాలపై నిరసనకారులు రాళ్లు రువ్వారు. ఆందోళనకారులపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు యువకులు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. గాయపడిన మరికొందరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘర్షణలో పలువురు పోలీసులకు కూడా గాయాలైనట్టు సమాచారం. యువకుల మృతికి నిరసనగా ఆదివారం కాశ్మీర్ బంద్‌కు వేర్పాటువాదులు పిలుపునిచ్చారు.

మహారాష్ట్రలో నదిలో పడిన బస్సు

- 13 మంది మృతి, ముగ్గురికి గాయాలు
- దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా దుర్ఘటన

ముంబయి: మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న మినీ బస్సు అదుపుతప్పి పక్కనే ఉన్న నదిలో పడింది. ఈ దుర్ఘటనలో 13 మంది చనిపోగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని పూణేకు చెందిన 16 మంది మినీ బస్సులో శుక్రవారం ఓ దేవాలయానికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. కాగా.. శుక్రవారం అర్ధరాత్రి కొల్హాపూర్ జిల్లా శివారులో ఉన్న బ్రిడ్జిపైకి రాగానే బస్సు అదుపు తప్పి పంచగంగా నదిలో పడిపోయింది. బస్సు నదిలో పడటాన్ని గమనించిన కొందరు.. వెంటనే పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతి చెందిన వారిలో ముగ్గురు మహిళలు, ఆరుగురు చిన్నారులు, తొమ్మిది నెలల పాప ఉన్నట్టు పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. గాయపడిన వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు వివరించారు. డ్రైవర్ నిద్ర మత్తులో ఉండటమే ప్రమాదానికి కారణమని తెలుస్తున్నది.

కర్ణిసేన బెదిరింపులు

- జైపూర్ ఉత్సవానికి సెన్సార్ బోర్డ్ చైర్‌పర్సన్ డుమ్మా

జైపూర్ : జైపూర్‌లో జరిగే సాహితి ఉత్సవానికి సెన్సార్ బోర్డు చైర్‌పర్సన్ ప్రసూన్ జోషి హాజరు కావడం లేదు. సాహితి ఉత్సవంలో ఆదివారం జరిగే ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొనాల్సి ఉంది. రాజపుత్రులకు చెందిన కర్ణిసేన నుంచి పదేపదే బెదిరింపులు వస్తున్న నేపథ్యంలో ఆయన ఈ కార్యక్రమానికి హాజరుకావడంలేదని తెలిసింది. సంజయ్ లీలా భన్సాలి నిర్మించిన పద్మావత్ సినిమాను విడుదల చేసేందుకు సెన్సార్ బోర్డు అనుమతి ఇచ్చిన తరువాత కర్ణిసేన నుండి ఆయనకు బెదిరింపులు వస్తున్నాయి.

జుమా నమాజ్‌కు మహిళా ఇమామ్

కేరళలో అపూర్వ, అరుదైన ఘటన

దేశంలో తొలిసారి



తిరువనంతపురం : కేరళలో అపూర్వ ఘటన చోటుచేసుకుంది. దేశంలోనే తొలిసారిగా... కేరళలో ఒక ముస్లిం మహిళ శుక్రవారం నిర్వహించే జుమా నమాజ్ కు ఇమామ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఉత్తర కేరళలోని మల్లప్పురంలో ఈ అరుదైన ఘటన చోటుచేసుకుంది. ఖురాన్ సన్నెట్ సొసైటీ ఆధ్వర్యంలో ముస్లింలకు శుభప్రదమైనదిగా భావించే రోజైన శుక్రవారం ప్రార్థనకు జమితా టీచర్ (34) నేతృత్వం వహించారు. 'ఈ దశను చేరుకోవడానికి పలువురి నుంచి నేను విమర్శలను ఎదుర్కొన్నాను. మహిళలు ఈ పదవిని చేపట్టడం, ఈ అధికారాన్ని పొందడం ఇష్టపడని పురుషులు అనేకమంది ఉన్నారు. స్త్రీ, పురుషుల మధ్య ఎలాంటి వివక్షా లేదని ఖురాన్‌లో స్పష్టంగా ఉన్నది' అని ఇమామ్ జమితా టీచర్ చెప్పారు.

ఈ గౌరవం అంత ఈజీగా రాలేదు

జమితా టీచర్‌కు ఈ గౌరవం అంత సులభంగా ఏమీ రాలేదు. కొన్నేండ్లకు ముందు.. కేరళ రాజధాని తిరువంతపురం నుంచి కొంతమంది ఆమెను బహిష్కరించారు. ఆ మతంలో ఉన్న వివక్షను ప్రశ్నిస్తూ, తన అభిప్రాయాలను చాలా బలంగా వినిపించిన.. ఆమెపై చంపేస్తామంటూ బెదిరింపులు సైతం వచ్చాయి. 2016లో నగరాన్ని విడిచిపెట్టిన ఆమె.. బంధువుల ఇంట్లో తలదాచుకుంది. ఆ తర్వాత, ఖురాన్ సన్నెట్ సొసైటీ ఆమెకు ఆహ్వానం పలికింది. ఆ సొసైటీ మద్దతుతో ఇమామ్ బాధ్యతలను స్వీకరించింది. ఈ రోజు ఆ సొసైటీకి ఆమె కార్యదర్శి. ఖురాన్ ప్రకారం.. మహిళలకూ సమాన హక్కులున్నాయి అని ఆ సొసైటీ స్పష్టంచేస్తోంది. 'ఐదారు నెలల క్రితం నుంచి దీనిపై విస్తృత చర్చ జరిగింది. విభిన్న అభిప్రాయాలొచ్చాయి. ఖురాన్‌ను ఆధారం చేసుకునే మేం మా చర్చను ముందుకు తెచ్చాం. శుక్రవారం ప్రార్థనలకు మహిళలు నేతృత్వం వహించరాదని ఖురాన్‌లో ఎక్కడా లేదు' అని ఖురాన్ సన్నెట్ సొసైటీ సీనియర్ నేత ఎంఎస్ రషీద్ అన్నారు. కాగా ఆమెపై ముస్లిం మతపెద్దలు మండిపడుతున్నారు.



రేపటి నుంచి పార్లమెంట్

ఫిబ్రవరి 1న వార్షిక బడ్జెట్...

- జనవరి 31న ఆర్థిక సర్వే
- సాధారణ ఎన్నికలకు ముందు బీజేపీ పూర్తిస్థాయి బడ్జెట్
- బీజేపీ సర్కారుకు వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఐక్యత
- రెబల్ జడ్జిలు,పద్మావత్‌పై హాట్ హాట్ !



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు రేపటి నుంచి ప్రారంభంకానున్నాయి. ఫిబ్రవరి 1వ తేదీన 2018-19 వార్షిక బడ్జెట్‌ను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ సభలో ప్రవేశపెట్టనున్నారు. అందుకు ఒకరోజు ముందుగా అంటే జనవరి 31న కేంద్ర ఆర్థిక సర్వేను జైట్లీ సభ ముందుంచనున్నారు. ఉభయసభలనుద్దేశించి సోమవారం ఉదయం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేసే ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. జనవరి 29న ప్రారంభమయ్యే ఈ సమావేశాలు ఫిబ్రవరి 9తో ముగియనున్నాయి. ఇక రెండో దఫా బడ్జెట్ సమావేశాలు మార్చి 5న ప్రారంభమై ఏప్రిల్ 6వ తేదీతో పూర్తికానున్నాయి. మోడీ సర్కారు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ట్రిపుల్ తలాక్ బిల్లుతో పాటు ఓబీసీ కమిషన్ బిల్లును ఈ సమావేశాల్లో ఆమోదించుకోవాలన్న పట్టుదలతో ఉంది. కాగా ఈ సమావేశాల్లో పద్మావత్ అంశంతో పాటు సుప్రీంకోర్టు జడ్జీల విషయం పార్లమెంట్‌ను కుదిపేయనుంది. మరోవైపు ఈ సమావేశాలు సజావుగా సాగేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని కేంద్రం కోరింది. ఇందుకు నేడు(ఆదివారం) రెండు అఖిలపక్ష సమావేశాలకు పిలుపునిచ్చింది. పార్లమెంట్ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ నేతృత్వంలో ఒకటి, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ అధ్యక్షతన మరోకటి సమావేశం జరగనుంది. కాగా కేంద్ర సర్కారుకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఐక్యమవుతున్నాయి.

2019 సాధారణ ఎన్నికలకు ముందు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఈ నేపథ్యంలో మధ్యతరగతి వర్గానికి కొన్ని మినహాయింపులు ఇవ్వాలన్న ఉద్దేశంతో ఉన్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80-సీ పరిమితిని పెంచాలని భావిస్తున్నట్టు సంబంధిత వర్గాల సమాచారం. అదే సమయంలో ట్రిపుల్ తలాక్ బిల్లును ఎట్టిపరిస్థితుల్లో మొదటి దఫా సమావేశాల్లోనే గట్టెక్కించాలన్న పట్టుదలతో ఉంది. ట్రిపుల్ తలాక్ పద్ధతిని పాటించిన వారికి మూడేండ్ల జైలు శిక్ష విధించాలన్న కేంద్ర నిర్ణయంపై ప్రతిపక్షాలు వ్యతిరేకత వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లు ప్రస్తుతం రాజ్యసభలో పెండింగ్‌లో ఉంది. ఇక ఓబీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పిస్తూ తీసుకొచ్చిన బిల్లును సైతం ఆమోదించుకోవాలని కేంద్రం భావిస్తోంది. ఇక రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తొలిసారి ఉభయసభలనుద్దేశించి ప్రసంగం చేయనున్నారు.

ప్రతిపక్షాల సమావేశం...

కేంద్రంలోని మోడీ సర్కారుకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఏకమవుతున్నాయి. బీజేపీ సర్కారు అవలంబిస్తున్న ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యతిరేక విధానాలపై విపక్షాలు గుర్రుగా ఉన్నాయి. విపక్షాల సమావేశానికి ఎన్సీపీ అధినేత శరద్‌పవార్ నేతృత్వం వహిస్తున్నారు. ఇప్పటికే జనవరి 26వ తేదీన ముంబయిలో 'రాజ్యాంగం పరిరక్షించండి' అంటూ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీకి సీపీఐ నేత డీ రాజాతో పాటు శరద్ యాదవ్, ఒమర్ అబ్దుల్లా, సుశీల్‌కుమార్ షిండే, దినేష్ త్రివేది, హార్ధిక్‌పటేల్ తదితరులు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో 29వ తేదీన మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు.

తుఫాను సృష్టించనున్న పద్మావత్, రెబల్ జడ్జిల అంశం...

బడ్జెట్ పార్లమెంట్ మొదటి దఫా సమావేశాల్లో సుప్రీంకోర్టు రెబల్ జడ్జీల అంశంతో పాటు పద్మావత్ వ్యవహారం తుఫాను సృష్టించే అవకాశం ఉంది. ముఖ్యంగా పద్మావత్ సినిమా విడుదల విషయంలో బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించిన తీరు, కర్ణిసేన విధ్వంసకాండపై విపక్షాలు కేంద్రాన్ని నిలదీయాలని భావిస్తున్నాయి. ప్రతిపక్షాలు రెబల్ జడ్జిల అంశాన్ని కూడా తెరపైకి తెచ్చేలా పావులు కదుపుతున్నాయి.

సులభతర వాణిజ్యం కోసం పాకులాట..

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం త్వరలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై కసరత్తు చేస్తూనే మరోవైపు కార్మిక చట్టాల్లో సవరణల కోసం యోచిస్తోంది. కార్మికశాఖ ఇప్పటికే అందుకు సంబంధించిన ప్రతిపాదనలను తన వెబ్‌సైట్‌లో పెట్టి అభిప్రాయాలను స్వీకరిస్తోంది. అయితే, అవి మోడీ ప్రభుత్వం చెబుతున్న సులభతర వాణిజ్యంలో భాగంగా కంపెనీల యజమానులకు మేలు చేసేవే తప్ప కార్మిక లోకానికి ఏమాత్రం అనుకూలం కావన్నది పరిశీలిస్తే అర్థమవుతోంది...



కార్మిక చట్టాల్లో మార్పునకు కేంద్రం యోచన

- కారణం చెప్పకుండా ఉద్యోగులను తొలగించే వెసులుబాటు
- నోటీసు ఇవ్వాలన్న నిబంధనకూ సవరణ
- ఒప్పంద కార్మికుల చట్టానికి సవరణ ప్రతిపాదనలు

నవతెలంగాణ డెస్క్

నిర్ణీత(కాల)వ్యవధి లేదా ఒప్పంద ఉద్యోగుల నియామక నిబంధనలను సవరించేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కేంద్రంలో మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం తమ హయాంలోనూ అభివృద్ధి జరుగుతోందంటూ చెప్పుకుంటుండగా ప్రతిపక్షాలు, ఆర్థికవేత్తల నుంచి విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా మోడీ హయాంలో యువతకు కొత్తగా వచ్చిన ఉద్యోగాలేమీ లేవన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఉద్యోగాల కల్పనలేని అభివృద్ధి వల్ల కొన్ని బడా కార్పొరేట్ సంస్థలకే మేలు జరుగుతోంది తప్ప సామాన్యుల జీవితాల్లో మార్పేమీ లేదని ఆర్థికవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర కార్మికశాఖ వెబ్‌సైట్‌లో ఒప్పంద ఉద్యోగ నిబంధనలకు సంబంధించి కొన్ని సవరణలు ప్రతిపాదిస్తూ అభిప్రాయాలు కోరారు. సూచనలు, అభ్యంతరాలు తెలిపేందుకు ఫిబ్రవరి 9ని గడువుగా నిర్ణయించారు.

'పారిశ్రామిక ఉద్యోగాలు(స్థాయీ ఆదేశాలు) కేంద్ర(సవరణ) నిబంధనలు,2018' పేరుతో కార్మిక శాఖ వెబ్‌సైట్ ద్వారా అభిప్రాయాలు సేకరిస్తున్నారు. 1946లోనే నిర్ణీత వ్యవధి ఉద్యోగులు లేదా కార్మికుల కోసం ఉద్దేశించిన చట్టం రూపొందగా, మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దానికి 2016లోనే సవరణలను ప్రతిపాదించారు. తాజాగా నూతన చట్టం రూపకల్పన కోసం కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. పాత చట్టంలో వస్త్ర, తోళ్ల పరిశ్రమలకే పరిమితమై నిబంధనలుండగా వాటిని ఇతర రంగాలకూ విస్తరించనున్నట్టు తాజాగా ప్రతిపాదించారు. నూతన చట్టం అమలులోకి వస్తే అది పారిశ్రామికవేత్తలు, కంపెనీల యజమానులకే అనుకూలమన్నది గమనార్హం. మోడీ ప్రభుత్వం చెబుతున్న సులభతర వాణిజ్యాన్ని ప్రోత్సహించడంలో భాగంగానే కార్మికశాఖ ఈ కొత్త చట్టానికి రూపకల్పన చేసింది. ఈ చట్టం ప్రకారం ఉద్యోగులను తాము అనుకున్నదే తడవుగా తొలగించే అధికారం కంపెనీల యజమానులకు ఉంటుంది. ముందస్తు నోటీసులు ఇవ్వాలన్న నిబంధనను సవరణ చట్టంలో తొలగిస్తున్నారు. ఎలాంటి నోటీస్ లేకుండానే ఒప్పంద కార్మికులను తొలగించే వెసలుబాటును ఈ చట్టం ద్వారా కంపెనీల యజమానులకు కల్పిస్తున్నారు.

ఒప్పంద కార్మిక చట్టం ద్వారా గౌరవనీయ ఉద్యోగాల కల్పన జరగదు. ఎన్నికల ఏడాదిలో కొత్తగా ఉద్యోగాలు కల్పించినట్టు లెక్కల్లో చూపేందుకు ప్రభుత్వానికి మాత్రం అవకాశముంటుందని శ్రామిక ఆర్థికవేత్త, ప్రొఫెసర్ కెఆర్ శ్యాంసుందర్ అన్నారు.

అయితే, నిర్ణీత వ్యవధి ఉద్యోగుల కనీస వేతనాలకు ఈ చట్టం ద్వారా హామీ ఇవ్వనున్నారు. వరుసగా మూడు నెలలకన్నా ఎక్కువ రోజులు పని చేసిన ఉద్యోగులకు 15 రోజుల ముందు నోటీస్ ఇస్తారు. కానీ, తొలగిస్తున్న కారణాన్ని లిఖితపూర్వకంగా ఉద్యోగికి తెలియజేయాల్సిన అవసరముండదు. భారత్‌లో నిరుద్యోగులు 3.5 శాతం ఉన్నట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. కొత్తగా ఉద్యోగాల్లో చేరేవారిలో (15-24 ఏండ్ల వయసువారిలో) మాత్రం ఇది మరింత అధికంగా ఉన్నది. వీరిలో నిరుద్యోగిత 2014లో 10 శాతం ఉండగా, అది 2019కల్లా 10.7 శాతానికి పెరగనున్నదని అంతర్జాతీయ కార్మిక సంస్థ తన తాజా నివేదికలో తెలిపింది.



'ఉపాధి' చట్టంపై కసరత్తు

నిధులు పెంచాలని ఆర్థికశాఖతో చర్చలు

- కనీస వేతనాలను నిర్ణయించడంలో కొన్నేండ్లుగా అన్యాయం..!
- తేల్చి చెప్పిన మహేంద్రదేవ్ కమిటీ
- గతేడాది పెంచినది ఒక్క రూపాయే
- 2017-18 బడ్జెట్‌లో కేటాయించింది రూ.48,000 కోట్లు

నవతెలంగాణ డెస్క్

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) కింద కనీస వేతనాలను నిర్ణయించేందుకు ఇప్పటివరకూ అనుసరించిన పద్ధతిని మార్చాలని కేంద్రం యోచిస్తున్నట్టుగా తెలుస్తోంది. ఈ పథకం కింద పని చేస్తున్న గ్రామీణ పేదలకు కూలీ రేట్లను నిర్ణయించేందుకు వినియోగదారుల ధరల సూచీ-వ్యవసాయ కార్మికుల (సీపీఐ-ఏఎల్)ను ఇప్పటివరకూ ప్రామాణికంగా తీసుకు న్నారు. సీపీఐ-గ్రామీణ(సీపీఐ-ఆర్)ను ప్రామాణికంగా తీసుకునేందుకు ఆర్థిక మంత్రిత్వశాఖతో కేంద్ర గ్రామీణా భివృద్ధిశాఖ సంప్రదింపులు జరుపుతోంది. సీపీఐ-ఆర్‌ను ప్రామాణికంగా తీసుకోవాలని మహేంద్రదేవ్ కమిటీ చేసిన సిఫారసుకు తమ శాఖ ఆమోదం తెలిపిందని, ఆర్థికశాఖతో దీనిపై చర్చిస్తున్నట్టు గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి అమర్‌జీత్‌సిన్హా తెలిపారు.



గ్రామీణ ఉపాధి కూలీ రేట్లను రాష్ట్రాల్లో అమలవుతున్న కనీస వేతనాలకు సమానం లేదా అంతకన్నా అధికం చేయాలని ఆర్థికవేత్త ఎస్ మహేంద్రదేవ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ సిఫారసు చేసింది. సీపీఐ-ఏఎల్‌కన్నా సీపీఐ-ఆర్‌లో ఎక్కువ వినియోగ వస్తువులను పరిగణనలోకి తీసుకుంటారని కమిటీ తెలిపింది. ప్రతిఏటా సీపీఐ-ఆర్ ఆధారంగా గ్రామీణ ఉపాధి కూలీ రేట్లను పెంచాలని కమిటీ సూచించింది.

ఈ పథకం కింద 2017-18లో సీపీఐ-ఏఎల్ ఆధారంగా కూలీ రేట్లను 2.7 శాతం పెంచారు. అయితే, 2013 నుంచి అమలు చేస్తున్న జాతీయ ఆహార భద్రత పథకం (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ) వల్ల గ్రామీణ ప్రజలకు ఆహార ధాన్యాలు సబ్సిడీ రేట్లకు లభ్యమవుతున్నాయి. దీంతో, బియ్యం ధరను కిలో రూ.3గా, తృణధాన్యాలను కిలో రూ.1గా పరిగణనలోకి తీసుకోవడం వల్ల ధరల సూచీలో తక్కువ మొత్తం లెక్కలోకి వస్తుంది. మరోవైపు ఆహారేతర వినియోగ వస్తువుల ధరలు విపరీతంగా పెరగగా వాటికి సీపీఐ-ఏఎల్‌లో స్థానం లేకపోవడం గమనార్హం. దీంతో, గత కొన్నేండ్లుగా ఈ పథకం కింద పని చేస్తున్న గ్రామీణ పేదలు అతి తక్కువ వేతనాలను పొందుతున్నారు. 2017-18లో వీరి దినసరి కూలీ గతేడాదికన్నా కేవలం ఒక్క రూపాయి మాత్రమే పెరి గింది. సీపీఐ-ఆర్‌ను పరిగణనలోకి తీసుకుంటే గ్రామీణ ఉపాధి హామీ కార్మికుల వేతనాలు పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వ అధికారి సిన్హా స్పష్టం చేశారు. ఈ ఫార్ములా ప్రకా రం సమీక్ష జరిగితే రానున్న బడ్జెట్‌లో ఎంజీఎన్‌ఆర్‌ఈజీ ఎస్‌కు కేటాయించే నిధులకు రూ.4500 కోట్లమేర అదనంగా చేర్చాల్సి ఉంటుందని ఆ శాఖ అధికారి ఒకరు తెలిపారు. 2017-18లో ఈ పథకానికి రూ.48,000కోట్లు కేంద్రం కేటాయించింది. 215 కోట్ల వ్యక్తిగత పనిదినాలను అంచనా వేసింది. ఫిబ్రవరిలో పార్లమెంట్ ముందుకు రానున్న బడ్జెట్‌లో ఈ పథకానికి 4 శాతం అదనంగా చేర్చితే రూ.55,000 కోట్లు కేటాయించాల్సి ఉంటుంది. 2018-19 బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.55,000 కోట్లు అవసర మవుతాయని గతేడాది ఆగస్టులోనే ఆర్థికశాఖ అంచనా వేసినట్టు అమర్‌జీత్‌సిన్హా తెలిపారు.

పైసలిస్తున్నం.. పక్కా లెక్కివ్వండి

మొత్తం భూమెంత?
అందులో సాగెంత?

- అధికారులిచ్చే సాగు విస్తీర్ణం లెక్కలన్నీ తప్పే
- సాగు చేసిన భూమికే పెట్టుబడి పథకం : వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న పోచారం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'పెట్టుబడి పథకం కింద ఎకరానికి రూ. 4 వేల చొప్పున ఇవ్వబోతున్నాం. యాసంగిలో రూ. 4వేలు, వానాకాలంలో రూ.4వేలు. మొత్తం రూ. 8వేలు ఇవ్వబోతున్నాం. రాష్ట్రంలో మొత్తం భూమి ఎంత ఉంది? అందులో పంటల సాగు విస్తీర్ణం ఎంత? సాగు విస్తీర్ణానికి సంబంధించి జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్స్ (డీఏవో)లు ఇప్పటి వరకు ఇచ్చిన లెక్కలన్నీ తప్పే. ఇప్పటికైనా జిల్లాల్లో ఏఈవో, ఏవోల సహకారంతో పూర్తిస్థాయి సమాచారంతో రావాలి' అని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మార్చి 11న రైతులకు పట్టా పాసుపుస్తకాలు ఇవ్వబోతున్నామన్నారు. ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ యాంత్రీకరణ, రైతు సమన్వయ సమితులు, పెట్టుబడి పథకం అమలు తదితర అంశాలపై శనివారం వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో సమీక్ష నిర్వ హించారు.

ఈ సందర్భంగా మంత్రి పోచారం మాట్లాడుతూ పెట్టుబడి పథకం కింద రైతులకు ఎకరానికి రూ. 4వేల చొప్పున ఇవ్వబోతున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సాగు భూమి ఎంత, అందులో సాగవుతున్నది ఎంత అనే వివరాలు పంటల వారీగా సేకరించాలన్నారు. సాగు భూమినే పరిగణలోకి తీసుకుంటామని, పడావు పడ్డ భూమి, సాగుకు యోగ్యంగా లేని భూములతో ప్రభుత్వానికి సంబంధం లేదన్నారు. జిల్లా స్థాయి అధికారులు సాగు విస్తీర్ణంలో తప్పుడు లెక్కలు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సారి యాసంగి సాధారణ విస్తీర్ణాన్ని దాటిందన్నారు. పత్తి, కంది,మిర్చి, పసుపు పంటలు కొనసాగుతున్న చోటకాక మిగతా చోట్ల ఇతర అన్ని రకాల పంటలు సాగు చేశారని చెప్పారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఒక్క కుంట భూమి కూడా పడావు లేదన్నారు. అధికారులు మాత్రం లెక్క చూపించలేకపోతున్నారని చెప్పారు.

ఐదేండ్లు పని చేసిన ఏఈవోలను బదిలీ చేయాలి

ఒకే దగ్గర ఐదేండ్లకు పైబడి పనిచేసిన ఏఈవోలను బదిలీ చేయాలని మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ శాఖ కమిషనర్‌ను ఆదేశించారు. ప్రస్తుతం 1787 మంది ఏఈవోలున్నారని, వారం పది రోజుల్లో మరో 851 మంది ఏఈవోలు రాబోతున్నారని చెప్పారు. మొత్తం 2638 మందితో జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. రైతులు పంటలకు ప్రీమియం చెల్లించే విధంగా అధికారులు చైతన్యపర్చాలని కోరారు. ఇన్సూరెన్స్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో రైతు వేదిక భవనాలు నిర్మిస్తామన్నారు.

చెట్లను బతికించకుంటే సర్పంచ్ పోస్టు పోతుంది

హరితహారం, పచ్చదనం-పరిశుభ్రత పథకం కింద నాటిన చెట్లనుగానీ, గ్రామాల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించకపోయినా సర్పంచ్‌ల పోస్టు పోతుందని మంత్రి పోచారం హెచ్చరించారు. కనీసం 75శాతం చెట్లను బతికించాలన్నారు, వీధిలైట్లు, గ్రామాల్లో చెత్తచెదారం లేకుండా చూడాల్సిన బాధ్యత సర్పంచ్‌లదేనన్నారు. ఈ బాధ్యతలు నెత్తినవేసుకొని చేయగలిగే శక్తిసామర్థ్యాలున్నవారే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని చెప్పారు. దీనికి సంబంధించి పంచాయతీరాజ్ శాఖ చట్టంలో కొత్త మార్పులు తీసుకురాబోతున్నామని ఈసందర్భంగా మంత్రి తెలిపారు. ఆరు నెలల్లో ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ సమీక్షలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి. పార్థసారథి, కమిషనర్ జగన్‌మోహన్, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ విజయ్‌కుమార్, జిల్లాల డిఏవోలు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 17న వెయ్యి ట్రాక్టర్ల పంపిణీ

ఫిబ్రవరి 17న ఖమ్మం, కొత్తగూడెంలో 1000 ట్రాక్టర్లు పంపిణీ చేయబోతున్నట్టు మంత్రి పోచారం చెప్పారు. అదే తరహాలో మిగతా జిల్లాల్లోనూ 'ట్రాక్టర్ మేళా' నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ట్రాక్టర్ల పంపిణీలో పైరవీలకు తావుల లేకుండా చూడాలన్నారు.

10 సబ్సిడీ గొర్రెలు మృతి

- 30 జీవాలకు అనారోగ్యం



నవతెలంగాణ-ఖానాపురం

తీసుకొచ్చిన 24 గంటలు కూడా కాకముందే 10 సబ్సిడీ గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మరో 30 గొర్రెలు అనారోగ్యంతో ఉన్నాయి. ఈ ఘటన వరంగల్ రూరల్ జిల్లా ఖానాపురం మండలం ధర్మరావుపేటలో శనివారం జరిగింది. ధర్మరావుపేటలో మొదటి విడత కింద 100 యూనిట్ల గొర్రెను పంపిణీ చేశారు. రెండో విడతలో శనివారం 24 యూనిట్ల గొర్రెలు పంపిణీచేశారు. అధికారులు, యాదవులు అనంతపురం జిల్లాకు వెళ్లి గొర్రెను శుక్రవారం రాత్రి గ్రామానికి తీసుకొచ్చారు. శనివారం ఉదయం 10 గొర్రె మృత్యువాత పడ్డాయి. మరో 30 గొర్రె అస్వస్థతతో ఉన్నాయి. దీనిపై యాదవులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గొర్ల పంపిణీలో అధికారులు, దళారులు కుమ్మక్కై బక్కచిక్కిన గొర్రెలను అంటగట్టడంతో యాదవులు నష్టపోతున్నారని తెలంగాణ గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం వరంగల్ రూరల్ జిల్లా కార్యదర్శి పరికి మధుకర్ అన్నారు. ధర్మరావుపేటలో చనిపోయిన గొర్రెలను అధికారులు పరిశీలించి ఇన్సూరెన్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆస్ట్రేలియాలో మైనార్టీలకు ఉచిత విద్య

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ఆస్ట్రేలియాలో మైనార్టీలకు ఉచిత విద్యను అందించేందుకు మెల్‌బోర్న్‌లోని "విక్టోరియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ" ముందుకు వచ్చింది. ఈ మేరకు సంస్థ సీఈఓలు అర్జున్ సూరపనేని, నిశ్చర్ రెడ్డి శనివారం సచివాలయంలో హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డితో చర్చలు జరిపారు. మంత్రి ఇటీవల ఆస్ట్రేలియాలో పర్యటించినప్పుడు తెలంగాణ విద్యార్థులకు ఏదైనా ప్రయోజనం చేకూర్చాలని వీఐటీ సంస్థ సీఈఓలకు విజ్ఞప్తి చేశారు. దీనికి వారు స్పందిస్తూ డిగ్రీ, పీజీ స్థాయిలో ఉచిత విద్యను అందించాలని నిర్ణయించామన్నారు.

శ్రీనివాస్ హంతకులపై చర్యలు తీసుకోవాలి

డీజీపీకి ఉత్తమ్ బృందం వినతి


డీజీపీకి వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బొడ్డుపల్లి శ్రీనివాస్‌ను హత్య చేసిన హంతకులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. నల్లగొండ నడిబొడ్డున శ్రీనివాస్‌ను హత్య చేశారని పేర్కొన్నారు. ఇదే అంశంపై శనివారం పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో డీజీపీ మహేందర్‌రెడ్డికి టీపీసీసీ నేతలు వినతిపత్రం సమర్పించారు. తగిన చర్యలు తీసుకుంటామని డీజీపీ హామీ ఇచ్చినట్టు ఉత్తమ్ తెలిపారు. ఆయన వెంట మండలిలో ప్రతిపక్ష నేత షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకరరెడ్డి, గీతారెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, వి హనుమంతరావు, గూడూరు నారాయణరెడ్డి, మల్లు రవి, చిరుమర్తి లింగయ్య, యూత్ కాంగ్రెస్ నేతలు అనిల్‌కుమార్, గురజాల వెంకట్ తదితరులు ఉన్నారు. అనంతరం ఉత్తమ్ మాట్లాడుతూ శ్రీనివాస్‌ను టీఆర్ఎస్ కార్యకర్తలే హత్య చేశారని ఆరోపించారు. తనకు ప్రాణహాని ఉందని గన్‌మెన్లు కావాలని ప్రభుత్వాన్ని కోరినా ప్రభుత్వం ఇవ్వలేదని విమర్శించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం నల్లగొండ జిల్లాలో క్రిమినల్ చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. హత్యకు కొన్ని రోజుల ముందు శ్రీనివాస్‌ను రెస్టారెంట్‌కు పిలిచి వీరేశం బెదిరించారని చెప్పారు. ఆధారాలతో సహా పోలీసులకు ఇచ్చినా ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు.

కోమటిరెడ్డి, చిరుమర్తి లింగయ్యకు భద్రత పెంచాలి

ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు ప్రాణహాని ఉందని, వారికి వెంటనే భద్రత పెంచాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. వారికి భద్రత పెంచాలని డీజీపీకి మరో లేఖ ఇచ్చారు. శ్రీనివాస్ విషయంలో న్యాయం జరగకపోతే సీబీఐ విచారణ కోరతామన్నారు. వి హనుమంతరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే వేముల విరేశం జిల్లాలో బెదిరింపులకు పాల్పడుతున్నారని, నయిమ్ తరహాలో శ్రీనివాస్ హంతకులను ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. బీసీలను టీఆర్ఎస్ ప్రభుత్వం పొట్టన పెట్టుకుంటుందన్నారు. కోమటి రెడ్డి వెంకట్ రెడ్డికి ఏదయినా జరిగితే రాష్ట్రం అగ్ని గుండంగా మారుతుందని హెచ్చరించారు. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే వేముల వీరేశం వల్లే హత్య జరిగిందన్నారు. సీఎం, జగదీశ్‌రెడ్డి అండ చూసుకొని వీరేశం బెదిరింపులకు పాల్పడుతున్నారని చెప్పారు. తనకు, లింగయ్యకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మా సహనాన్ని పరిరక్షించొద్దని ఆయన హెచ్చరించారు.

తెలంగాణ చరిత్ర, జీవన శైలి సజీవం

- మల్టీ కలర్ క్యాలెండర్ ఆవిష్కరణలో మండలి చైర్మెన్ స్వామిగౌడ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఫోటో జర్నలిస్టులు చిత్రీకరించిన తెలంగాణ చరిత్ర ప్రకృతి, జీవన శైలిని సజీవంగా అపురూప దృశ్యాలుగా ఉన్నాయని తెలంగాణ శాసనమండలి చైర్మెన్ స్వామిగౌడ్ చెప్పారు. శనివారం మండలిలోని తన చాంబర్‌లో తెలంగాణ ఫోటో జర్నలిస్ట్స్ సంఘం రూపొందించిన '2018 నూతన సంవత్సర మల్టీ కలర్ క్యాలెండర్'ను స్వామిగౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ గొప్ప చరిత్ర ప్రకృతి అందాలను మరియు బహుళ సంస్కృతి ప్రతిబింబిస్తున్న చిత్రాలను రాష్ట్రంలోని వివిధ దిన పత్రికల్లో పని చేస్తున్న ఫోటో జర్నలిస్టులు తీసిన చిత్రాలు ఈ క్యాలెండర్‌లో అద్భుతంగా పొందుపరిచారని, ఇది ప్రజలను అమితంగా ఆకర్షిస్తుందన్నారు. ఇక ముందు కూడా దాగి ఉన్న తెలంగాణ చరిత్ర ప్రకృతి అందాలు జీవన శైలి వెలికి తీసి తమ చిత్రాల ద్వారా ప్రజలకు తెలియజేయవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫోటో జర్నలిస్టు సంఘం అధ్యక్షులు అనుమల్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కె నరహరి, ఉపాధ్యక్షులు టి కిషోర్‌సింగ్, కోశాధికారి కె.అనిల్‌కుమార్, కార్యవర్గ సభ్యులు నక్క శ్రీనివాసులు అలీమ్ ఉద్దీన్ పి. మోహనచారి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధిక నీటిని వాడుకోవద్దు : ఈటల

- మార్చి చివరి వరకు ఆయకట్టుకు నీరు : మంత్రి ఈటల
- 24 గంటలు వద్దు.. 12 గంటలు చాలు
- రైతు యూనిట్‌గా బీమా : కరీంనగర్ జిల్లా పరిషత్ తీర్మానం



నవతెలంగాణ-కరీంనగర్ టౌన్

గతంలో బోరుబావుల ద్వారా ఎంత మేర మోటర్ల ద్వారా నీటిని వినియోగించారో ఇప్పుడూ అంతే వాడుకోవాలని, అధిక నీటిని వాడుకోవద్దని రైతులను మంత్రి ఈటల రాజేందర్ కోరారు. కరీంనగర్ జెడ్పీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ తుల ఉమ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సాగునీటి సరఫరా, సభ్యులకు అభివృద్ధి నిధులు, మిషన్ భగీరథ, రోడ్ల నిర్మాణంతో పాటు పలు అంశాలపై చర్చించారు. '24 గంటల కరెంటు ఇవ్వటం వల్ల ఎస్సారెస్పీ కాలువల మోటార్ల వాడకం అధికమైంది. దీంతో చివరి ఆయకట్టుకు నీరందట్లేదు. ఫలితంగా పంటలు ఎండిపోతున్నాయి. 24 గంటల కరెంటు వద్దు. దానిని 12 గంటలకు కుదించాలి' అని జిల్లా పరిషత్ సమావేశం తీర్మానించింది. మంత్రి ఈటల రాజేందర్ హాజరు కావడంతో సాగునీటి సరఫరానే ప్రధానాంశంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఈటల మాట్లాడారు. 24 గంటల విద్యుత్ వల్ల ఎస్సారెస్పీ కాలువల వెంట అక్రమ మోటార్ల ద్వారా నీటిని పంపు చేస్తున్నారని, దీంతో చివరి ఆయకట్టుకు నీరందట్లేదన్నారు. గతంలో బోరుబావుల ద్వారా ఎంత మేర మోటర్ల ద్వారా నీటిని వినియోగించారో ఇప్పుడూ అంతే వాడుకోవాలని రైతులను కోరారు. మార్చి చివరి వరకు పంటలకు దశలవారీగా సాగు నీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి వివరించారు. దీనిపై ముస్తాబాద్ జడ్పీటీసీ జనగామ శరత్ కుమార్.. 24 గంటల విద్యుత్‌ను 12 గంటలకు కుదించాలని కోరుతూ తీర్మానం ప్రవేశపెట్టగా, అధికార పార్టీ సభ్యులు ఆమోదించారు. ప్రతి రోజూ ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా సరిపోతుందని అన్నారు. ఖరీఫ్‌లో పత్తి వేసిన వారికి పెట్టుబడి కూడా రాలేదని సభ్యులు లేవనెత్తారు. దోమకాటు వల్ల సగం దిగుబడి పడిపోయిందని, ఇలాంటి సమయంలో పరిహారం ఎందుకు ఇవ్వడం లేదని జమ్మికుంట జడ్పీటీసీ ప్రశ్నించారు. బీమా ఉన్న వారికి మాత్రమే వర్తిస్తుందని సంబంధిత అధికారి చెప్పారు. గ్రామం యూనిట్‌గా తీసుకోవడం వల్లే రైతులకు బీమా అందడం లేదని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీదేవసేన తెలిపారు. రైతునే యూనిట్‌గా తీసుకోవడం వల్ల లబ్ది చేకూరుతుందని సూచించారు. ఈ మేరకు రైతు యూనిట్‌గా బీమా అమలు చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

ప్రస్తుతం జిల్లా పరిషత్ నిధులు లేక నిర్వీర్యమైందని, గతంలో సీనరేజ్, ఇతర రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి సంవత్సరానికి రూ.50లక్షల వరకు నిధులు వచ్చేవని చొప్పదండి జెడ్పీటీసీ సభ్యులు ఇప్పనపల్లి సాంబయ్య, పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో పంపిన ఉపాధి హామీ పథకం ప్రతిపాదనలు ఏమయ్యాయని ప్రశ్నించారు. దీనిపై మంత్రి ఈటల స్పందిస్తూ.. జెడ్పీటీసీ, ఎంపీపీకి రూ.20లక్షల చొప్పున అభివృద్ధి పనులు మంజూరు కానున్నాయని తెలిపారు. సమావేశంలో కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల కలెక్టర్లు సర్ఫరాజ్ అహ్మద్, శ్రీదేవసేన, కృష్ణభాస్కర్ పాల్గొన్నారు.

వచ్చే వానాకాలం లోగా
కల్వకుర్తి పనులు పూర్తి చేయాలి

- మంత్రి హరీశ్‌రావు ఆదేశం


మాట్లాడుతున్న హరీశ్‌రావు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

కల్వకుర్తి ప్రాజెక్టు కింద పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ వచ్చే వానాకాలం నాటికి పూర్తి చేయాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. శనివారం జలసౌధలో నాగర్ కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న కల్వకుర్తి పనులపై మంత్రి సమీక్షించారు. నాగర్‌కర్నూల్ శాసన సభ్యుడు మర్రి జనార్ధనరెడ్డి ఇటీవల జరిపిన జల విజయయాత్ర సందర్భంగా వచ్చిన విజ్ఞప్తులను మంత్రి పరిశీలించారు. దాదాపు 60 కి పైగా వచ్చిన వివిధ విజ్ఞప్తులపై వెంటనే స్పందించి వాటిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తెల్కపల్లి మండలం లక్నారమ్ గ్రామం నుంచి ఎమ్మెల్యే పాదయాత్ర జరిపారు. నాగర్‌కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, తిమ్మాజిపేట, తాడూరు, తెల్కపల్లి మండలాల్లో కల్వకుర్తి 29, 30 ప్యాకేజీల పనుల పురోగతిపై మంత్రి సమీక్షించారు. 2016-17లో కల్వకుర్తి కింద 280చెరువులు నింపగా, ఈ ఏడాది 350 చెరువులు నింపినట్టు అధికారులు మంత్రికి తెలిపారు. ఇందులో నాగర్‌కర్నూల్ నియోజక వర్గంలో 120 చెరువులు నింపినట్టు వారు చెప్పారు. కల్వకుర్తి కింద మొత్తం ఆయకట్టు 4.25 లక్షల ఎకరాలు కాగా గత ఏడాది 1.25 లక్షల ఎకరాలకు సాగు నీరందించామని, ఈ ఏడాది యాసంగిలో 2 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని అధికారులు వివరించారు. 29, 30 ప్యాకేజీలలో మిగిలిపోయిన డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ పనులు వచ్చే వానాకాలం నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఒప్పందం ప్రకారం గడువు లోగా పనులు చేయకపోతే సంబంధిత ఏజన్సీని తొలగించి వేరే ఏజన్సీతో పనులు చేయించాలని ఆయన ఆదేశించారు. కల్వకుర్తి మెయిన్ కెనాల్ సహా డిస్ట్రి బ్యూటరీల కింద మిగిలిన పనులన్నింటినీ ఖరీఫ్ కల్లా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, మహబూబ్ నగర్ సీఈ ఖగేందర్‌రావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

రాబందుల పాలనకు
చరమగీతం పాడాలి

- షుగర్ ఫ్యాక్టరీ తెరవకుంటే 5లక్షల మందితో ఆందోళన : మెట్‌పల్లి రైతుల గర్జన సభలో రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ- మెట్‌పల్లి

రాష్ట్రంలో రాబందుల పాలన సాగుతోందని, దానికి చరమగీతం పాడాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు రేవంత్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని వెంకటరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన చెరుకు రైతుల గర్జన సభలో రేవంత్ పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డిరాములు ఆధ్వర్యంలో మెట్‌పల్లిలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షను సందర్శించి, అక్కడ్నుంచి ర్యాలీగా వెంకట్‌రెడ్డి గార్డెన్‌కు చేరుకుని సభలో ప్రసంగించారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైతే వంద రోజుల్లో షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలో షుగర్ ఫ్యాక్టరీని నమ్ముకుని 50లక్షల మంది రైతు కుటుంబాలున్నాయని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి కాదా? అని నిలదీశారు. పసుపు, మిర్చి, సోయా, మొక్కజొన్న, వరి పంటలకు మద్దతు ధరల్లేక రైతులు అల్లాడుతున్నారని, రాష్ట్రంలో ఇప్పటివరకు 5 వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు టీడీపీలో ఉన్నప్పుడు.. ఫ్యాక్టరీని మూసేస్తే గేటుకు ఉరేసుకుంటానని డాంబీకాలు పలికారని, అది ఇప్పుడేమైందని ప్రశ్నించారు. 100 రోజుల్లో ఫ్యాక్టరీని పునరుద్ధరించకుంటే మళ్లీ మెట్‌పల్లికి వచ్చి 20 వేల మందితో ఫ్యాక్టరీ ఎదుట ధర్నా చేస్తామని, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావును రాజకీయంగా బొందపెడ్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక వంద రోజుల్లో షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని హామీనిచ్చారు. సభలో మాజీ ఎమ్మెల్యేలు విజయరామారావు, రాజారాం యాదవ్, జెడ్పీటీసీ సునిత, వెంకట్, మామిడి నారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

తెలంగాణలో ఆ నలుగురికే ప్రజాస్వామ్యం

మీట్ ది ప్రెస్‌లో మందకృష్ణ

- కేంద్రంలోనూ.. రాష్ట్రంలోనూ హక్కుల ఉల్లంఘన
- బీజేపీకి తగిన గుణ పాఠం చెబుతాం
- ఎస్సీ వర్గీకరణపై 29న అఖిలపక్షం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని, రాష్ట్రంలో ఆ నలుగురికి తప్పా మరెవరికీ ప్రజాస్వామ్యం.. రాజ్యాంగ పరమైన హక్కులు, స్వేచ్ఛా.. స్వాతంత్ర్యం వర్తించడం లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ మండిపడ్డారు. సోమవారం తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీట్ దిప్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. 100 రోజుల్లో ఏ, బీ, సీ, డీ వర్గీకరణ చేస్తామని చెప్పిన బీజేపీ ప్రభుత్వం నాలుగేండ్లు అవుతున్నా వర్గీకరణ విషయంపై పెదవి విప్పడం లేదని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో భారతి చనిపోయిన తర్వాత రెండు రోజుల్లో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లుతానన్న సీఎం కేసీఆర్.. రెండు నెలలు గడిచినా ఆ దిశగా కృషి చేయడం లేదన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే తనను రెండు సార్లు జైల్లో నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ.. స్వతంత్రాలు ఉండే విధంగా ఎన్నో హక్కులు కల్పించారని, ఆ హక్కులను పాలకులు కాలరాస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాజ్యాంగ హక్కులు ప్రశ్నార్ధకరంగా మారుతున్నాయని తెలిపారు. అటు కేంద్రంలోను.. ఇటు రాష్ట్రంలోను దొరలకు ఒక న్యాయం.. దళితులకు మరో న్యాయం జరుగుతున్నదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో ట్యాంక్‌బండ్‌పై ఉన్న అంబేద్కర్ విగ్రహంతో పాటు ఇతర విగ్రహాలను ధ్వంసం చేసినందుకు కేసీఆర్, కేటీఆర్‌లపై కేసులు నమోదైనా అరెస్టు చేయలేదన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం శాంతియుతంగా ప్రదర్శన నిర్వహిస్తే తనను జైల్లో నిర్బంధించారు. నాన్ బెయిలెబుల్ కింద కేసులు నమోదైనా స్టేషన్ బెయిల్ ఇవ్వొచ్చని కోర్టులు తెలుపుతున్నా తనను అరెస్టు చేసి జైలుకు పంపుతున్నారని తెలిపారు. తాను నిరాహారదీక్షకు దిగి ఒక్క నిమిషం కాకముందే తనను అరెస్టు చేశారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ 10 రోజులు దీక్షకు దిగితే పోలీసులు దగ్గరుండి ఆయనను ఇంటికి పంపించారని చెప్పారు.

పవన్ కళ్యాణ్‌కు అనుమతి ఎలా ఇచ్చారు?

పవన్ కళ్యాణ్ యాత్ర చేస్తానంటే పోలీసులు ఎలా అనుమతిచ్చారని మందకృష్ణ ప్రశ్నించారు. తాను దీక్షకు పూనుకుంటే అడుగడుగునా అడ్డంకులు కల్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కప్పర ప్రసాద్ మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వ హయాం లో మీడియాకు కూడా స్వేచ్ఛ కరువైందన్నారు. జర్నలిస్ట్‌లపై కూడా నిర్బంధాన్ని కొనసాగిస్తున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీజేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీలేశ్ జోషి, ఐఎమ్‌డబ్ల్యూజే వర్కింగ్ కమిటీ సభ్యులు విల్సన్ తదితర జర్నలిస్ట్ సంఘాల నేతలు పాల్గొన్నారు.

29న అఖిలపక్షం

ఎస్సీ వర్గీకరణ కోసం ఈ నెల 29న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు మంద కృష్ణ తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై కేంద్రం స్పష్టత ఇవ్వడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెబుతామన్నారు.

సంపాదకీయం

మేలుకొలుపు

ఆకాశం వర్షిస్తేనే నదులు ప్రవహిస్తాయి. ఆ నదీ జలాలతోనే మొక్కలు మొలుస్తాయి. ఆ మొక్కలే విస్తరించి అరణ్యాలవుతాయి. అంతటి ఆకాశంలో మొక్క మొలవదు. నీటి చుక్క నిలవదు. కానీ ఆకాశం ఊ...అంటే చాలు.. ఎటుచూస్తే అటు వెన్నెల.. నక్షత్రాలు మిలమిలా.. యావత్తు విశ్వానికి ఓ చెమక్కు... మానవాళికి ఓ మేలుకొలుపు.. అందరాని చందమామే అయినా.. చూసే కనులకు ఎంతో ఆనందం.. ప్రకృతి ప్రేమికులకు ఎంతో వికాసం.. యిటువంటివే నిత్య జీవితంలో ఎన్నెన్నో మేలుకొల్పులు..! ముఖ్యంగా జనావళికి అవశ్యం.

ఒకరికి ఒకరు వెన్నుదన్నుగా ఉండాలి. ఈ మనస్తత్వాన్ని కలిగి ఉన్నప్పుడు మన శక్తిసామర్థ్యాలను నమ్ముకుంటాం. దృఢ విశ్వాసంతో ఏ పనికైనా పూనుకుంటాం. విమర్శల్నీ, పొగడ్తల్నీ, సమస్యల్నీ, తెగడ్తల్నీ ఒకే విధంగా స్వీకరిస్తాం. మేల్కొలుపే మనకు ఆదర్శం.

"ఎక్కడ మనుషులు సగర్వంగా తలెత్తుకుని తిరగగలరో
ఎక్కడ చదువూ, విజ్ఞానం మూఢనమ్మకాల్లో
ఇంకిపోదో,
ఎక్కడ మనిషి
తోటిమనిషిని దోచుకోడో,
అక్కడ, ఆ స్వేచ్ఛా స్వర్గంలోకి
నా ఈ దేశాన్ని మేలుకొలుపు..." అంటారు విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్.


అవును మరి..! మనుషులకయినా, ఏ సమాజాలకయినా, జాతులకయినా మేలుకొలుపు ప్రాణపదమైంది. మన వ్యక్తిత్వాన్ని మనం నిలబెట్టుకోవడానికి ఈ మేలుకొలుపు చాలా అవసరం. ఒకరకంగా మన ఆత్మగౌరవాన్ని మనం నిలుపుకున్నట్టు. ఈ ఆత్మగౌరవం ప్రతి మనిషికీ హుందాతనాన్నిస్తుంది. జాతుల ప్రత్యేక ప్రతిపత్తిని ఇనుమడింప చేస్తుంది. సమాజాలను ఉదాత్తస్థాయిలో ఉన్నత శిఖరాలపై నిలుపుతుంది. దేశ దేశాల్ని సమున్నత స్థాయిలో నిలబెడుతుంది. దళితులూ, మహిళలూ, గిరిజనులూ, మైనార్టీలూ, సబ్బండ వర్గాలూ యిలా ప్రతి ఒక్కరికీ ఈ మేలుకొలుపు ఊపిరి కావాలి. నిత్యనూతనంగా స్వీకరించాలి. అందుకని ప్రతి ఒక్కరూ తమ ఆత్మగౌరవాన్ని కంటిపాపలా కాపాడుకోవాలి. నిలబెట్టుకోవాలి. నిటారుగా ఉండాలి. వేరెవరూ తస్కరించలేని ఈ ఆత్మగౌరవం అచ్చంగా మనది. మన సొంతం. జీవితంలో ఏది కోల్పోయినా ఎక్కువగా బాధపడకూడదు. చెట్టు ఆకులు రాలిన ప్రతిసారీ కొత్త ఆకులు చిగురించినట్టే, దృఢ చిత్తంతో ముందుకే నడవాలి. ఓ చెట్టును చూడండీ...! తన కొమ్మల్ని మనుషులు ఎన్నిసార్లు నరికినా, ఆ వృక్షం భూమ్మీద నిటారుగా నిల్చునే ఉంటుంది. మళ్లీ మళ్లీ చిగురిస్తుంది. వేలకొమ్మలుగా విస్తరిస్తుంది. అదేపనిగా తనను మట్టుపెట్ట చూసిన మనిషికే అది నీడనిస్తుంది. ఎంతటి సద్గుణమో కదా..! మనిషి కూడా అంతే. ఎదిగినకొద్దీ ఒదిగి ఉండే స్వభావం కలిగి ఉండటం అన్నివిధాలా ఉత్తమం.



ఎవరి ఆత్మగౌరవాన్ని వారు నిలబెట్టుకోవాలి. నిజమే.. కానీ ఎదుటివారి గౌరవానికి భంగం కలిగించే బలమైన ధోరణులూ ఉన్నాయి. ఇకముందూ ఉంటాయి. జీవన గమనంలో ఒడిదుడుకులు సహజం. కొన్ని సందర్భాల్లో సర్వ సంపదలూ హరించుకు పోవచ్చు.. అవసరం కోసం కలుపుకునే స్నేహం ఎన్నటికీ శాశ్వతం కాదు. అయినప్పటికీ మనిషి ఎల్లవేళలా కాపాడుకోవాల్సింది వ్యక్తిత్వాన్నీ, మనో నిబ్బరాన్నీ.. అభిమానవంతులు ఆత్మగౌరవం అందించే తేజస్సును ఎప్పటికీ వదులుకోరు. నెత్తిమీద ఏదో మిడుమాలం వచ్చి పడొచ్చు గాక.. అంతమాత్రాన ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టుకోవాల్సిన అగత్యమూ లేదు. వారు మహిళలు కావొచ్చు. బహుజనులు కావొచ్చు. మహిళలంతా సమానమే.. అనే సమభావం ఈ సమాజంలో లోపించినప్పుడూ, సామాజిక ఆధిపత్య భావజాలం లేదా ధోరణులూ ప్రబలినపుడు యిటువంటి సమస్యలు పెచ్చుమీరుతాయి. పదుగురిలో శిరస్సునెత్తి జీవనం కొనసాగించాలంటే మనకు మనమే మేల్కోవాలి.. మన మనస్సుకు మనమే ఓ సైరన్ కావాలి. మన ఆత్మగౌరవానికి మనమే రక్షణ కవచంగా ఉండాలి. ఎక్కడా రాజీపడని తత్వంతో మెలగాలి. ఇందుకు దట్టమైన సంకల్పం ఉండాలి. దృఢమైన దీక్షా పట్టుదలా తోడు చేసుకొని గుండెనిబ్బరంతో ముందుకు సాగాలి. నడిచే దారిలో రాళ్లూ రప్పలూ.. ముళ్లూ రానీయండీ.. ఏరుకుంటూ పోవడమే మనుషుల పని.

గొప్పతనం సాధించడానికి అనుసరించే మార్గం కూడా గొప్పగానే ఉండటం అవసరం. పట్టుదల కలిగినవారు, ఉత్సాహవంతులూ ఏ వయసునయినా తమ లోపాన్ని సరిదిద్దుకొని ఉన్నతి సాధించగలుగుతారు. తమ జాతిగౌరవం నిలపడం కోసం ప్రాణాల్ని తృణప్రాయంగా వదులుకుంటారు ధీరోదాత్త నేతలు. నిజాం పాలకుల మీద యుద్ధం ప్రకటించటానికి కొమురం భీమ్‌ను ప్రేరేపించింది ఆదివాసులను మేల్కొలపాలనే ఆకాంక్షే. ఆదివాసుల హక్కుల మీద క్రూరమైన అణచివేతను అవమానాల్నీ భరించలేకనే తిరగబడ్డారు అడవిబిడ్డలు. దోపిడీ పీడనల నుంచి విముక్తి మాత్రమే కాదు, జీవించే హక్కు కోసం జాతులూ దేశాలకు దేశాలూ మేల్కోవడం. సమీకృతం కావటం ముఖ్యం. ఇది చరిత్ర చెబుతున్న సత్యం. "అలజడి మా జీవితం. మేల్కొలుపు మా అవసరం. ఆందోళన మా ఊపిరి. తిరుగుబాటు మా వేదాంతం..." అని శ్రీశ్రీ చెప్పినట్టు, మనతోటి వారిని గౌరవించాలి. మనల్ని మనం గౌరవించుకోవడం అలవర్చుకోవాలి. ఒకరికి ఒకరు వెన్నుదన్నుగా ఉండాలి. ఈ మనస్తత్వాన్ని కలిగి ఉన్నప్పుడు మన శక్తిసామర్థ్యాలను నమ్ముకుంటాం. దృఢ విశ్వాసంతో ఏ పనికైనా పూనుకుంటాం. విమర్శల్నీ, పొగడ్తల్నీ, సమస్యల్నీ, తెగడ్తల్నీ ఒకే విధంగా స్వీకరిస్తాం. మేల్కొలుపే మనకు ఆదర్శం.

అసత్య కథనాలకు ఆచరణే జవాబు



తెలకపల్లి రవి

రాజకీయపార్టీలంటే మరీ ముఖ్యంగా మన దేశంలో అధినాయకులూ వారి వారస రత్నాలేనన్నది అనధికార సూత్రంగా స్థిరపడిపోయింది. నానా హంగామాతో సభలూ సంరంభాల జరిపి చివరకు తుది నిర్ణయం తీసుకునే అధికారం అధ్యక్షుడికి అప్పగిస్తూ తీర్మానిస్తారు. నరేంద్రమోడీ, రాహుల్‌గాంధీ, చంద్రబాబు, కేసీఆర్, నవీన్ పట్నాయక్, లాలూ యాదవ్, నితీష్ కుమార్, మమతా బెనర్జీ.. ఇలా ఏ పార్టీలోలైనా సరే వారి మాటే వేదవాక్కు. తమాషా ఏమంటే ఇలాంటివన్నీ వదిలేసి కమ్యూనిస్టు పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం లేదని అవాస్తవ ప్రచారం చేస్తుంటారు. అఖిలభారత స్థాయి నుంచి గ్రామశాఖ వరకూ అందరూ కూచుని చర్చించి విధానాలు రూపొందించే, ఉద్యమాలు సాగించే

> **అవహేళనలూ అసత్య ప్రచారాలూ అమానుష నిర్బంధాలు అపజయాలూ నిజమైన కమ్యూనిస్టుల నిబద్ధతను కదిలించిలేకపోయాయి. ఐక్యతను ఛేదించలేకపోయాయి. ఇప్పటి కట్టుకథలు కూడా గతంలో వాటిలాగే వీగిపోవడం అనివార్యం. పదండి ముందుకు.. పదండి దిద్దుకు..! అంటూ ప్రజా ప్రస్థానం సాగిపోతూంటుంది తప్ప ఎర్రజండా కాంతి తగ్గదు. అదే ఆరుణ శ్రేణుల అచంచల ఆశయబలం.**

కమ్యూనిస్టు సమిష్టి క్రమాన్ని ఈ బాపతు విమర్శకులు కప్పిపుచ్చుతుంటారు. అవకాశ వాద రాజకీయాలతో రాజకీయార్థిక సామాజికాంశాలలో దాదాపు ఒకే విధానాలు కొనసాగించే పాలకవర్గ పార్టీలకు, వారి వత్తాసుదార్లకు అవగాహన లేని కుహనా మేధావులకు నిజమైన ప్రత్యామ్నాయానికి కృషిచేసే కమ్యూనిస్టులంటే మాత్రం పడదు. అన్ని రకాల కమ్యూనిస్టు వ్యతిరేకులూ వారికి ఎప్పుడు సమస్యలు ఎదురవుతాయా అని పొంచికూచుని వుంటారు. ఏదో పేరిట గోరంతను కొండంతలు చేసి ఘోరమేదో జరిగిపోయిందని గగ్గోలు పెట్టేస్తారు. ఏప్రిల్‌లో హైదరాబాదులో జరగబోయే 22వ అఖిలభారత మహాసభల కోసం సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ రూపొందించిన ముసాయిదాపై నడుస్తున్నదిఅలాటి తంతే. సీపీఐ(ఎం) ప్రకంపించి పోతున్నట్టు విభేదాలు చీలికకు దారితీయనున్నట్టు బడా మీడియా హోరెత్తిస్తున్నది. మతతత్వ బీజేపీని అధికారం నుండి దింపాలని లౌకిక శక్తులను కలుపుకుని పోరాడాలని సీపీఐ(ఎం) ఏకాభిప్రాయంతో వుంది. కాంగ్రెస్‌తో ఎలాంటి ఎన్నికల పొత్తుకు అవకాశం లేదని స్పష్టంగా చెప్పాలని మెజార్టి నిర్ణయం తీసుకుంది. దీన్ని శాఖలు చర్చించి సూచనలు చేసిన తర్వాత.. మహాసభ అంతిమ నిర్ణయం తీసుకుంటుంది. ఇంతలోనే హాలాహలం పొగచూరినట్టు కోలాహలం చేస్తున్నారంటే రాజకీయ దురుద్దేశంతోనేనన్నది స్పష్టం.

ఎప్పుడైనా సరే చర్చల క్రమంలో భిన్న ప్రతిపాదనలూ పత్రాలు చర్చకు రావచ్చు. ఈ సందర్భంలో ప్రధాన కార్యదర్శిగా సీతారాం ఏచూరి ప్రతిపాదించిన ముసాయిదాను గాక మరో దాన్ని కమిటీ మెజార్టీ ఆమోదించివుండొచ్చు. తన విధానం వీగిపోయింది గనక ప్రధాన బాధ్యతలో కొనసాగడం సమంజసం కాదని ఏచూరి అనీ వుండొచ్చు. అన్నానని చెప్పారు కూడా. అయితే మహాసభ లోపలే తప్పుకోవడం మంచి సంకేతం కాదనీ, అక్కడ తుది నిర్ణయం తీసుకోవాలి గనక ఆలోగా తప్పుకోవాల్సిన పని లేదని మిగిలిన పొలిట్‌బ్యూరో సభ్యులు చెప్పిన మీదట ఆయనా కొనసాగారు. ఇందులో హుందాతనం, అంతర్గత ప్రజాస్వామ్యం తప్ప వ్యక్తిగతమైన విభేదాలు ఎక్కడ కనిపిస్తున్నాయి? ఏచూరి రాజీనామా చేస్తానన్నట్టు చెప్పారనీ, రాజీనామా మాట అనలేదని పూర్వ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్ చెప్పారనీ దీన్ని బట్టి విభేదాలు బహిరంగమైనాయని కొందరి వ్యాఖ్యానాలు హాస్యాస్పదం. ఏచూరి ఇంటర్వ్యూలో గాని, ప్రకాశ్ కరత్ వ్యాసంలో గాని దేంట్లోనూ రాజీనామా వాక్యం లేదు. ఇవి తమ ఇద్దరి వ్యక్తిగత విభేదాలుగా చూపడం సరికాదని కరత్ రాశారు. చర్చించి నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామిక పద్ధతి అని ఏచూరి వివరించారు. అయినా ఇష్టానుసార వ్యాఖ్యలతో కోడిగుడ్డుకు ఈకలు పీకినట్టు గందరగోళపర్చడం కొందరికి అవసరం, ఆనందం కూడా. వారి ఆనందంలో వారుండగా ఏచూరి హైదరాబాద్ వచ్చి తెలంగాణ రాజకీయాల్లో కీలక మార్పుకు సంకేతమైన బిఎల్ఎఫ్ ప్రారంభించి వెళ్లారు. ఏపీలో మధు తదితరులు పెదగొట్టిపాడు దళితుల సమస్యపై పోరాడుతున్నారు. ఇలాగే ఎక్కడివారక్కడ కర్తవ్యాలు నిర్వహిస్తున్నారే గాని సంక్షోభమెక్కడ?

నిజానికి గత నలభై ఏండ్లుగా సీపీఐ(ఎం) మహాసభలకు ముందు ఏదో ఒక దుష్ప్రచారం చూడొచ్చు. 1977-78 మధ్య సుందరయ్య విధానపరమైన తేడాలతో వచ్చేస్తే చాలా ఊహలు చేశారు. 1982లో విజయవాడలో 11వ మహాసభకు ముందు పత్రికల్లో దుమారం... 1979లో జనతా ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించడంపై సభలో చీలిక వస్తుందని ఒకటే కథలు నడిచాయి. అప్పటి ప్రధాన కార్యదర్శి నంబూద్రిపాద్, పొలిట్‌బ్యూరో సభ్యుడు మాకినేని బసవపున్నయ్యలను పత్రికా గోష్టుల్లో బెంగాల్ కేరళ విలేకరులు అదే పనిగా ఆ విషయమే అడుగుతుండేవారు. మీరే చూస్తారు కదా అని వారు ఏడిపించేవారు. చివరకు మహాసభ జయప్రదంగా ముగిసింది. 1985 కొల్‌కతా మహాసభ నాటికి కేరళలో విభేదాలు చీలికకు దారితీస్తాయని కథలొచ్చాయి. ఆ సమస్యలు పరిష్కరించుకుని అధికారంలో కొనసాగుతున్నది. 1992లో మద్రాసు మహాసభలో సోవియట్ విచ్ఛిన్నానంతర పరిణామాలు తీవ్రంగా ఉంటాయనే కథనాల మధ్య సైద్ధాంతిక తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. 1995లో చండీఘర్‌లో జరిగిన సభల నాటికి అప్పుడున్న పీవీ ప్రభుత్వంపట్ల వైఖరిపై చాలా బేధాలు వస్తాయని వూహించారు. అక్కడి కాంగ్రెస్ ముఖ్యమంత్రి దర్బారా సింగ్ నాటి ప్రధాన కార్యదర్శి హరికిషన్‌సింగ్ సూర్జిత్‌ను కలిసేపేరిట చెప్పాచేయకుండా సభా ప్రాంగణంలో చొరబడి మీడియాలో గజిబిజి పెంచడానికి తన వంతు ప్రయత్నం చేసినా సభపై ఆ ప్రభావమే పడలేదు. 1996లో ఇతర పార్టీలు జ్యోతిబాసును ప్రధాని పదవికి ఎంపిక చేస్తే కేంద్ర కమిటీ ఆమోదించకపోవడం, దాన్ని ఆయన ఆత్మకథలో చారిత్రిక తప్పిదం అని వర్ణించడం పెద్ద సంక్షోభమవుతుందని ప్రచారం నడిచింది. కాని



రెండేండ్ల తర్వాత ఆయన పాలించే కొల్‌కతాలోనే ఆయన, సూర్జిత్ సహా చాలా మంది పెద్దలు వ్యతిరేకించినా మహాసభ ప్రధాని పదవి నిరాకరణ సరైందని పునరుద్ఘాటించిందే తప్ప ఐక్యత దెబ్బతిన్నది లేదు. సుందరయ్యలాగే వారూ తర్వాత మరో దశాబ్దంపైగా సేవలందించారు కూడా. జాతీయంగా సూర్జిత్ కీలక పాత్ర భరించలేక ఆయనను రాజకీయ దళారీ అంటూ కించపర్చే వ్యాఖ్యలు చేసినా ఆ యోధుడు పట్టించుకున్నది లేదు. 1998-2004 మధ్య సాగిన బీజేపీ ఎన్‌డీఏ పాలనను ఓడించి తొలి యూపీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు బాధ్యతాయుతమైన మద్దతునే సీపీఐ(ఎం) వామపక్షాలు అందించాయి. అమెరికాతో అణు ఒప్పందం కారణంగా 2008లో ఆ మద్దతు ఉపసంహరించుకున్నప్పుడు నాటి ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్‌పై రకరకాల కథనాలు చూశాం. ఆయన కరుడుగట్టిన సిద్ధాంత వాది అని అపహాస్యాలు చేశారు.

తార్కికంగా చెప్పాలంటే కరుడుకట్టిన కమ్యూనిస్టు వ్యతిరేకులే వుంటారు. గాని మంచి ఆశయాలకు సంబంధించిన వారెవరైనా సరే కరుడుగట్టడమనే ప్రసక్తి వుండదు. కరుడుగట్టిన మానవతా వాది అనం. కుల మత జాతి ద్వేషం, అధికారమదం, మితిమీరిన స్వార్థం కౌటిల్యం వంటివాటితోనే మనుషులు కరుడుగట్టడం జరుగుతుంది. అలాగాక విముక్తి సాధనకు సమస్యల పరిష్కారానికి తమ కర్తవ్యమేదో ఆశయాలకు తగిన ఆచరణ ఏమిటో అధ్యయనంతో అన్వయంతో కమ్యూనిస్టులు నిర్ణయించుకుంటారు. అది ఆమూలాగ్రం అఖిల భారతం చర్చించి నిర్ణయించుకుంటారు. పార్టీలో చేరి మేము పరస్పరం సహకరించుకుంటూ అందరాని ఆకాశానికి అనంత నిశ్రేణులు నిర్మిస్తాం అని కవి మయకోవస్కీ అంటాడు. నాటి జ్యోతిబాసు నుంచి ఇప్పుడు సీతారాం ఏచూరి వరకూ ఎవరి అభిప్రాయాలు ఏమైనా నిర్దేశిత విధాన పథంలోనే అడుగేయడం దేశమంతా చూస్తున్నది. ఇప్పుడు కూడా ముసాయిదా విడుదలైనాక పార్టీ సభ్యులే గాక సానుభూతి పరులూ ఇతరులూ కూడా సూచనలు పంపే వెసులుబాటు వుంది. ప్రతీదానిపై వివరణ లభిస్తుంది. అదే అంతిమ విధానం. ప్రజాస్వామ్య సంవిధానం.

తప్పులైతే అందరూ చేస్తారు, త్యాగాలు మాత్రం కొందరే చేస్తారని రావిశాస్త్రి అన్నట్టు స్వార్థ రాజకీయాలు అందరూ చేస్తారు గానీ ప్రజల కోసం పోరాడేది కమ్యూనిస్టులే. అది నిరంతర ప్రవాహం. ఆ క్రమంలో నిర్దిష్ట పరిస్థితిని అంచనావేసి నిర్దిష్ట విధానాలు నిర్వచించుకోవాలి. మోడీత్వ రగిలిస్తున్న (పెద్ద) హిందూత్వానలం ఒకవైపు, వారిని ఎదుర్కొనే పేరిట రాహుల్‌గాంధీ చేపట్టిన చిన్న హిందూత్వ తొలి అడుగులు మరోవైపు.. వారివురే గాక కమ్యూనిస్టేతర ప్రాంతీయ పార్టీలన్నీ అమలు చేసే సరళీకరణ గరళీకరణ ఇంకోవైపు.. అంతర్జాతీయంగా ట్రంపోన్మాదం ఇంకా మరో వైపు.. విలువలు దిగజార్చే విత్త వినిమయ సంస్కృతి జడలు విప్పిన మూఢత్వం పదవీ లాలసతలే చుట్టూ తాండవిస్తున్నా ఇన్ని సంక్లిష్టతల మధ్య బెంగాల్ కోట కోల్పోయి బలం తగ్గిన నేపథ్యంలో సీపీఐ(ఎం) నిలదొక్కుకోవడం కర్తవ్యం నిర్వహించడం కత్తిమీద సామే. ఇప్పటికైతే (ఎన్నికల) బలం తగ్గింది గనక రాజకీయ వ్యతిరేకుల నుంచి రచయితలూ రచయిత్రుల వరకూ ఎవరైనా కమ్యూనిస్టులను అపహాస్యం చేయడం తేలికే. అయితే అవహేళనలూ అసత్య ప్రచారాలూ అమానుష నిర్బంధాలు అపజయాలూ నిజమైన కమ్యూనిస్టుల నిబద్ధతను కదిలించిలేకపోయాయి. ఐక్యతను ఛేదించలేకపోయాయి. ఇప్పటి కట్టుకథలు కూడా గతంలో వాటిలాగే వీగిపోవడం అనివార్యం. పదండి ముందుకు.. పదండి దిద్దుకు..! అంటూ ప్రజా ప్రస్థానం సాగిపోతూంటుంది తప్ప ఎర్రజండా కాంతి తగ్గదు. అదే ఆరుణ శ్రేణుల అచంచల ఆశయబలం. ■

రిపోర్టర్స్ డైరీ

విహెచ్ ఆనందం

కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు చాలా రోజులు తర్వాత సంతోషంగా ఉన్నారు. అంత ఆనందంగా ఇంతకుముందెప్పుడూ లేరట. ఈ విషయాన్ని ఆయన చుట్టూ ఉన్న అనుచర గ్రూపు మీడియాకు చెబుతూ తెగ ఆనందంగా ఫీలయ్యారు. ఇంతకూ విషయమేంటంటే.. టీఆర్ఎస్‌పార్టీ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి కేసీఆర్‌ను జనసేన అధినేత పవన్ కల్యాణ్ మెచ్చుకున్నారు. పొగడ్తలతో ముంచెత్తారు. దీనిపై కాంగ్రెస్‌పార్టీ నేతలు ఒక్కొక్కరు తలోరకంగా స్పందించారు. పవన్‌పై అగ్గిలంమీద గుగ్గిలం అయ్యారు. అందులో విహెచ్ చేసిన విమర్శలకు, ఆరోపణలకు పవన్ ప్రత్యేకంగా స్పందించారు. కాంగ్రెస్‌పార్టీ నాయకత్వం విహెచ్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తే తాను మద్దతిస్తానని పవన్ ప్రకటించారు. దీంతో విహెచ్ తెగ సంతోషపడ్డారట. చూడండీ..! ఎప్పుడైనా నా పక్కనున్న వారు గానీ, కాంగ్రెస్‌పార్టీ నేతలు గానీ ఎవరైన తాను సీఎం అభ్యర్థి అయితే మద్దతు ఇస్తానని చెప్పినవారు ఉన్నారా అని ఆవేదన చెందారు. నేను తిట్టినా అందరి ముందూ నాకు మద్దతిస్తానని చెప్పడం నిజంగా పవన్ గ్రేట్..! అని మెచ్చుకున్నారట. పాపం విహెచ్ సేవలను కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం గుర్తించినా, ఇక్కడ నాయకులు ఎప్పుడు గుర్తించారు అని అనుకోవాల్సి వస్తున్నది.

- గుడిగ రఘు

మోత్కుపల్లి ప్రాయశ్చిత్తం

తెలుగుదేశం తెలంగాణ పార్టీ సీనియర్ నేత, పొలిట్‌బ్యూరో సభ్యులు మోత్కుపల్లి నర్సింహులు పశ్చాత్తాపానికి లోనవుతున్నారు. ఎందుకంటే, టీడీపీని టీఆర్ఎస్‌పార్టీలో విలీనం చేస్తే పరువు దక్కుతుందని, చంద్రబాబు పట్టించుకోకపోతే ఇంకెందుకని ఎన్టీఆర్ వర్ధంతి వేడుకల సాక్షిగా మోత్కుపల్లి సంచలన ప్రకటన చేశారు. ఆ రోజు చాలామంది నేతలు స్పందించినా, మండిపడినా, లోకేష్, రమణ లాంటినేతలు ఆయన వ్యక్తిగత వ్యాఖ్యలుగా పరిగణించారు. చంద్రబాబు కూడా లైట్‌గా తీసుకున్నారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు గావడంతో ఆయనపై చర్యలు తీసుకోవాలని గట్టిగా కోరేవారు లేరు. చంద్రబాబు చేతుల్లోనే ఉందని చెబుతున్నారు. టీడీపీ నేతలు కూడా ఆవేదనతో కూడిన వ్యాఖ్యలుగానే పరిగణిస్తున్నారు. గవర్నర్, రాజ్యసభ సభ్యుని హోదాలకు ఆశలు పెట్టుకున్న మోత్కుపల్లి, అవి రాకపోవడంతో.. సహజమేనని కొట్టిపారేశారు. ఆయన కూడా అనవసరంగా అన్నానని, అనకుండా ఉండాల్సింది అని మీడియా మిత్రుల వాపోయారట.

- కె.ఆనందరాజు

దావోస్‌లో కేటీఆర్.. నిరుద్యోగులకు ఉపాధి

రాష్ట్రప్రభుత్వ ప్రతినిధిగా దావోస్‌లో మంత్రి కేటీఆర్ పర్యటించారు. అక్కడికి పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలు, ఐటీలు, ఆయా దేశాల అధినేతలు, రాయబారులు హాజరయ్యారు. దీంతో రాష్ట్ర అభివృద్ధికోసం దావోస్‌లో కేటీఆర్ ఎంత కష్టపడుతున్నదీ ప్రభుత్వ సమాచార శాఖ పంపిస్తున్న ఫొటోలు, భేటీలే ఉదాహరణ. ఎన్ని కంపెనీలు రాబోతున్నాయి. ఎంతమందికి ఉద్యోగాలు, ఉపాధి కలగబోతున్నది వార్తల ద్వారా తెలుస్తున్నది. దీనిపై మధ్యాహ్న సమయంలో మీడియా మిత్రులు కూర్చొని మాట్లాడుతుండగా, అక్కడికి టీఆర్ఎస్‌నేతలు కూడా వచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ విరామం లేకుండా నెలకు కొన్ని దేశాలను తిరిగొస్తున్నారు. ఉద్యోగాలు, ఉపాధి రాబోతున్నట్టు, పెట్టుబడులు వస్తున్నాయని చెబుతూ వస్తున్నారు. ఎన్ని వచ్చాయో తెలియదు. కేటీఆర్ ధోరణి కూడా అలానే ఉందని చెప్పుకోగానే అందరూ ఒకటే నవ్వులు. ఇంట్లోనో, ఆఫీసులో ఉన్నవారు కొందరు ఏదో బిజీలో ఉన్నట్టుగా కనిపిస్తుంటారు. ఖాళీగా ఉన్నామని చెప్పుకోకుండా సంచారాలు చేస్తుంటారు. ఇప్పుడు కేటీఆర్ పరిస్థితి కూడా అలానే ఉందని ముచ్చటించుకున్నారు.

- టి.సంజయకుమార్

అమ్మో..గవర్నర్ !

రాజ్‌భవన్‌నుంచి గవర్నర్ అనగానే.. ఎంతో ఊహించుకుంటాం.. ఏవేవో అనుకుంటాం... కానీ మన గవర్నర్ నరసింహన్ మాత్రం బతకనేర్చారన్న చర్చ తెలుగురాష్ట్రాల్లో వినిపిస్తోంది. ప్రభుత్వాలు తప్పుచేస్తే.. సరిదిద్దేలా ఆయన వ్యవహారశైలి ఉండాలి. కానీ అందుకు భిన్నంగా తనధోరణితో అందరినిలోనూ సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ అవుతున్నారు. గతంలో ఏ గవర్నర్ కూడా ఇంత సుదీర్ఘకాలం పనిచేసిన దాఖలాలులేవు. మరీ నరసింహన్‌కు ఉన్న ప్రత్యేకత ఏమిటంటే.. ఈ మధ్య బాగా రాటుదేలారు. ఇటీవల కాళేశ్వరం పర్యటనకు వెళ్ళిన తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఆ ప్రాజెక్టులను చూసి తెలంగాణ ముఖ్యమంత్రిపై ప్రశంసల జల్లు కురిపించారు. ఏకంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కాళేశ్వరం చంద్రశేఖరరావుగా అభివర్ణించారు. ఆయన పొగడ్తలు రాజకీయంగా దుమారం లేపాయి. తాజాగా.. ఏపీ పర్యటనకు వెళ్ళిన ఆయన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునూ పొగిడేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఆ రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టం అంటూ ప్రశంసలు కురిపించారు. ఇలా ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులనూ ప్రసన్నం చేసుకుంటూ... హస్తినలోనూ పెద్దల అండతో.. సుదీర్ఘకాలం ఇరు రాష్ట్రాల గవర్నర్‌గా కొనసాగేలా అడుగులేస్తున్నారు. నరసింహన్ రియాక్ట్ అవుతున్న తీరు చూసి తెలుగు రాష్ట్రాల్లోని పొలిటికల్ లీడర్లూ సైతం ముక్కున వేలేసుకుంటున్నారు.


- ఎం.యాదయ్య

కారు.. 'షి'కారు.. బేకారు...

హైదరాబాద్.. విజయవాడ జాతీయ రహదారిపై ఓ కారు రయ్యుమంటూ దూసుకెళుతున్నది. ఇంతలో కారు ముందు సీట్లో ఉన్న మొబైల్ ఫోన్ మోగటం మొదలెట్టింది. ఫోనందుకున్న వ్యక్తి.. చెప్పండి బ్రదర్..! అంటూ అవతల వ్యక్తిని పలకరించాడు. 'అన్నా నమస్తే.. ఏంటీ ఆదివారం ఏదో ఊరెళుతున్నట్టున్నారు.. మీరు వెహికిల్‌లో ఉన్న శబ్దం వినబడుతోంది..' అని అడిగాడు. కారులోని వ్యక్తి... 'అవును బ్రదర్.. చిన్న పని మీద సూర్యాపేట దాకా వెళుతున్నాను..' అని సమాధానమిచ్చారు. 'ఒక్కరే వెళుతున్నారా..? లేక ఫ్యామిలీతోనా..?' అని ఆరా తీయగా... 'లేదు ఒక్కణ్నే...' అనే సమాధానం వినవచ్చింది. 'పక్కన ఫ్యామిలీ, గిమిలీ లేదు కాబట్టి.. ఎంచక్కా కారులో హైవేపై వెళ్తూ ఎంజాయ్ చేస్తున్నారన్న మాట...' అంటూ కొంటె ప్రశ్నలు వేశాడు అవతలి వ్యక్తి.. దానికి కారులోని వ్యక్తి 'చూడు బ్రదర్.. మీరు పొరపడుతున్నారు. మగవాడి జీవితంలో మహిళలది ఎంతో ఉదాత్తమైన, ఉన్నతమైన పాత్ర. ఉదాహరణకు అనుకోని కారణాల వల్ల తండ్రి మరణించినా పిల్లలకు అనూహ్యమైన ఇబ్బందులేమీ ఉండవు.. కానీ తల్లి మరణిస్తే మాత్రం ఆ లోటును పూడ్చలేం. ఇక వృద్ధాప్యం పైబడ్డాక భర్త మరణించినా.. భార్య మనవళ్లు, మనవరాళ్లతో కాలక్షేపం చేయగలదు. కానీ తనకంటే ముందుగా భార్య మరణిస్తే మాత్రం భర్త మానసికంగా కుంగిపోతాడు. ఇక ఇంట్లో శ్రీమతి ఉన్నప్పుడు చిర్రుబుర్రులాడే మనకు.. ఆమె ఊరెళ్లినప్పుడు ఆవిడ విలువేంటో తెలుస్తుంది.. అందుకే కారులోనే కాదు.. జీవితంలో సైతం జీవిత భాగస్వామి మన పక్కనుంటే హుషారుగా 'షి'కారు చేస్తాం.. లేదంటే బేకారైపోతాం...' అంటూ హితోపదేశం చేశాడు. ఇటీవల సచివాలయంలో క్యాంటీన్ దగ్గర ఇద్దరు పాత్రికేయులు బాతాఖానీ కొడుతుండగా.. దొరికిన ఆణిముత్యంలాంటి మాటలివి. అందుకే ఆడాళ్లూ.. మీకు జోహార్లు...

-బి.వి.యన్.పద్మరాజు

గోడ దుంకెతందుకు రడీ



తెలిదేవర భానుమూర్తి

నడిరాత్రి. కుక్కలు బౌబౌ మంటున్నయి. చిమ్మట్లు పాటలు బాడుతున్నయి. సల్లగాలి గొడ్తున్నది. సడక్ మీద మోర్ గొట్టుకుంట గూర్క గస్తి దిర్గుతున్నడు. ఆడొక లారి ఈడొక మోటర్ బోతున్నది. దొంగలు దొంగతనం జేసెతందుకు మోక కోసం ఎదురుజూస్తున్నరు. పోలీసోల్లు జీపుల గస్తి దిర్గుతున్నరు. అందరు నిద్రబోతున్నరు. కొందరు కల్వరిస్తున్నరు. కొందరు కలల బజార్ల దిర్గుతున్నరు. ఇంకొందరు నిద్రరాక అటిటు బొర్లుతున్నరు. నాత్రి డ్యూటిజేసెటోల్లు డ్యూటి జేస్తున్నరు. జిద్దు ఇడ్వని విక్రమార్కుడు సైకిల్ దీస్కోని ఇంట్ల కెల్లి ఎల్లిండు. సైకిల్ దొక్కుకుంట గాయిన బొందల గడ్డ దిక్కు బోబట్టిండు.


బొందల గడ్డ కాడ ఉన్న అర్రల బేతాలుడు ఉంటున్నడు. గాడు గుడ్క విక్రమార్కుని లెక్కనే నాత్రి పూట డ్యూటి జేస్తడు. దినం పూట పండుకుంటడు. పొద్దు మీకినంక గాన్కి వొండుకో బుద్ది గాలేదు. గాడు హొటల్‌కు బోయిండు. గింత దిన్నడు. తిన్నంక సిగిలేట్ ముట్టిచ్చుకుండు. సిగిలేట్ దాక్కుంట ఇంటికి వొచ్చిండు. ఇంటికొచ్చి టివి జూస్కుంట గూసున్నడు. టివి జూస్కుంట గూసున్నడు. టివి జూస్కుంటనే గాడు పండుకుండు.

సరింగ నాత్రి రొండుగొట్టంగ బేతాలుని ఇంటి ముంగట విక్రమార్కుడు సైకిల్ రుకాయించిండు. రుకాయించి గంటి బజాయించిండు. గంటి సప్పుడు ఇనంగనే ఎప్పటిలెక్కనే గాడు ఇవుతలకు రాలేదు. గీడు పన్నట్లు గొడ్తున్నదనుకోని రొండు, మూడు పార్లు విక్రమార్కుడు గంటి బజాయించిండు. గప్పుడు బేతాలుడు నిద్రలేసి ఇవుతలకు వొచ్చిండు. సైకిలెన్క గూసున్నడు. గాడు గూసొంగనే విక్రమార్కుడు సైకిల్ దొక్కబట్టిండు. గప్పుడు సైకిల్ మీద గూసున్న బేతాలుడు

"నన్ను సైకిల్ మీద గూసుండబెట్టుకోని ఎత్తుగడ్డలని సూడకుంట సైకిల్ దొక్కుతవు. నీకు దమ్ము రావొచ్చు. నీ కాల్లు గుంజొచ్చు. గవన్ని యాదిమర్సెతందుకు నీకొక కత జెప్త ఇను.

గా దినం ఎన్టీయార్ వర్దంతి. తెలుగుదేసం లీడర్లు ఎన్టీయార్ గాట్‌కు బోయిండ్రు. ఎన్టీయార్ సమాది మీద పూల జల్లి దండం బెట్టిండ్రు. తెలుగుదేసం లీడర్ మోత్కుపల్లి నర్సింలు గూడ ఎన్టీయార్ గాట్‌కు బోయిండు. ఎన్టీయార్ సమాది మీద పూలు జల్లి దండం బెట్టిండు. దండం బెట్టినంక మాట్లాడుకుంట

"తెలుగు దేసం పార్టిని టిఆర్ఎస్ పార్టిల గల్పుతె బాగుంటది. టిఆర్ఎస్ గూడ మన పార్టినే. తెలుగు దేసం లేదు అనిపిచ్చుకునే కంటె టిఆర్ఎస్ల గల్పితెనే మంచిగుంటది. గిప్పుడు సైకిల్ గిర్రలల్ల గాలి బోయింది. గాలి గొడ్దామంటె పంపు దొర్కుతలేదు. పంపు



దొర్కినా గాలి గొట్టెటోడు ఎవ్వడు లేడు. తెలుగుదేసం సైకిల్‌కు రొండు గిర్రలుంటె టిఆర్ఎస్ మోటర్‌కు నాలుగు గిర్రలున్నయి. యాడికన్న బోవాలన్నా సైకిల్ కన్న మోటరే జల్ది బోతది. సైకిల్ మీద ఇద్దరు ఎక్వల ఎక్వ ముగ్గురు గూసోని బోవచ్చు. మోటర్ల ఐదారుగురు గూసోని బోవచ్చు. మోటరున్న టిఆర్ఎస్ల తెలుగుదేసంను గల్పితె మంచిగుంటది. టిఆర్ఎస్ల అందరు తెలుగుదేసమోల్లే ఉన్నరు. ముఖ్యమంత్రి కెసిఆర్ గుడ్క తెలుగుదేసంల కెల్లి బోయినోడే. కడియం శ్రీహరి, తలసాని శ్రీనివాస్ యాదవ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి గూడ ఇంతకు ముందు తెలుగుదేసమోల్లే. తెలుగు దేసంను టిఆర్ఎస్ల గల్పితె ఎన్టీఆర్ ఆత్మ గూడ శాంతిస్తది " అని మోత్కుపల్లి నర్సింలు అన్నడు.

"తెలుగుదేసంను టిఆర్ఎస్ల గల్పాలనుకుంట మోత్కుపల్లి నర్సింలు బ్లాక్ మెయిల్ జేస్తున్నడు. చెంద్రబాబు గాయినను రాజ్జెసబకు పంపుతడనుకున్నడు. గని గాయినను రాజ్జెసబకు పంపలేదు. టిడిపిల ఉన్నందుకు గవర్నర్ కుర్సి దొర్కుతదని మోత్కుపల్లి అనుకున్నడు. గని గా కుర్సి గూడ దొర్కలేదు. గాయినకు ఏదన్న కుర్సి లేకుంటె బేచైన్గుంటది. గాయిన ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నడు. సూర్యుడు, చెంద్రుడు ఉన్నంత దాంక ఎన్టీయార్ పేరు ఉంటది. ఎన్టీయార్ పేరు ఉన్నంత దాంక తెలుగు దేసం పార్టి ఉంటది" అని టిడిపి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నడు.

"మోత్కుపల్లి గోడదుంకెతందుకు రడీగున్నట్లు గొడ్తున్నది. నిచ్చెన దెచ్చి గోడకు ఆనిచ్చినట్లు గొడ్తున్నది. గోడ దుంకితె వొచ్చె ఎలచ్చన్ల ఎమ్మెల్యే టికిట్ ఇస్తమని టిఆర్ఎస్ జెప్పినట్లు గొడ్తున్నది. మోత్కుపల్లి టిఆర్ఎస్లకు వొస్తె మంచి గుంటదని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నడు. తెలుగు దేసం పార్టిని టిఆర్ఎస్ల గల్పుమని జెప్పెతందుకు మోత్కుపల్లి ఎవ్వరు. గాయినే మన్న టిడిపి ప్రెసిడెంటా? టిడిపి ప్రెసిడెంట్ జెప్తె చెల్లుతది గని గాయిన జెప్తె చెల్లుతదా అని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నడు. రేవంత్ రెడ్డి, మోత్కుపల్లి నడ్మ పచ్చగడ్డ ఏస్తె బగ్గు మంటది. రేవంత్ టిడిపి ఉన్నప్పుడు వొచ్చె ఎలచ్చన్ల కాంగ్రెస్‌తోని పొత్తుబెట్టుకోవాలె అని అంటె టిఆర్ఎస్ తోని పొత్తుబెట్టుకోవాలని మోత్కుపల్లి అన్నడు. రేవంత్ గోడదుంకి కాంగ్రెస్లకు బోయిండు. మోత్కుపల్లి గోడదుంకి టిఆర్ఎస్లకు బోయెతందుకు రడీగున్నడు. ముఖ్యమంత్రి కెసిఆర్ గూడ మోత్కుపల్లిని టిఆర్ఎస్ల షరీక్ జేసుకునేతందుకు రడీగున్నడు. మోత్కుపల్లితోని మందకిష్న మాదిగకు చెక్ బెట్టాలని కెసిఆర్ అనుకుంటున్నడు. మోత్కుపల్లి బోయినా ఏంగాదు. లీడర్లు బోతేంది కేడర్ మా యెంటనే ఉన్నదనుకుంట ఆంధ్రప్రదేస్ ముఖ్యమంత్రి చెంద్రబాబు నాయుడు ఎందుకు రొండేల్లు సూబెట్టిండు. గీ సవాల్‌కు జవాబ్ ఎర్కుండి జెప్పకుంటివా అంటె నీ సైకిల్ పంపుచరైతది" అని బేతాలుడు అన్నడు.

"తెలంగానల ఇద్దరే టిడిపి ఎమ్మెల్యేలు మిగిలిండ్రని నోటితోని జెప్పకుంట చెంద్రబాబు రొండేల్లు సూబెట్టిండు" అని విక్రమార్కుడు జెప్పంగనే సైకిల్ దిగి బేతాలుడు బొందలగడ్డ దిక్కు ఉర్కిండు.

సెల్:9959150491



శృతి హాసన్... ఇటు దక్షిణాదిన, అటు బాలీవుడ్‌లోనూ తనదైన ముద్ర వేస్తున్న హీరోయిన్. తల్లిదండ్రులిద్దరి వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని... నటిగా మారింది. శృతి పేరులోనే కాదు... ఆమె జీవితంలోనూ సంగీతం ఉంది. హిందుస్తానీ సంగీతాన్ని నేర్చుకుంది. మంచి గాయని. ఆరేండ్ల వయసులోనే ఇళయరాజా సంగీతదర్శకత్వంలోపాట పాడింది. చిత్రకళలోనూ ప్రావీణ్యం ఉంది. ప్రొఫెషన్ ఏదైనా.. వందశాతం మనసుపెట్టి చేసేవాళ్లు కొద్ది మందే వుంటారు. అలాంటి తండ్రి బాటలో నడవడం వల్లే ఇంత సక్సెస్‌ఫుల్‌గా ఉన్నానంటోంది శృతి. నేడు ఆమె పుట్టినరోజు సందర్భంగా కొన్ని ముచ్చట్లు...



చెన్నైలోనే పుట్టి పెరిగాను. పిల్లలెవ్వరికీ కలగని అదృష్టం నాది. నాకు ఐదేండ్ల వయసులో అమ్మానాన్న పెండ్లి చేసుకున్నారు. రెండో పాప అయిన తరువాతే పెండ్లి చేసుకోవాలని వాళ్లు అనుకున్నారట. అందుకే అక్షర పుట్టిన తరువాతే పెండ్లి చేసుకున్నారు. మాంటిస్సోరీ స్కూల్‌లో చదువుకున్నాను. నేను చదువులో యావరేజ్. నేను పుట్టిన తరువాత అమ్మ నటన మానేసినా నాన్న సినిమాలకోసం కాస్ట్యూమ్స్ డిజైన్ చేసింది. అందుకే స్కూల్ అయ్యాక మేకప్ వ్యాన్‌లో ఆడుకోవడం, జనరేటర్ వ్యాన్‌లో కూర్చుని హొంవర్క్ చేసుకోవడం వంటి జ్ఞాపకాలెన్నో ఉన్నాయి.

నాకు స్వతంత్రత ఎక్కువ...



రాజ్యలక్ష్మి నుంచి శృతికి...

నాకు ఊహ తెలిసినప్పట్నుంచీ గాలి, ఆహారంలా సంగీతం కూడా జీవితంలో భాగమైపోయింది. నాన్నమ్మ పేరు రాజ్యలక్ష్మి. అదే నా అసలు పేరు కూడా. సంగీతంపైన నా ఇష్టాన్ని చూసి చిన్నపుడే శృతి అని పిలవడం మొదలు పెట్టారు. పాటలు రాస్తుంటాను, పాడతాను, కంపోజ్ చేస్తుంటాను. నాకు సినిమాలూ, సంగీతం రెండూ ముఖ్యమే! బ్రిటన్‌కు చెందిన మ్యూజిక్ బ్యాండ్ 'డ్కెనోసార్ పైలప్'తో కలిసి ఒక ఆల్బమ్ చేశాను. భవిష్యత్తులో మరిన్ని ఆల్బమ్‌లు తీసుకొస్తాను.

చాలా మార్పు...

తీరికలేకుండా సినిమాల్లో చేస్తున్నాను. చాలా సమయం సెట్, హొటల్, విమానం... వీటితోనే గడిచిపోయింది. కానీ ఏ మూలనో అసంతృప్తి. అందుకే గతేడాది లండన్‌లో 'లియానా' అనే ఆమె దగ్గర 'మూమెంట్ కోచింగ్'లో శిక్షణ తీసుకున్నాను. అక్కడికి వెళ్లాక నా శరీరాన్ని ఇంకా బాగా అర్థం చేసుకున్నాను. కొత్త విషయాలు చదవడం, నేర్చుకోవడం, కొత్తవారిని కలవడంవల్ల నాలోనే కాదు, నా నటనలోనూ చాలా మార్పు వచ్చింది. నా కొత్త సినిమాల్లో ఈ తేడాల్ని మీరు గమనించవచ్చు.





అమ్మ పాత్ర కీలకం...

నా జీవితంలో నేను చూసినవాళ్లలో అత్యంత నిబద్ధత కలిగిన వ్యక్తి అమ్మే. చిన్నతనంలోనే విడిపోయారు. చిన్నవయసులో ఒంటరిగా అక్షరను నన్ను చూసుకోవడం అమ్మ చాలా కష్టమే అయ్యింది. చాలా సార్లు అమ్మ మూడీగా, ఆందోళనతో ఉండేది. ఆ ప్రభావం మా మీద ఎప్పుడూ పడనివ్వలేదు. మమ్మల్ని ముందు మంచి మనుషులుగా పెంచింది. ఆ తరువాత సక్సెస్‌ఫుల్‌గా తయారు చేయడంలో అమ్మ పాత్ర కీలకం. అయితే నాకంటే అక్షర అమ్మకు బాగా దగ్గర.



ప్రత్యేక గౌరవం...

నా మిగతా సహనటులకంటే పవన్ కల్యాణ్ ఎంతో ప్రత్యేకం. కెరీర్ ప్రారంభంలో మూడేళ్లపాటు నాకు హిట్‌లేదు. 'ఐరన్ లెగ్' అని ప్రచారం చేశారు. కానీ పవన్ కల్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ తాము ముందుగా అనుకున్నట్టుగానే గబ్బర్‌సింగ్‌లో నన్ను కొనసాగించారు. ఆ సినిమా నా కెరీర్‌ను మార్చేసింది. నాపైన ఉన్న అపవాదుని పోగొట్టింది. ఆ తర్వాత టాలీవుడ్‌లోనేకాదు, కోలీవుడ్, బాలీవుడ్‌లోనూ అవకాశాలు వచ్చాయి. పవన్, హరీష్... వారిద్దరంటే నాకు ఎప్పటికీ ప్రత్యేక గౌరవం ఉంటుంది.



లండన్ నచ్చుతుంది...

సినిమాల్లో భాగంగా తరచూ కొత్త ప్రదేశాలు చూస్తుంటాను. టర్కీలోని 'పముక్కలే' ప్రాంతానికి వెళ్లినపుడు స్వర్గమంటే అలానే ఉంటుందేమో అనిపించింది. నగరాల పరంగా లండన్ బాగా నచ్చుతుంది. చాలాసార్లు వెళ్లాను కూడా. అక్కడ బోలెడుమంది స్నేహితు లున్నారు. చల్లని వాతావరణం, ఉత్సాహభరితమైన జీవనశైలి ఉంటుంది. అక్కడ ఎన్నిరోజులున్నా బోర్ కొట్టదు.

నెమ్మదిగా అర్థం చేసుకున్నా...

అమ్మా నాన్నను మమ్మాజీ, బాపూజీ అని పిలుస్తాం. అమ్మానాన్నలిద్దరూ విడిపోయినప్పుడు బాధ ఉంది. అయితే మనుషులు ఎలా ఉన్నా... వాళ్లను వాళ్లలాగే స్వీకరించడం నేర్చుకున్నా. అమ్మానాన్నలిద్దరినీ ఇద్దరు వ్యక్తులుగానే చూశాను. వ్యక్తిగా నన్ను ఎదిగేలా చేసిందదే. బాల్యంనుంచే స్వతంత్ర వ్యక్తిని నేను. హొమ్‌వర్క్‌లో కూడా అమ్మ సహాయం తీసుకోకపోయేదాన్ని. నా సమస్యలన్నీ నేనే పరిష్కరించుకునేదాన్ని.



అమ్మానాన్న విడిపోయినప్పుడు నేను ఇంకా చిన్నపిల్లని. నా దగ్గర సమాధానాలు లేని ప్రశ్నలు ఎన్నో. అన్ని విషయాలు ఇప్పుడే చెప్పాలని నాన్న అనుకోలేదు. నన్ను నాకు వదిలేశారు. సందర్భం వచ్చినప్పుడల్లా మాట్లాడుకుంటూ ఉన్నాం. చాలా కొత్త కొత్త విషయాలు తెలుస్తూ వచ్చాయి. నెమ్మదిగా అర్థం చేసుకోవడం మొదలుపెట్టాను. నాన్నతో నా అనుబంధాన్ని తిరిగి నిర్మించుకున్నాననే చెప్పాలి. ఇప్పుడు నాన్న నేను ఏ విషయాలైనా చర్చించగలం. అలాగే కొన్ని గీతలు కూడా ఉన్నాయి. వాటినెప్పుడూ దాటను. ఆ సమయంలోనే నేను మళ్లీ సంగీతం మీద దృష్టి పెట్టాను. నేను బాగా రాయాలని కూడా నాన్న కోరుకునేవారు.

నాన్నే స్ఫూర్తి..

నాన్న నాకు స్ఫూర్తి. ప్రతి విషయం గురించి ఎంతో కొంత తెలిసిన వ్యక్తి నాన్న. ఈ వయసులోనూ చాలా కష్టపడతాడు. చూడటానికి సీరియస్‌గా కనిపిస్తాడు కానీ.. హాస్య చతురత కలిగిన వ్యక్తి. నాన్న నాస్తికుడు. మా ఇంట్లో పూజ గది ఎప్పుడూ ఉండేది కాదు. అయినా నేను చర్చ్‌కో, గుడికో కచ్చితంగా వెళ్లేదాన్ని. నాన్న ప్రభావం నా మీద ఎక్కువ. నాన్నతో కలిసి చేసిన 'శభాష్ నాయుడు' త్వరలో రాబోతోంది. ఆయనతో పనిచేయడం అంత సులభం కాదు. ఆయనది దేన్నీ తేలిగ్గా తీసుకునే స్వభావం కాదు. సెట్‌లో అందరూ తనలానే కష్టపడాలనుకుంటారు. అందుకే మొదట నేను కాస్త భయపడ్డాను. కానీ ఆయనతో కలిసి పనిచేస్తుంటే మనకూ ఆటోమేటిగ్గా ఉత్సాహం వచ్చి బాగా పనిచేస్తాం. నాన్న చెప్పే మాటలు ఎంతో ప్రభావితం చేస్తాయి. 'వీధులూడ్చటం నీ పని అయితే.. అందులోనూ నెంబర్ వన్‌గా ఉండాలి' అంటారు. ఇండస్ట్రీలో ఎవరం ఎంత కాలం ఉంటామో తెలియదు. ఎవరి హవా ఎంత కాలం ఉంటుందో చెప్పలేం. అందుకే ఉన్నంతలో హండ్రెడ్ పర్సెంట్ మనసు పెట్టి పనిచేయాలి. అందరిని మెప్పించాలి. అయితే అన్నిసార్లు అందరినీ మెప్పించలేం కూడా! విమర్శలు వచ్చినా సానుకూలంగా తీసుకోవాలి.



కోపానికి కారణాలెన్నో!



ప్రతి వ్యక్తికి ఏదో ఒక సందర్భంలో కోపం, ఉద్రేకం, ఆవేశం రాకుండా ఉండవు. కోపాన్ని చాలామంది ఎన్నో విధాలుగా వ్యక్తపరుస్తారు. కొంతమంది కోపిస్టులమని, తమకు టెంపర్ ఎక్కువని చెప్పుకుంటారు. సాధారణంగా ఈ కోపాన్ని ఇంట్లో వారి మీద, పిల్లల మీద చూపుతుంటారు. కానీ తమ పై అధికారిపై చూపించరు. అంటే అధికారి పై కోపాన్ని అనుచుకుంటారు. కోపాన్ని అదుపు చేసుకోవాలనే ఆలోచన ఉంటే కొంతవరకైనా నియంత్రించగలరు.

- కోపం వల్ల చాలా సందర్భాల్లో నష్టాలు ఎదురైనప్పటికీ కొంత వరకు లాభాలు కూడా ఉంటాయి. ఒక్కొక్కసారి కంఠస్వరం గట్టిగా పెంచి గట్టిగా గర్జిస్తే తప్ప పనులు కావు. అయితే ఇది కొన్నిసార్లు మాత్రమే పని చేస్తుంది. కొన్నిసార్లు కోపిస్టులమనే పేరు కూడా వస్తుంది.
- కోపం రావడానికి అనేక అంశాలు దోహదం చేస్తుంటాయి. కొన్ని రకాల మానసిక వ్యాధులకు గురైన వారు కూడా అకారణంగా కోపాన్ని ప్రదర్శిస్తుంటారు.
- పెద్దవాళ్లు ప్రతి చిన్న విషయానికి పిల్లలపై అరవడం, కొట్టడం వంటి పనులు చేస్తూ ఉంటారు. ఇలా చేయడం వల్ల పిల్లలు కూడా అదే నేర్చుకుంటారు. కొన్నిసార్లు పరిస్థితుల ప్రభావం వల్ల మనకు కోపం వచ్చినప్పుడు పక్కవారిపై అరుస్తారు. అంతే కాదు త్వరగా మరిచిపోతారు కూడా.
- కొందరికి కోపం వస్తే బయటికి చెప్పలేక లోలోపలే గంటల కొద్ది ఆలోచించి, బాధపడి ఆరోగ్యపాడు చేసుకుంటారు. కోపాన్ని అదుపులో ఉంచుకొని వారు వీలైనంత తక్కువ స్థాయికి తగ్గించుకోవచ్చు. అప్పుడే కోపాన్ని సరైన పద్ధతిలో వ్యక్తం చేయడం సాధ్యం అవుతుంది.
- కోపం కలగడానికి పని ఒత్తిడి ఒక కారణమైతే! తమ మాటకు ఎదుటి వారు విలువ ఇవ్వడం లేదనేది మరొక కారణం. కోపాన్ని నియంత్రించుకోవాలనుకునే వారు ముందుగా రెండు వారాల పాటు తమ ప్రవర్తనను తామే అధ్యయనం చేసుకోవాలి. ఏయే సందర్భాల్లో కోపం వస్తుందో సమీక్షించుకోవాలి. కోపం వల్ల ఎలాంటి సమస్యలు ఉత్పన్నం అవుతాయనే పరిశీలించుకోవాలి. *

చిన్నారులకు పళ్ళు వచ్చే సమయంలో వాంతులు, విరేచనాలు ఎక్కువగా అవుతుంటాయి. ఆ సమయంలో చిన్నారులకు కింద ఇచ్చిన డైట్ ను పెడితే ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉంటారు.

- ఐదు లేదా ఆరు నెలలు ఉన్న చిన్నారులకు వెజిటేబుల్స్ పెట్టడం అలవాటు చేస్తే ఆరోగ్యంగా ఉంటారు. ఆ సమయంలోనే కూరగాయల రుచికి అలవాటు పడతారు. సంవత్సరం తర్వాత వెజిటేబుల్స్ పెడితే తినడానికి ఇబ్బంది పడతారు. అందుకే ఆరు నెలల నుంచి అలవాటు చేయాలి.
- సగ్గు బియ్యం చిన్నారుల ఎదుగుదలకు ఎంతగానో తోడ్పడుతుంది. నానబెట్టుకున్న సగ్గుబియ్యాన్ని ఉడికించుకొని దాంట్లో చిటికెడు ఉప్పు, బెల్లం, కొద్దిగా ఉప్పు వేసుకోవాలి. ఇలా మరిగించున్న తర్వాత నీటిని వడబోసి ఒక గ్లాసు తీసుకొని చిన్నారులకు తాగించాలి. సగ్గు బియ్యం చిన్నారులకు శక్తిని అందిస్తుంది, బెల్లంలో ఉన్న ఐరన్ చిన్నారుల ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. నడక నేర్చే సమయంలో ఈ ఆహారం తినిపిస్తే ఆరోగ్యంగా పెరుగుతారు.

ఆరు నెలలప్పుడే!



- అటుకులు, బఠానీలు, ఉప్పు, ఆలుగడ్డ ముక్కలు, క్యారెట్ ముక్కలు, బీన్స్ ముక్కలను మెత్తగా ఉడికించుకొని మెత్తగా గ్రైండ్ చేసి చిన్నారులకు తినిపించాలి. బియ్యం కన్నా అటుకులు చిన్నారుల ఆరోగ్యానికి చాలా మంచివి. అటుకులలో మంచి న్యూట్రీషన్స్ ఉంటాయి. రుచి కూడా అద్భుతంగా ఉంటుంది.
- పెసర పప్పులో చిటికెడు ఉప్పు వేసుకొని మెత్తగా ఉడికించుకోవాలి. ఇలా ఉడికించుకున్న పెసర పప్పును మెత్తగా గ్రైండ్ చేసుకొని చిన్నారులకు తినిపించాలి. పెసర పప్పులో ఉండే ప్రోటీన్లు, విటమిన్లు చిన్నారుల ఎదుగుదలకు తోడ్పడతాయి. *

ఇట్లచేద్దాం

పాదాల నొప్పి, మంట తగ్గాలంటే గోరువెచ్చని నీటిలో కొద్దిగా నిమ్మరసం, చిటికెడు ఉప్పు వేసి ఇరవై నిమిషాల పాటు పాదాలను నీటిలో ఉంచితే త్వరగా ఉపశమనం పొందుతారు.

పూసలతో ముచ్చటగా...

బీడ్స్... పూసలు. రంగురంగుల పూసలు. రకరకాల పూసలు. కేవలం దండలకేనా? రకరకాల వస్తువులను తయారు చేసుకోవచ్చు. ముద్దుగా దిద్దులు రూపొందించొచ్చు. అందమైన అలంకరణ వస్తువులుగా మార్చుకోవచ్చు. పిల్లలకు ఇష్టమైన బొమ్మలను చేసి పెట్టొచ్చు. స్నేహితులకు కానుకలూ ఇవ్వొచ్చు. అలాంటి రకరకాల బొమ్మలే ఇవి. పూసలు, అతికించుకోవడానికి గమ్, అల్లుకోవడానికి వైర్ ఉంటే చాలు. అద్భుతమైన బొమ్మలు మీ సొంతం.

























పార్టీలకు కాదు.. పాలసీలకు వ్యతిరేకం

- 'అనంత' పర్యటనలో జనసేన అధినేత



అనంతపురం : జనసేన ఇతర పార్టీలకు వ్యతిరేకం కాదని, అవి అవలంభించే ప్రజా వ్యతిరేక పాలసీలకే వ్యతిరేకమని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. మూడురోజుల పర్యటనలో భాగంగా శనివారం ఆయన అనంతపురం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. తొలుత జిల్లా కేంద్రంలోని గుత్తి రోడ్డు వద్ద రెండెకరాల్లో నిర్మించనున్న జనసేన పార్టీ కార్యాలయం పనులకు భూమిపూజ చేశారు.సాయంత్రం కేటీఆర్ ఫంక్షన్ హాల్లో రైతులు, వ్యవసాయ రంగ నిపుణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ప్రజలు, అభిమానులనుద్దేశించి పవన్ ప్రసంగించారు. తనపై అభిమానం చూపిస్తున్న ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేస్తానని చెప్పారు. రాయలసీమ ప్రాంతమంటే తనకు ఎంతో ఇష్టమన్నారు. అందుకే ఇక్కడ జనసేన పార్టీ తొలి కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. సీమలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వ్యవసాయ రంగ నిపుణులు, మేధావుల కమిటీ గుర్తించి, వాటి పరిష్కారం కోసం ప్రధాని మోఢీని కలుస్తామన్నారు. తనకు ప్రజలు ఓటు వేసినా.. వేయకపోయినా తానెప్పుడూ ప్రజల మనిషినేనన్నారు. యువశక్తే తన రాజకీయాలకు పునాది అని, ఇతర పార్టీలతో శత్రుత్వం వల్ల ప్రజలకు ప్రయోజనం ఉండదని అన్నారు. రైతులకు అండగా ఉండి,వారి శ్రేయస్సును కోరే పార్టీలకు జనసేన మద్దతు ఉంటుందన్నారు. 2019, 2024 ఎన్నికల కోసం రాజకీయాల్లోకి రాలేదని, ప్రజల పక్షాన ప్రతిక్షణం నిలబడి ప్రశ్నించే శక్తిగా ఎదిగేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఈ ప్రయాణంలో తనపై దాడులు జరిగినా బెదిరేది లేదన్నారు. రాజకీయాల్లో వారసత్వం మంచిది కాదన్నారు.

ఇష్టం లేకుంటే..

నమస్కారం పెట్టి పోవచ్చు

బీజేపీ విమర్శలపై చంద్రబాబు వ్యాఖ్య

అమరావతి : 'నేను మా వాళ్లను అదుపుచేస్తున్నాను. వారు మాత్రం ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతూనే ఉన్నారు. ఇష్టం లేకపోతే నమస్కారం పెట్టి పక్కకు పోవచ్చు' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో బీజేపీ చేస్తున్న విమర్శలపై ముఖ్యమంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు కలకలం రేపాయి. బీజేపీ ఎంఎల్ఏ విష్ణుకుమార్ రాజు, ఎంఎల్సీ సోమువీర్రాజు చేస్తున్న విమర్శలను విలేకరులు ప్రస్తావించినప్పుడు ఆయన ఈ విధంగా స్పందించారు. ఈ సందర్భంగా రాష్టానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న చేయూతపై చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. విభజన తర్వాత రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని, కేంద్రం ఏపీని ఆదుకుంటుందని విభజన చట్టం ప్రకారం చేయాల్సినవి కూడా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో రెండంకెల వృద్ధి ఉందని ఇక ప్రత్యేక హోదా ఎందుకని కేంద్రం అభిప్రాయపడు తోందన్నారు. కాని రాష్ట్ర తలసరి ఆదాయం విషయంలో దక్షిణాది రాష్ట్రాల కంటే రూ. 30 వేల నుంచి రూ 35 వేల వరకు వెనుకబడి ఉన్నామని సీఎం పేర్కొన్నారు. కనీసం రాష్ట్ర తలసరి ఆదాయం పెరిగే వరకు, దక్షిణాది రాష్ట్రాలతో సమానంగా అభివృద్ధి చెందే వరకు ఏపీని ఆదుకోవాలని ప్రధాని మోడితో భేటీ సందర్భంలో కోరానన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీపై బీజేపీ నాయకులు చేసే విమర్శలను ఆ పార్టీ అధిష్టానమే చూసుకోవాలని చెప్పారు. రాష్టాన్ని ఇన్నోవేషన్ వ్యాలీగా అభివృద్ధి చేస్తాం రాష్టాన్ని ఇన్నోవేషన్ వ్యాలీగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. దావోస్ పర్యటన అంశాలను ఆయన విలేకర్లకు వివరించారు. కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సహకారంతో శ్రీకాకుళం నుంచి కర్నూలు వరకు ఇన్నోవేషన్ వ్యాలీగా అభివృద్ధి చేస్తామన్నారు. దీంతోపాటు వ్యవసాయ రంగంలో సంక్షోభాన్ని నివారించడం, ఆ రంగ నిపుణుల సలహాలతో ఫుడ్ ప్రాసెసింగ్ అభివృద్ధి గురించి ప్రత్యేకంగా ఈ పర్యటనలో చర్చించామన్నారు. టెక్నాలజీ వినియోగం, కొత్త సాంకేతిక విధానాల ఆవిష్కరణలపై దృష్టి సారించామన్నారు. ఈ పర్యటనలో జ్యూరిచ్, హిటాచి సంస్థలతో ఎంఒయులు కుదుర్చుకున్నామని తెలిపారు. మొత్తం



25 ద్వైపాక్షిక సమావేశాల్లో పాల్గొన్నామని చెప్పారు. భారీ పెట్టుబడులు పెట్టేందుకు 50 సంస్థలు ' మెడ్‌టెక్ ఇన్నోవేషన్ సెంటర్ ' లెటర్ ఆఫ్ ఇంటెంట్ ఇచ్చాయన్నారు. ఆ కంపెనీల కోసం విశాఖలో వెయ్యి నుంచి 2 వేల ఎకరాల్లో మెడ్‌టెక్ ఇన్నోవేషన్ సెంటర్ జోన్ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో పర్యాటక, పారిశ్రామిక రంగాలను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు.

తేల్చుకోవాల్సింది మీరే

- మిత్ర ధర్మంపై సీఎం వ్యాఖ్యలు సమంజసం కాదు : బీజేపీ నేత పురందేశ్వరి



అమరావతి :బీజేపీ మిత్రధర్మం పాటించడం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అనడం సరికాదని, తమతో కలిసి ఉంటారో లేదో టీడీపీనే తేల్చుకోవాలని మాజీ కేంద్ర మంత్రి, బీజేపీ నేత పురందేశ్వరి అన్నారు. శనివారం విజయవాడలోని పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందిస్తూ రెండు పార్టీ అధ్యక్షులు కలిసి మాట్లాడుకుని పొత్తుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలనే టీడీపీ సర్కారు పేరుగా మార్చి తనదిగా చెప్పుకుంటుందని అన్నారు. పంచాయతీలకు కేంద్రం నుంచి నిధులు నేరుగా అందుతున్నాయని చెప్పారు. ఫిరాయింపు నేతలపై చర్యలు తీసుకో వాలని బీజేపీ అధ్యక్షులు అమిత్‌షాకు లేఖ రాసినట్లు తెలిపారు. ఎన్టీఆర్ హాయాంలో టీడీపీలోకి ఎవరైనా వస్తే రాజీనామా చేసి రావాల్సిందిగా సూచించినట్టు చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లు పాస్ చేయించుకోవాల్సిన బాధ్యత అన్ని పార్టీలపై ఉందని, ట్రిపుల్ తలాక్ విషయంలో మోడీ ప్రభుత్వ నిర్ణయం ముస్లిం మహిళలకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు.

ఫిబ్రవరి 21 నుంచి టెట్ పరీక్షలు

అమరావతి : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లకు తాజా షెడ్యూల్ విడుదలయింది. ఇప్పటికే రెండు సార్లు ఈ షెడ్యూల్ మార్చిన ప్రభుత్వం ముచ్చటగా మూడోసారి మార్చింది. అభ్యర్థుల కోరికపై 16 రోజుల పాటు ప్రభుత్వం ఈ పరీక్షలను వాయిదా వేసింది. ఫిబ్రవరి 5 నుంచి 15 వరకు నిర్వహించాల్సిన ఈ పరీక్షలను ఫిబ్రవరి 21 నుంచి మార్చి 3 వరకు నిర్వహిస్తామని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలో 'ఆధార్'

జైపూర్: 'ఆధార్' హిందీ పదాన్ని 2017ఏడాదికి గాను ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలో చేర్చేందుకు నిర్వాహకులు ఎంపిక చేశారు. జైపూర్‌లో జరుగుతున్న సాహిత్య వేడుకల్లో ఈ మేరకు ప్రకటించారు. ఆధార్ కార్డు వల్ల గతేడాది అధికంగా ప్రజాధరణ పొందిన ఆధార్‌ను ఈ డిక్షనరీలో నమోదు చేసేందుకు ఎంపిక చేశారు. 'మిత్రో', 'నోట్‌బందీ', 'గో రక్షక్' లాంటి హిందీ పదాలను పరిగణనలోకి తీసుకున్నా వాటిని వెనక్కు నెట్టేసి ఆ అవకాశాన్ని ఆధార్ వశపరుచుకున్నదని ప్రముఖ జర్నలిస్టు సౌరభ్ ద్వివేది తెలిపారు. పదాల్లో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి, కొత్త పదాలు వస్తుంటాయి, కానీ భాషను బతికించేది మాత్రం ఆ భాషను మాట్లాడే ప్రజలేనని రచయిత అశోక్ వాజపేయి అన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ నైతికత పరీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలోని ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థుల నైతికత మానవ విలువలు రాతపరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ అశోక్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. నైతికత, మానవ విలువలు రాతపరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 4,61,748 మంది దరఖాస్తు చేశారని తెలిపారు. వారిలో 4,47,091 మంది రాతపరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు. 14,657 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

ఇంటర్‌లో ముందస్తు ప్రవేశాలు చెల్లవు

ఇంటర్‌లో వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి ఆప్పుడే చేరితే ఆ ప్రవేశాలు చెల్లవని ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముందస్తుగానే చేర్పించవద్దని తల్లిదండ్రులకు సూచించారు. ప్రవేశాలు చేపట్టే యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏప్రిల్ చివరి నాటికి జూనియర్ కాలేజీలకు అనుబంధ గుర్తింపు ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలకు టీజీవో సమన్వయకర్తల నియామకం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలోని ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన సమన్వయకర్తలను తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీజీవో) సంఘం నియమించింది. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీజీవో చైర్మెన్, ఎమ్మెల్యే వి శ్రీనివాస్‌గౌడ్, అధ్యక్షురాలు వి మమత, ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ సమన్వయకర్తలకు నియామక పత్రాలు అందజేశారు. ఆదిలాబాద్‌కు ఎ శ్యాంనాయక్, కరీంనగర్‌కు పి పద్మయ్య, వరంగల్‌కు ఎ జగన్‌మోహన్‌రావు, ఖమ్మంకు ఖాజామియా, మహబూబ్‌నగర్‌కు కె శ్రీనివాస్‌రెడ్డి, నల్లగొండకు జి మోహన్‌రావు, నిజామాబాద్‌కు ఎం బాబురామ్ నాయక్, మెదక్‌కు బి వీరప్రతాప్‌లు సమన్వయకర్తలుగా నియమించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్, మమత మాట్లాడుతూ బంగారు తెలంగాణ నిర్మాణానికి అహర్నిశలు పాలుపడాలని కోరారు.

సింగరేణి అభివృద్ధిలో మీడియా పాత్ర కీలకం

- మీడియా వర్క్‌షాప్‌లో ఎస్ చంద్రశేఖర్



నవతెలంగాణ - హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి సంస్థ అభివృద్ధిలో మీడియా పాత్ర చాలా కీలకమైందని ఆ సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎస్ చంద్రశేఖర్ అన్నారు. రాజ్యాంగపరంగా కల్పించిన సమాచార హక్కును సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఆధ్వర్యంలో కొత్తగూడెం ఇల్లందు క్లబ్‌లో నిర్వహించిన 'మీడియా వర్క్‌షాప్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. కోల్‌బెల్ట్ ఏరియాలో క్షేత్రస్థాయి విలేకరులు సింగరేణికి, ఉద్యోగుల కుటుంబసభ్యులకు మధ్య సంధానకర్తలుగా పనిచేస్తున్నారని ప్రసంసించారు. తమ సంస్థలో ప్రజాసంబంధాల శాఖను పటిష్టం చేస్తూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ సోషల్‌మీడియాను సైతం విస్తృతంగా వినియోగించుకుంటున్నామని చెప్పారు. పీఐబీ అడిషనల్ డైరెక్టర్ ఇ మరియప్పన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో పీఐబీ ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. సింగరేణి జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్‌డీ) ఎస్‌వీఎస్‌ఎస్ రామలింగేశ్వరుడు మాట్లాడుతూ ప్రతివృత్తిలోనూ నైపుణ్యతను పెంచుకొనేందుకు ఈ తరహా సదస్సులు ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో ఇల్లందు ఏరియా జనరల్ మేనేజర్ కె లక్ష్మీనారాయణ, పీఆర్‌ఓ బి మహేష్, డైరెక్టర్ (ఈ అండ్ ఎమ్) ఎస్ శంకర్, పీఐబీ డిప్యూటీ డైరెక్టర్ పి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

'నేరచరితులకు స్నేహహస్తం కాంగ్రెస్'

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేరచరితులకు స్నేహహస్తం కాంగ్రెస్ పార్టీ అని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అన్నారు. శనివారం టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గాదరి కిషోర్‌తో కలసి మాట్లాడారు. నల్లగొండ మున్సిపల్ చైర్మెన్ లక్ష్మి భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యతో టీఆర్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఎదుర్కొనేదమ్ములేక, కాంగ్రెస్ పార్టీ శవరాజకీయాలు చేస్తుందన్నారు. శ్రీనివాస్‌ను హత్య చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న రాంబాబు, మల్లేష్, శరత్‌లు కోమటిరెడ్డి ఎమ్మెల్యే శిష్యులేనని చెప్పారు. శ్రీనివాస్ హత్యతో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశంకు ఎలాంటి సంబంధం లేదన్నారు. న్యాయ విచారణ జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పంట రకాల నమోదులో తెలుగు రాష్ట్రాలు వెనుకబాటు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పంట రకాల నమోదులో దక్షిణాది రాష్ట్రాలతో పాటు ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కూడా వెనుకబడి ఉన్నాయని కేంద్ర వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి, సీడ్స్, ప్రొటెక్షన్ ఆఫ్ ప్లాంట్ వెరైటీస్, ఫార్మర్స్ రైట్స్ అథారిటీ చైర్మెన్ డా. బి.రాజేందర్ అన్నారు. రైతుల హక్కులు, వ్యవసాయ జీవ వైవిధ్యంపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, పంట రకాల సంరక్షణ, రైతు హక్కుల సాధికారత సంస్థ, భారత వ్యవసాయ పరిశోధనా మండలి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడారు.

ఉద్యోగోన్నతులపై సంఘాల్లో కదలిక

- ఇద్దరు ఇంజినీర్ ఇన్ చీఫ్‌ల పలాయనం
- పోటాపోటీగా సమావేశాలు, ఆందోళన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గ్రామీణ తాగునీటి సర ఫరా, పారిశుధ్య విభాగం(ఆర్‌డబ్ల్యూఎస్ఎస్) శాఖల ఇంజినీర్ల మధ్య గొడవలు తారాస్థాయికి చేరాయి. రెండూ శాఖల ఉద్యోగుల అసోసియేషన్లు ఉన్నతాధికారులపై విరుచుకుపడ్డాయి. ఇటు పీఆర్, అటు ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యో గుల అసోసియేషన్ నాయకులు ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ ఇన్ చీఫ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకరు మౌనదీక్ష చేయగా, మరోకరు విలేకర్ల సమావేశం పెట్టి ఇష్టానుసారం మాట్లాడటం సరికాదంటూ వ్యాఖ్యానించారు. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లోని పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఉమ్మడి రాష్ట్ర కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. పీఆర్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ ఇన్ చీఫ్ వ్యాఖ్యలను తప్పుబట్టింది. ప్రభుత్వంలో మాట చెల్లుతున్న దని తప్పుడు పద్ధతుల్లో మాట్లాడరాదని హెచ్చరించింది. అలాగే



తెలంగాణ ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ల అసోసియేషన్ నేతలు మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ ఇన్ చీఫ్ అనవసర వ్యాఖ్యల మూలంగా మానోట్లో మట్టిపడుతున్నద న్నారు. పీఆర్ ఇంజినీర్ ఇన్ చీఫ్‌కు తమ ఆందోళనకు సం బంధం లేదన్నారు. ఇదిలావుండగా రెండు శాఖల ఇంజినీర్ ఇన్‌చీఫ్‌లు శనివారం ఆఫీసుకు సెలవుపెట్టడం గమనార్హం..

అందరికి ప్రమోషన్లు ఇవ్వాలి:పీఆర్ ఇంజినీర్స్

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖలో 20 నుంచి 24 ఏండ్లుగా ఉద్యోగోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారని, అందరికి ప్రమోషన్లు ఇవ్వాలని పంచాయతీ రాజ్ ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఏ ముజీబ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేశ్, కోశాధికారి డాక్టర్ కె.రజిత అన్నారు. 2008లో పీఆర్ ఇంజినీరింగ్ శాఖను విభజించారని చెప్పారు. అనాడు అర్ధరాత్రి ఉద్యోగులతో సంప్రదింపులు చేయకుండానే విభజించారని ఆరోపించారు. ముఖ్యమంత్రి ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అప్పట్లో 50 శాతం పీఆర్ పోస్టులను ఆర్‌డబ్ల్యూఎస్‌కు తరలించి అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస నిబంధనలు పాటించకుండా అనాడు చేసిన శాఖల విభజన మూలంగా ఇంజినీర్లకు అన్యాయం జరుగుతున్నదన్నారు. పీఆర్ ఇంజినీర్ ఇన్ చీఫ్ సత్యనారాయణరెడ్డిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ ఇన్ చీఫ్ సురేందర్‌రెడ్డి అనవసర వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. ఇద్దరు కూర్చుని మాట్లాడుకునే విషయాన్ని రచ్చకీడ్చడం సరికాదన్నారు. అంతేగాక ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగులు ధర్నా చేయడం మంచి పరిణామం కాదన్నారు.

ఉన్నతాధికారుల నిర్లక్ష్యమే: ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు

ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ప్రమోషన్లు పూర్తిస్థాయిలో రెగ్యులర్ కాకపోవడానికి ప్రధాన కారణం ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ ఇన్ చీఫ్ కారణమని తెలంగాణ ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఎల్లారెడి, ప్రధాన కార్యదర్శి వి. నరేందర్, నాయకులు రవీందర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆ శాఖ రాష్ట్ర కార్యాలయంలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలకు మౌనదీక్ష నిర్వహించారు. ఇందులో పదుల సంఖ్యలో ఇంజినీర్లు పాల్గొన్నారు. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం మూలంగా సీనియార్టీ ఖరారుకాక ఇన్‌చార్జి ప్రమోషన్లు రెగ్యులర్ కావడం లేదన్నారు. ఇంజినీర్ ఇన్ చీఫ్ స్థాయిలో నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. పోస్టుల విభజన సరిగ్గా జరగలేదన్నారు. కోర్టు కేసులు ఉన్నా, ఉన్నతాధికారులు సరైన మార్గంలో వెళ్లకపోవడంతో సమస్య ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉండిపోయిందన్నారు. దాదాపు పదేండ్ల క్రితం పీఆర్ నుంచి ఆర్‌డబ్ల్యూఎస్‌ను విభజించారన్నారు. అప్పటి నుంచి సమస్యలు అలాగే ఉన్నాయని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

దేశ భవిష్యత్తును తీర్చి దిద్దేది.. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానమే

- ఖగోళ శాస్త్రాన్ని పోలీసులకు బోధనాంశంగా చేర్చడం అభినందనీయం : ఇస్రో మాజీచైర్మన్ ప్రొఫెసర్ కిరణ్‌కుమార్
- కెఎస్ వ్యాస్ స్మారకోపన్యాసమిచ్చిన కిరణ్‌కుమార్



(ఫైల్)

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

దేశ భవిష్యత్తును తీర్చి దిద్దేది, పేద ప్రజలకు మరింతగా మేలు చేసేది శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానమేనని,ఈ దిశగా మరింత ముందుకు సాగాలని ఇస్రో మాజీ చైర్మన్ ప్రొఫెసర్ కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆర్‌బీవీఆర్ పోలీసు అకాడమీ అధ్వర్యాన బేగంపేట్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్‌లో శనివారం జరిగిన కెఎస్ వ్యాస్ 22వ స్మారకోపన్యాస సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన స్పేస్ టెక్నాలజీ మెయింటెనెన్స్ లా అండ్ ఆర్డర్ అనే అంశంపై ప్రసంగించారు. శాస్త్ర సాంకేతిక రంగంలో దేశాన్ని ప్రపంచ అగ్రదేశాల సరసన ఇస్రో నిలిపిందని, ఇందకు అనేక మంది శాస్త్రవేత్తలు నిద్రాహారాలు మాని తమ యజ్ఞాన్ని కొనసాగించారని ఆయన తెలిపారు. ముఖ్యంగా నావిగేషన్‌మ్యాప్, రైల్వే సెక్యూరిటీ కోసం సాంకేతిక పరిజ్ఞానం, సముద్రంలో మత్స్యకారులకు డీడీఎస్ టెక్నాలజీ మొదలు దేశ భద్రతకు అవసరమైన స్పేస్ టెక్నాలజీని రూపొందించడంలో మన శాస్త్రవేత్తలు గణనీయమైన ప్రతిభను కనబరిచారని కిరణ్‌కుమార్ అన్నారు. ఖగోళ పరిశోధనల్లోనూ ఇస్రో పాత్ర అత్యంత కీలకంగా మారిందని, ఇందులో పలు విదేశీ శాటిలైట్‌లను అంతరిక్షంలోకి పంపించడంలో అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించడం ద్వారా దేశ ప్రతిష్ట ఇనుమడించిందని ఆయన అన్నారు. ఇస్రో చేసిన పలు ప్రయోగాలు, వాటి ద్వారా దేశానికి ఒనగూరిన లబ్ది , ముఖ్యంగా ప్రజలకు టెక్నాలజీ ద్వారా అందుతున్న సేవల గురించి ఆయన వివరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు, భయంకరంగా మారుతున్న ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌కు స్పేస్ టెక్నాలజీని విరివిగా వినియోగించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఇందుకోసం పోలీసు శాఖలోని అధికారులు మొదలుకొని కిందిస్థాయి సిబ్బంది వరకు ఈ సాంకేతిక పరిజ్ఞానం పట్ల సముచిత అవగాహనను కల్పించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ముఖ్యంగా పోలీసు అకాడమీలో కానిస్టేబుల్ మొదలుకొని అదనపు ఎస్పీ స్థాయి అధికారుల వరకు ఇచ్చే శిక్షణలో ఖగోళ శాస్త్ర సాకేంతిక పరిజ్ఞానాన్ని భోదనాంశంగా చేర్చడం అభినందనీయమని ఆయన అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రాష్ట్ర డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ పోలీసుశాఖలో అకుంఠిత కార్యదీక్షాపరుడు, కుశాగ్రబుద్ధిగలవాడు, అవసరమైనప్పుడు సాహసోపేత నిర్ణయాలు తీసుకొని త్రికరణశుద్ధితో అమలు చేసినవాడు డీఐజీ కెఎస్ వ్యాస్ అని కొనయాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఆరితేరిన ఆయన చట్టవ్యతిరేకంగా వ్యవహరించిన నక్సలైట్లపై ఉక్కుపాదం మోపుతూ రూపొందించిన గ్రేహౌండ్స్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈరోజు నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాలన్నీ గ్రేహౌండ్స్ యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయడం వ్యాస్ దూరదృష్టికి నిదర్శనమని అన్నారు. ట్రాఫిక్ సమస్యలపై 18 ఏండ్ల క్రితమే వ్యాస్ తీసుకున్న చర్యలు అందరికీ మార్గదర్శకమయ్యాయని అరుణావ్యాస్ అన్నారు. డీఐజీ వ్యాస్ చిత్తశుద్ధి, నిర్ణయాలు తీసుకోవడంలో నిర్భయత్వం మొదలైన అంశాలు ఆయన సహచర అధికారులకే గాక, తర్వాత వచ్చిన ప్రతి పోలీసు అధికారికి ప్రేరణను ఇస్తున్నాయని అకాడమి డైరెక్టర్ జితేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అంజనీకుమార్, నవీన్‌చంద్, సజ్జనార్, వీవీ శ్రీనివాస్‌రావ్‌తోపాటు మాజీ డీజీపీలు హెచ్‌జె దొర, రామ్మోహన్‌రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

న్యాయవ్యవస్థపై నమ్మకం సన్నగిల్లుతోంది

- న్యాయం కోసం ఏండ్లతరబడి ఎదురుచూపు: హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎంఎన్‌రావు



మాట్లాడుతున్న ఎంఎన్‌రావు

నవతెలంగాణ- సిటీబ్యూరో

సుప్రీం కోర్టు సీనియర్ జడ్జీలు ఆరోపిస్తున్నట్టు సుప్రీం కోర్టు, స్వయానా చీఫ్ జస్టిసే తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే ఇక సామాన్యుడు న్యాయం కోసం ఎవరిని ఆశ్రయించాలి అనే ప్రశ్న తలెత్తుతోందని హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎంఎన్.రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర మేధావుల సమాఖ్య శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "జ్యుడీషియరీ అండ్ సోషల్ జస్టిస్" అంశంపై ఏర్పాటు చేసిన సెమినార్‌కు ఎంఎన్.రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ఎవరికైనా అన్యాయం జరిగితే కోర్టులో దావా వేసి న్యాయం కోసం ఎదురు చూస్తుంటారన్నారు. సుప్రీం కోర్టు, స్వయానా చీఫ్ జస్టిసే తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారని సీనియర్ జడ్జీలు చెప్పిన నేపథ్యంలో సామాన్యులకు న్యాయం ఎక్కడ జరుగుతుందని అన్నారు. దేశంలోని అనేక కోర్టుల్లో కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్న కేసులు ఏండ్ల తరబడి పరిష్కారం కాకుండా మురుగుతున్నాయని చెప్పారు. కొన్ని కేసులను న్యాయమూర్తులే వదిలేస్తే.. మరికొన్ని కక్షిదారు కోర్టుకు హాజరు కాకపోవడం, సమయానికి సాక్ష్యాలను సేకరించకపోవడం ఒక కారణమన్నారు. దీంతో సామాన్యుడు న్యాయం కోసం ఏండ్ల తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత అక్రమాస్తుల కేసు కూడా అనేక ఏండ్లుగా పెండింగ్‌లో ఉండి ఆమె మరణానంతరం జడ్జిమెంట్ వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలాగైతే కోర్టులపై ప్రజలకు నమ్మకం క్రమంగా సన్నగిల్లుతుందని అభిప్రాయపడ్డారు. న్యాయస్థానాల్లో లంచాలు చెల్లించుకుంటేగానీ న్యాయం జరగదన్న నమ్మకం ప్రజల్లో కలుగుతోందని, ఈ విషయాన్ని స్వయాన సుప్రీం కోర్టు చీఫ్ జస్టిసే ప్రస్తావించారని గుర్తుచేశారు. కలకత్తా హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ కణ్ణన్ కేసు విచిత్రమైందన్నారు. ఆయన ఇంటి వద్ద కూర్చుని జడ్జిమెంట్లు ఇచ్చేవారని, ఇది చట్ట విరుద్ధమని చెప్పారు.

ప్రొఫెసర్ తిరుమలి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చెప్పినట్టు చీఫ్ జస్టిస్ నడుచుకుంటున్నారన్న విషయం సీనియర్ జడ్జీలు ఆరోపించే వరకు ప్రపంచానికి తెలియదన్నారు. సుప్రీం కోర్టులోనే ఇలాంటి తప్పుడు పనులు జరిగితే ఇక ప్రజలకు ఎక్కడ న్యాయం జరుగుతుందన్న అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ప్రొఫెసర్ మురళీమనోహర్ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు రూపొందించిన ప్రజావ్యతిరేక చట్టాలను బలవంతంగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తే సుప్రీం కోర్టు అనేక సందర్భాల్లో వ్యతిరేకించిందన్నారు. అలాంటి సుప్రీం కోర్టులో జ్యుడీషియరీ, సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ వ్యవహారంపై నలుగురు సీనియర్ జడ్జీలు మీడియా ముందుకు వచ్చారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోందన్నారు. దీన్ని బట్టి న్యాయవ్యవస్థ అనేది ఒక ప్రశ్నగా మిగిలిపోయిందన్నారు. సుప్రీం కోర్టు తప్పుడు మార్గంలో నడుస్తున్నప్పుడు ఇక సామాన్యుడు న్యాయం కోసం ఎవరిని ఆశ్రయించాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ న్యాయమూర్తి జస్టిస్ భాస్కర్‌రావు, ఎస్‌వీకే కన్వీనర్ ఎస్.వినయ్‌కుమార్, పేరెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు కోసం 11న మహాధర్నా

- పోస్టర్ ఆవిష్కరించిన ఎస్టీయూ నేతలు



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 11న హన్మకొండలో రాష్ట్రస్థాయి మహాధర్నా నిర్వహిస్తున్నట్టు ఎస్టీయూటీఎస్ ప్రకటించింది. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లో ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆ సంఘం నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భుజంగరావు, సదానందంగౌడ్ మాట్లాడుతూ...సీపీఎస్ విధానం రాష్ట్రంలోని లక్షా 20 వేలకు పైగా ఉద్యోగ, ఉపాధ్యాయుల బతుకులను ఛిద్రం చేస్తుందని అన్నారు. అకాలంగా వివిధ ప్రమాదాల్లో మరణించిన సీపీఎస్ ఉద్యోగులకు ఎలాంటి ఆసరా అందకా కుటుంబాలు వీధిపాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మానవతా దృక్పథంతో ఆలోచించి, పాత పింఛన్ విధానాన్నే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎస్ విధానం రద్దు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు వచ్చేనెల 11న హన్మకొండలో ఉదయం 10గంటలకు మహాధర్నా నిర్వహిస్తున్నామనీ, ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి తోడ్పడే విద్యా విధానాలవసరం

- ప్రముఖ శాస్త్రవేత్త డా. ఎస్. కరుణానిధి

హైదరాబాద్: కేవలం విద్యకే ప్రాధాన్యత ఇవ్వకుండా విద్యార్థుల సమగ్రాభివృద్ధికి తోడ్పడే విద్యా విధానాలే సమాజానికి మేలు చేస్తాయని ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. కరుణానిధి అన్నారు. సంస్కృతి-2018 పేరుతో నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వార్షికోత్సవం శ్రీనగర్‌కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డీన్ వి.వి.ఎల్. శేఖర్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా.ఎస్. కరుణానిధి మాట్లాడుతూ... పాఠ్యాంశాలను బట్టీ పట్టించడం ద్వారా కాకుండా, ఆసక్తికరంగా బోధిస్తే విద్యార్థుల్లో సృజనాత్మకత వెల్లివిరుస్తుందన్నారు. మరో అతిథి విజయ నిర్మల మాట్లాడుతూ మార్కుల విషయంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతర విద్యార్థులతో పోల్చకుండా జాగ్రత్త వహించాలన్నారు. పిల్లల ఆసక్తులను గమనించి వారిని ఆ రంగంవైపు ప్రోత్సహించాలని ప్రత్యేక అతిథిగా హాజరైన ప్రముఖ సినీ నటుడు రఘు కారుమంచి అన్నారు. ఈ సందర్భంగా చదువుల్లో, క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డీన్ ఆంజనేయులు, డీన్ రోహిణి, ప్రిన్సిపాల్ శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

హమ్మింగ్‌బర్డ్ ఒలింపియాడ్‌లో రవీంద్రభారతి హవా

హైదరాబాద్: జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే హమ్మింగ్‌బర్డ్ ఒలింపియాడ్‌లో రవీంద్రభారతి స్కూల్ విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. తొలిదశ పరీక్షా ఫలితాలలో రవీంద్రభారతి విద్యార్థులు 99 బంగారు, 49 వెండి, 30 కాంస్య పతకాలు సాధించారు. 171 మంది విద్యార్థులు రెండో దశ పరీక్షలకు అర్హత సాధించారని రవీంద్రభారతి విద్యాసంస్థల చైర్మెన్ ఎం. సుబ్రహ్మణ్యం (మణి) తెలిపారు. ఈ పరీక్షను ఒకటో తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థులకు వివిధ కేటగిరీల్లో నిర్వహిస్తారని ఆయన వివరించారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో జరిగే ఒలింపియాడ్ పరీక్షలలో విద్యార్థులు విజయం సాధించడానికి ఒలింపియాడ్ ప్రోగ్రామ్‌ను అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. విజేతలను, వారి తల్లిదండ్రులను, బోధనా సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు.




కాబూల్‌లో మారణహోమం

అంబులెన్స్ బాంబు దాడిలో 95 మంది మృతి, 158 మందికి గాయాలు

కాబూల్: ఆఫ్ఘనిస్తాన్ రాజధాని కాబూల్‌లో ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. విదేశీ రాయబార కార్యాలయాలు, ప్రభుత్వ భవనాలు ఉన్న ప్రాంతానికి సమీపంలో బాంబు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 95 మంది చనిపోయారు. అంబులెన్స్‌లో బాంబులు పెట్టి పేల్చేసినట్టు అక్కడి అధికారులు తెలిపారు. అఫ్ఘాన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హై పీస్ కౌన్సిల్ ఆఫీస్‌కు సమీపంలోని చెక్‌పాయింట్ వద్దకు ఓ అంబులెన్స్ వచ్చి ఆగింది. కొద్ది సేపటికే ఆ వాహనం పేలిపోయింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 95మందికి మృతిచెందగా.. మరో 158మందికిపైగా గాయపడ్డారు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే సహాయకచర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. కాగా.. దాడి చేసింది తామేనంటూ తాలిబన్ ఉగ్రవాద సంస్థ ప్రకటించింది. గతవారమే కాబూల్‌లోని ఓ ఇంటర్‌కాంటినెంటల్ హోటల్‌లో తాలిబన్ ఉగ్రవాదులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఆ ఘటనలో పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు.

60 ఏండ్ల గొరిల్లా మృతి



కాలిఫోర్నియా : ప్రపంచం లోనే వృద్ధ గొరిల్లా విలా (60) గురువారం శాన్ డియోగ్ జూలోని సఫారీ పార్క్‌లో మృతి చెందిన ట్టుగా స్థానిక మీడియా తెలిపింది. ఆఫ్రికాలోని పశ్చిమ లోతట్టు ప్రాంతమైన కాంగోలో 1957లో ఈ గొరిల్లా జన్మించిందని, శాన్‌డియోగ్ జూలోనే పెరిగిందని పేర్కొంది. గొరిల్లా మృతికి గల కారణాలు అధి కారికంగా వెల్లడి కాలేదని స్పష్టం చేసింది. ఐదు తరాల గొరిల్లాల మాతృకగా విలా జీవించినట్టు సఫారి పార్క్‌లోని క్షీరదాల క్యురేటర్ రాండీ రిచేస్ పేర్కొన్నారని తెలిపింది.

50 దేశాలతో దౌత్య దోస్తి



ఇటీవల కాలంలో ఉత్తర కొరియా, అమెరికా సంబంధాలు మీడియాలో ప్రముఖంగా చోటు చేసుకుంటున్నాయి... ట్రంప్ యుద్ధానికి దిగే పిచ్చిపని చేస్తాడా అన్నంతగా పరిస్థితి వుంది... రెండున్నర కోట్ల జనాభాతో వున్న ఒక చిన్న దేశం ఉత్త కొరియా... దాన్నొక బూచిగా చూపుతున్నారు. ఉత్తరకొరియా యుద్ధన్మోది. అణు యుద్ధాన్ని కొరకుంటోందంటూ అమెరికా, దాని అనూకూల బడా కార్పోరేట్ మీడియా ఊదరగొడుతోంది. ఎక్కడైనా ఇంత చిన్న దేశం ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన అమెరికా మనుగడకే ప్రమాదకరంగా మారిందంటే నమ్మగలమా..... ఏ పరిస్థితుల్లో ఉత్తరకొరియా అణు కార్యక్రమం చేపట్టింది?

ఉత్తరకొరియా హైడ్రోజన్ బాంబును పరీక్షించడంపై అమెరికా రంకెలేస్తోంది. కానీ, ప్రపంచ చరిత్రలో అణ్వాయుధాలను ప్రయోగించిన, ప్రయోగించాలని చూసిన ఏకైకా దేశం అమెరికాయే ఇప్పటికీ భారీగా అణ్వాయుధాలను అధునీకరించుకునేందు ట్రిలియన్ డాలర్లు (రూ. 63 లక్షల కోట్లు) ఖర్చుపెడుతోంది. తమ మిత్రదేశాలైనా ఇజ్రాయిలు, పాకిస్తాన్‌లు అణు సామర్ధ్యాన్ని సంతరించుకునేందుకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను కారణం అమెరికాయే... అత్యంత అధునికమైన అణ్వస్త్ర పరీక్షలను జరుపుతూ తన అణుపాటవాన్ని అమెరికా మెరుగు పరుచుకుంటోంది. కానీ, ఆత్మరక్షణార్థం ఉత్తరకొరియా అణుపరీక్షలు జరిపితే యుద్ధం చేస్తానని అమెరికా హెచ్చరిస్తోంది...

అంతే కాదు. ఉత్తర కొరియా ఏకాకి అని, దాదాపు అన్ని దేశాలతోనూ ఉత్తర కొరియాకు సంబంధాలు లేవనే రీతిలో ప్రచారం సాగుతుంది. వాస్తవానికి ఉత్తర కొరియాకు సుమారు 50 దేశాలతో దౌత్య సంబంధాలు ఉన్నాయి.

అమెరికా సామ్రాజ్యవాదం బెదిరింపులు, హూంకరింపులతో ఉద్రిక్తంగా మారిన కొరియా ద్వీపకల్పంలో ఇప్పడు శాంతి పవనాలు వీస్తున్నాయి, కొత్త సంవత్సరం ప్రారంభంలో ఉభయ కొరియా దేశాలు తమ మధ్య విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని నిర్ణయించడం ఆహ్వానించ దగ్గ పరిణామం. ఇది కొరియా ద్వీపకల్పానికే కాక, యావత్ ప్రపంచానికే గొప్ప ఊరటనిస్తుంది.

ప్యాంగ్యాంగ్: ఉత్తర కొరియా ఏకాకి అని, దాదాపు అన్ని దేశాలతోనూ ఉత్తర కొరియాకు సంబంధాలు లేవనే రీతిలో ప్రచారం సాగుతుంది. వాస్తవానికి ఉత్తర కొరియాకు సుమారు 50 దేశాలతో దౌత్య సంబంధాలు ఉన్నాయి. ఉత్తర కొరియా 1948లో ఏర్పడింది. అప్పటి నుంచి 160కి పైగా దేశాలతో దౌత్య సంబంధాలు ఏర్పరచుకుంది. ప్రస్తుతం చైనా, రష్యా, భారత్, పాకిస్థాన్ సహా 48 దేశాల్లో ఉత్తర కొరియాకు చెందిన 50 దౌత్య కార్యాలయాలు, కాన్సులేట్లు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. భారత్, యునైటెడ్ కింగ్‌డమ్(యూకే), జర్మనీ, స్వీడన్ సహా 25 దేశాలు ఉత్తర కొరియాలో తమ దౌత్య కార్యాలయాలు నడుపుతున్నాయి. ఉత్తర కొరియాతో దౌత్య సంబంధాలు ఏర్పాటు చేసుకున్న మొదటి దేశాల్లో చైనా, రష్యా ఉన్నాయి.

సంబంధాలపై అమెరికా ఒత్తిడి

ఉత్తర కొరియాతో సంబంధాలు తెంచుకోవాలని కొంత కాలంగా ప్రపంచ దేశాలను అమెరికా ఒత్తిడి చేస్తోంది. ఉత్తర కొరియాతో 'అన్ని దేశాలు అన్ని సంబంధాలను తెంచుకోవాలి' అని ఐక్యరాజ్యసమితిలో అమెరికా ప్రతినిధి నిక్కీ హేలీ కోరారు. గత కొన్ని నెలల్లో స్పెయిన్, కువైట్, పెరూ, మెక్సికో, ఇటలీ, మయన్మార్ దేశాలు తమ భూభాగంలోంచి ఉత్తర కొరియా రాయబారులను, ఇతర దౌత్యవేత్తలను వెనక్కు పంపించేశాయి. పోర్చుగల్, ఉగాండా, సింగపూర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) దేశాలు ఉత్తర కొరియాతో సంబంధాలను తాత్కాలికంగా తెంచుకున్నాయి.

సంబంధాలు పెంచుకుంటున్న 20 దేశాలు

- కొన్ని దేశాలు సంబంధాలు పెంచుకొంటున్నాయి. ఈ జాబితాలో హంగేరీ, టర్కీ, ఆస్ట్రేలియా సహా 20 దేశాలు ఉన్నాయి.
- నిర్మాణ రంగ ప్రాజెక్టుల్లో అనేక ఆఫ్రికా దేశాలకు ఉత్తర కొరియా తోడ్పాటు అందిస్తోంది. పలు ఇతర దేశాలతో ఇంధనం, వ్యవసాయం రంగాల్లో సహకారంపై చర్చలు జరుపుతోంది.
- ఉత్తర కొరియాతో అమెరికా, జపాన్, ఎన్నడూ దౌత్య సంబంధాలను ఏర్పరచుకోలేదు.
- ఆసియా, ఐరోపా, మధ్యప్రాచ్యం, ఆఫ్రికాల్లోని ఉత్తర కొరియా దౌత్య కార్యాలయాలు దేశానికి ఆదాయార్జనలో కీలక భూమిక పోషిస్తున్నాయి.
- క్యూబా, వెనిజులా, లావోస్ లాంటి కొన్ని దేశాలకు, ఉత్తర కొరియాకు మధ్య సైద్ధాంతిక సారూప్యాలు ఉన్నాయి.
- విదేశాల్లోని ఉత్తర కొరియా దౌత్య అధికారులు తమ ప్రభుత్వానికి అనుకూలంగా మద్దతు కూడగట్టేందుకు కృషి చేస్తుంటారు.
- కొరియా సమస్యను పరిష్కరించేందుకు దౌత్యమే ఉత్తమ మార్గమని, దౌత్య మార్గాలను ఎప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని ప్యాంగ్యాంగ్‌లో దౌత్య కార్యాలయాలను నిర్వహిస్తున్న జర్మనీ లాంటి దేశాలు భావిస్తున్నాయి.

ఉభయ కొరియాల స్నేహగీతం..!

- కొరియా ద్వీపకల్పంలో ఇప్పుడు శాంతి పవనాలు వీస్తున్నాయి, కొత్త సంవత్సరం ప్రారంభంలో ఉభయ కొరియా దేశాలు తమ మధ్య విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని నిర్ణయించుకోవడం ఆహ్వానించ దగ్గ పరిణామం అయితే తమ ఆటగాండ్లకు భద్రతకు గ్యారంటీ లేదన్న సాకుతో వింటర్ ఒలింపిక్స్ నుంచి తప్పకోవాలని.. అమెరికా చూస్తున్న తరుణంలో దక్షిణ కొరియాకు బాసటగా నేనున్నానని ఉత్తర కొరియా నేత కిమ్ ముందుకురావడం హర్షణీయ పరిణామం ...ఈ నెల 9న ఉభయ కొరియాల నరిహద్దుల్లోని పన్‌ముంజామ్‌లో సమవేశం జరిగింది.
- ఉత్తర, దక్షిణ కొరియాల క్రీడాకారులు శీతాకాల ఒలింపిక్స్ ప్రారంభ కార్యక్రమంలో ఒకే పతాకంతో కవాతులో పాల్గొనాలని నిశ్చయించుకున్నాయి. ప్రస్తుతం ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య సైనిక రహిత ప్రాంతంలో జరుగుతున్న చర్చల్లో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతోపాటు ఉభయ కొరియాల క్రీడాకారులతో కూడిన ఐస్‌హాకీ బృందం శీతాకాల ఒలింపిక్స్‌లో పాల్గొననుంది. వచ్చే నెల తొలివారంలో ఈ క్రీడోత్సవం ప్రారంభం కానుంది.
- 1945లో కొరియాలోకి అమెరికా సేనలు ప్రవేశించడం ద్వారా మొదలైన అగ్రరాజ్య జోక్యం.. 1950-53 కొరియా యుద్దంతో పతాక స్థాయికి చేరింది.లక్ష మందికి పైగా అమాయకుల ప్రాణాలను బలిగొన్న భయానక యుద్ధం కొరియా ద్వీపకల్పాన్ని రెండుగా చీల్చింది. ఆ తరువాత ఉత్తర కొరియాను 'దుష్ట రాజ్యంగా ప్రకటించిన అమెరికా, దానిని అస్థిరపరిచేందుకు వేయని ఎత్తు లేదు. పన్నని కుట్ర లేదు...

ఆక్స్‌ఫర్డ్‌లో 'కామన్' టాయిలెట్స్..

- ఓటింగ్ ద్వారా నిర్ణయించిన విద్యార్థులు



లండన్ : మూత్రశాలల వద్ద కనిపించే ఆడ, మగ గుర్తుల్ని తీసేయాలని, ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలో ఇకపై 'కామన్' టాయిలెట్స్ విధానాన్ని అనుసరించాలని అక్కడి విద్యార్థులు నిర్ణయించారు. ఇకపై ఇక్కడ మూత్రశాలల ముందు ఆడ, మగ గుర్తుల్ని తీసేసి, అందరికీ వర్తించే ఒకే గుర్తును ఇక్కడ వాడతారు. కామన్ టాయిలెట్స్ ఏర్పాటుచేయటం ద్వారా స్వలింగ సంపర్కులు ఎదుర్కొంటున్న ఇబ్బంది దూరమవుతుందని విద్యా ర్థులు భావిస్తున్నారు. వర్సిటీలో స్వలింగ సంపర్కులు వివక్షకు గురవుతున్నారని, లింగ సమానత్వం తీసుకురావటం కోసం ఈ కేసుకు సంబంధించి ప్రత్యేక అధికారి 'కామన్' టాయిలెట్స్ సూచన చేశారు. అయితే కేవలం ఈ ఒక్క నిర్ణయంతోనే అంతా అయిపోదని, వివక్షతో కూడిన విధానాలకు కూడా ముగింపు పలకాలని ఆయన అభిప్రాయ పడుతున్నారు. ఇదిలా ఉండగా, తాజా నిర్ణయంపై కొంతమంది యువతులు ఆందోళన వ్యక్తం చేశారు. 'కామన్' మూత్రశాలలు లైంగికవేధింపులకు కేంద్రంగా మారుతుందన్న ఆందోళన వ్యక్తం చేశారు.

ఆర్కిటిక్ మహా సముద్రంలోంచి

ఓడల రవాణా మార్గానికి చైనా ప్రణాళిక



బీజింగ్: ఆర్కిటిక్ మహా సముద్రంలోంచి ఓడల రవాణా మార్గం అభివృద్ధి కోసం రూపొందించిన ప్రణాళికను చైనా విడుదల చేసింది. ఆ మార్గం పోలార్ సిల్క్ రూటుగా మారనుంది. భూతాపం (గ్లోబల్ వార్మింగ్) ప్రభావంతో ఆర్కిటిక్‌లో ఏర్పడే ఈ మార్గం క్రమంగా అంతర్జాతీయ వాణిజ్య వ్యవహారాలకు ఎంతో కీలకంగా మారుతుందని చైనా అభిప్రాయడింది. ఈ మార్గాన్ని అభివృద్ధి చేసేందుకు రష్యాతో పాటు.. ఇతర ఆర్కిటిక్ దేశాలతో కలిసి పనిచేస్తామని పేర్కొంది. ఈ రూట్‌లో సౌకర్యాలను అభివృద్ధి చేసి.. ట్రయల్ రన్స్ నిర్వహించాలని షిప్పింగ్ సంస్థలకు పిలుపునిచ్చింది. జల, రోడ్డు మార్గాల ద్వారా యూరప్‌తో పాటు పలు దేశాలతో అనుసంధానం అయ్యేందుకు చైనా ఎంతో కాలంగా ఎదురుచూస్తోంది. అందులో ఈ ఆర్కిటిక్ మార్గం కీలకమైనది. చైనా కేంద్రంగా ఆసియా.. యూరప్ భూభాగాల్లో రోడ్లు.. పోర్టులు.. రైల్వేల అభివృద్ధికి దాదాపు రూ. 63 లక్షల కోట్లు (ట్రిలియన్ డాలర్ల) ప్రాజెక్టు చేపట్టాలన్నది చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆలోచన.

టీజేఏసీ రాజకీయ పార్టీగా మారదు

- రైతు సమస్యలపై అధ్యయనం
- చైర్మెన్ కోదండరామ్



నవతెలంగాణ - సంగారెడ్డి ప్రతినిధి

టీ జే ఏ సీ భవిష్యత్తులో రాజకీయ పార్టీగా మారబోదని సంఘం చైర్మెన్, ప్రొఫెసర్ కోదండరామ్ స్పష్టం చేశారు. శనివారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో రైతు, నిరుద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో నియోజకవర్గానికి రెండు గ్రామాల చొప్పున రైతు సమస్యలపై అధ్యయనం చేస్తున్నామన్నారు. అధ్యయనం చేసిన సమస్యలపై ఫిబ్రవరి నాలుగో తేదీన హైదరాబాద్‌లో టీజేఏసీ విస్తృత స్థాయి సమావేశంలో చర్చిస్తామన్నారు. ఆ తర్వాత భవిష్యత్‌లో పోరాటాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. మొత్తం 25 ఎకరాల్లో పత్తి సాగు చేయగా, నకిలీ విత్తనాల కారణంగా ఎకరాకు రూ.16వేల వరకు నష్టం వాటిల్లినట్టు సదాశివపేట మండల బొబ్బిలిగామ గ్రామానికి చెందిన రైతుల ఏదుల రాజు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో టీజేఏసీ జిల్లా నాయకులు బీరయ్య యాదవ్, పల్పనూరి శేఖర్, తుల్జారెడ్డి, ఆత్మకూర్ నగేష్, ఖాజా, రైతులు పాల్గొన్నారు.

ష్..ష్..ష్..



కడుపులోనే దాచుకోవాలే..కక్కితే కటకటాలే..!

- కాచుక్కూర్చున్న 506, 507 సెక్షన్లు
- నోటికి తాళం..ఓన్లీ మెచ్చుకోళ్ల మేళం
- 'కారు'ణ్య పాలనలో సరికొత్త కానుక

తిట్లు, బద్నాంలు, కించపర్చడాలు ఎట్సెట్రా తప్పే. కానీ, ఆ నెపంతో ఏం నెరవేర్చుకోవాలని కంకణం కట్టుకున్నారో సర్కారు వారి వాలకమే చెబుతున్నది! 'కారు'ణ్య పాలనలో కొత్త సంవత్సరపు సరికొత్త కానుక తెలంగాణ పౌర సమాజానికి సానబట్టిన 506, 507 సెక్షన్ల రూపంలో పరిచయం అవుతున్నది. తద్వారా 'మిషన్ జైలు' ప్రగతికి ఉపకారిగా రాచరికపు చరిత్రను యాజ్జేస్తున్నది.

ఇల్లెందుల దుర్గాప్రసాద్

బేసిగ్గా మనది ప్రజాస్వామ్యం. తెలంగాణలో దాని స్ఫూర్తి పరిఢవిల్లడంలేదు. పైగా కొత్త కొత్త ఎత్తుగడలతో గడగడలాడించడానికి ఉత్సాహపడుతున్నది. ఈ క్రమంలోనే ఐపీసీ చట్టంలోని 506, 507 సెక్షన్లను పదునెక్కించినట్టు భావిస్తున్నారు. ఈ సెక్షన్ల కింద ఇప్పటిదాకా చర్యలకు కోర్టుల అనుమతి అవసరమయ్యేది.

ఇకపై ఆ అక్కెరలేకుండానే సవరించుకున్నారు. కేసు బుక్ చేసి అరెస్టు చేసే సౌకర్యాన్ని సమకూర్చుకున్నారు. ప్రభువుల వారి ఆజ్ఞ మేరకు చకచకా ఫైలు కదిలింది. దానిపై ముఖ్యమంత్రి సంతకమూ పడిందట. ఇక అమలు చేయడమే తరువాయి. వ్యక్తులు, ప్రముఖులు, సంస్థల గౌరవాలకు భంగం కలుగాలని ఎవరూ కోరుకోరు. కానీ, ఆ మిషతో నోటికి, చేతికి, చెవులకు తాళం వేయించే వ్యూహమే ఆందోళనకరం. అప్‌డేట్ అయిన సెక్షన్ల ద్వయం జైలుకు పంపేందుకు కాచుక్కూర్చున్నది.

తమరు నేర్పినది కాదా?

నిజానికి తెలంగాణ ఉద్యమ కాలంలో, అంతెందుకు సీఎం హెూదాలోనూ మనస్తాపం కలిగించేలా మాట్లాడిన సందర్భాలు లేకపోలేదు. మరీ ముఖ్యంగా రాష్ట్ర సాధన పోరాటంలో లంగలు, లఫంగలు, దొంగలు, దోపిడీదార్లు..ఇంకా అక్కడ అక్షర రూపం ఇవ్వలేనంతటి అసభ్య పదజాలాన్ని నేటి ప్రభుత్వ సారథే లెక్కలేనన్నిసార్లు ప్రయోగించిన జాడలు స్మార్ట్‌ఫోన్లలో పదుల సంఖ్యలో క్లిప్పింగులుగా దర్శనమిస్తాయి. వ్యంగ్యాలు దట్టిస్తూ కించపర్చేలా ప్రసంగాలు ఎన్ని చేయలేదు? తీరా తన దాకా వచ్చేసరికి ఇట్లా చట్టంలో ఇరికించేలా సెక్షన్లను వెతికించారనే విమర్శలు ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల నుంచి వెల్లువెత్తుతున్నాయి.

బాజాప్తా భయపెట్టేందుకే..

ప్రభుత్వం, పాలకుల ధోరణిని ప్రశ్నించే హక్కు పౌరులుగా మన సొంతం. ఇది ఇసుమంతైనా ముఖ్యమంత్రికి నచ్చడంలేదు. ఎంతసేపూ పవన్ కళ్యాణ్ మాదిరిగా పొగడాలి. గవర్నర్ తరహాలో అన్‌లిమిటెడ్‌గా మెచ్చుకోవాలి. అంతే! ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే..ఉమ్మడి రాష్ట్రంలో ఇట్లాంటి అవాంఛనీయత అంతగా లేదని ఇట్టే తోస్తుంది. ఒకవేళ అట్లే గనక ఉంటే..ఇదే 506, 507 సెక్షన్లకు నేడు కొత్త కోరలు తెచ్చే పనే ఉండకపోయేది. నాడే అది చిటికెలో చేసేవారు. అప్పట్లోనే ఇదే పెద్దసారు నోటికి తాళం పడేది! ఎన్నికల కాలం దగ్గరపడుతున్నది కాబట్టి..తెలంగాణ బిడ్డల్ని బాజాప్తా భయపెట్టడానికే పాలకులు డిసైడ్ అయ్యారు. ఏదైనా కడుపులోనే దాచుకోవాలనీ, కక్కితే మాత్రం కటకటాలేనని తేల్చిచెప్పే రీతిన పోతున్నారు.



సెక్షన్లు మార్చే హక్కు సీఎంకు లేదు

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ తిట్ల పురాణంపై ఆకాం క్షలు పెడితే...ఆయన జైల్లో ఉండేవారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దాసో జు శ్రవణ్ అన్నారు. అధికారంలోకి వచ్చాక కేసీఆర్ సోషల్ మీడియాపై ఆంక్షలు పెట్టేందుకు 506, 507 సెక్షన్లను మార్చారని, ఆ హక్కు కేసీ ఆర్‌కు లేదని చెప్పారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సంజీవ్ కడుపు మండి ఆర్టీసీ విధానాలపై పోస్టింగులు పెడితే ఆయనను సస్పెండ్ చేశారన్నారు. సంజీవ్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశా రు. శనివారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధి ఇందిర శోభన్ తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యమ సమయంలో కేసీ ఆర్ దూషించిన వీడియోలను ఈ సందర్భంగా ఆయన ప్రదర్శించారు. సోషల్ మీడియాను కేసీఆర్ నియంత్రించాలని, ఆయనకు వ్యతిరేకంగా పోస్టులు పెడితే నాన్ బెయిల్ కేసులు పెట్టాలని ప్రయత్నం చేస్తున్నార న్నారు. పేదొడి హక్కును కాలరాసేలా ముఖ్యమంత్రి తీసుకుంటున్న చర్య లపై న్యాయస్థానాలను ఆశ్రయిస్తామన్నారు. 506 ,507 సెక్షన్లను మార్చే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు. గతంలో ఢిల్లీ హైకోర్టు తీర్పు ఇచ్చిన విషయాన్ని కేసీఆర్‌గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. సోషల్ మీడియాపై ఆంక్షలు పెడితే నిర్భయ చట్టం వచ్చేదికాదన్నారు.మహిళలను కించపరిచేలా సినిమాలు తీస్తున్న రాంగోపాల్‌వర్మపై కేసులు పెట్టాలని ఆయన కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన టీజేఏసీ నేత భూపతిరెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సిద్ధిపేట జిల్లాకు చెందిన టీజేఏసీ సీనియర్ నేత భూపతిరెడ్డి తన అనుచరులతో కలిసి టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఉత్తమ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. బడుగు, బలహీన వర్గాలపై దాడులు పెరిగిపోయాయన్నారు. కేసీఆర్ పాలనలో నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చే అవకాశం లేకపోవడంతో మురళి ముదిరాజ్ ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో కేసీఆర్ విఫలమయ్యారన్నారు. ముఖ్యమంత్రి కె చంద్రశేఖర రావు రూ 500 కోట్ల ప్రగతి భవన్ నిర్మించి, అందులో ఆయన, ఆయన కుటుంబ సభ్యులు విలాసవంతమైన జీవితం గడుపుతున్నారని చెప్పారు.

పార్టీ నేతలకు నేడు గూడూరు విందు!

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రస్తుతం ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, టీపీసీసీ కార్యవర్గ సభ్యులకు టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి విందు ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి 8 గంటల నుండి 11 గంటలకు వరకు జరగనున్న ఈ విందుకు 225 మంది ముఖ్యమైన నాయకులకు ఆహ్వానాలు పంపించారు. తన నివాసంలో ఏర్పాటు చేసిన ఈ విందు కార్యక్రమానికి మీడియాను దూరంగా ఉంచుతున్నారు. ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో పార్టీలో నెలకొన్న అంతర్గత సమస్యలపై చర్చించి, పార్టీ నాయకులంతా కలిసి ఉన్నారనే సంకేతాలు ఇచ్చేందుకు ఈ విందు ఏర్పాటు చేసినట్టు తెలిసింది.

తెలంగాణ సాగునీటి పథకాలపై

అంతర్జాతీయ ప్రతినిధుల అధ్యయనం

జలసౌధలో పవర్‌పాయింట్ ద్వారా వివరించిన నీటిపారుదల శాఖ అధికారులు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సాగునీటి పథకాలపై విదేశీ ప్రతినిధులు అధ్యయనం చేస్తున్నారు. దీనిలో భాగంగా మిషన్ కాకతీయ కార్యక్రమం, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై నీటిపారుదల శాఖ అధికారుల నుంచి వారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి శనివారం స్థానిక జలసౌధలో అధికారులతో కలిసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ ప్రాజెక్టుల గురించి వారికి వివరించారు. దేశంలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై 19 దేశాల ప్రతినిధులు అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ సహకారంతో చేస్తున్న అధ్యయనంలో భాగంగా ఇరిగేషన్ రంగంలో తెలంగాణ అమలు చేస్తున్న పథకాలపై తెలుసుకున్నారు. నాలుగు వారాలపాటూ వారి అధ్యయనం కొనసాగుతుందని అధికారులు తెలిపారు. సాగునీటిపారుదల పథకాలపై ప్రభుత్వం ఇచ్చిన ప్రజంటేషన్ పట్ల విదేశీ ప్రతినిధులు ఆసక్తి కనపరిచారని వారు చెప్పారు. మూడున్నర సంవత్సరాల క్రితం ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం ఇరిగేషన్ రంగంలో విశేషమైన ప్రగతి సాధించిందని జోషి వివరించారు. తెలంగాణ



ఏర్పడకముందు దాదాపు 80,000 చిన్న నీటి వనరులు ఉండగా పట్టణీకరణ తదితర కారణాల వల్ల అందులో సగం కనుమరుగయ్యాయని జోషి చెప్పారు. గొలుసుకట్టు చెరువులతో పాటు మొత్తం చిన్న నీటి వనరులను పరిరక్షించేందుకు, వాటిని పునరుద్ధరణకు, పునర్నిర్మించడానికిగాను చేపట్టిన 'మిషన్ కాకతీయ" కార్యక్రమానికి ముఖ్యమంత్రి రూపకల్పన చేశారని అన్నారు. 46,000 చెరువులను దశలవారీగా పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. మిషన్ కాకతీయ కార్యక్రమం అమలుతో అద్భుతమైన ఫలితాలు అందుతున్నాయని, తెలంగాణ గ్రామీణ ఆర్థిక, సామాజిక స్థితిగతులలో అనూహ్యమైన మార్పులు వస్తున్నాయని జోషి తెలిపారు. తెలంగాణలో జలవనరులు, నీటి లభ్యత పెంచడమే మిషన్ కాకతీయ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. దేశంలోనే అత్యధిక చెరువులున్న రాష్ట్రంగా తెలంగాణకు చరిత్ర ఉందని చెప్పారు. ఏడాదికి 25 శాతం చెరువులను, నాలుగేండ్లలో మొత్తం చెరువులకు పూర్వవైభవం తెచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. మిచిగాన్ యూనివర్సిటీ విద్యార్థులు కొందరు తెలంగాణలో పర్యటించి రీసెర్చ్ కూడా చేశారని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని అతి పెద్ద ఎత్తిపోతల పథకమైన కాళేశ్వరం ప్రాజెక్టు గురించి కూడా విదేశీ ప్రతినిధులకు జోషి వివరించారు. రూ. 80,000 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తమ ప్రభుత్వం చేపట్టిందన్నారు. మేడిగడ్డ, సుందిళ్ళ, అన్నారం దగ్గర మూడు చోట్ల నిర్మిస్తున్న భారీ బ్యారేజీలు, మూడు పంపుహౌజ్ లు, పొడవైన సొరంగాలు, భూగర్భంలో అబ్బురపరిచే సర్జ్ పూల్స్ గురించి ఆయన వివరించారు.90 రోజుల పాటు రోజుకు 2 టీఎంసీల ఎత్తిపోయడానికి ఈ భారీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని నిర్మిస్తున్నట్టు చెప్పారు. 18.26 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టును సాగులోకి తీసుకు రావడం,మరో 18. 82 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యమని అన్నారు. విదేశీ ప్రతినిధుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు.

నవచిత్రం

డిఫరెంట్ కాంబినేషన్‌లో 152



చిరంజీవి

ఇప్పుడు స్టార్ హీరోలంతా స్పీడు పెంచారు. ఓ సినిమా సెట్‌లో ఉండగానే మరో సినిమాను లైన్‌లో పెడుతున్నారు. చిరంజీవి కూడా అదే ట్రెండ్‌ను ఫాలో అవుతున్నట్టు కనిపిస్తుంది. ఆయన 'సైరా నరసింహారెడ్డి' సినిమా చేస్తున్నారు. ఆ తర్వాత నటించబోయే సినిమాకు కూడా చర్చలు జరుపుతున్నట్టు తెలుస్తుంది. ఇటీవల సుకుమార్ చిరంజీవికి ఓ లైన్ చెప్పగా ఆయన ఆసక్తి చూపినట్టు తెలుస్తుంది. స్క్రిప్ట్ ఆసక్తికరంగా ఉండటంతో పూర్తి స్థాయిలో స్రిప్ట్‌ను రెడీ చేయమని సుకుమార్‌కు చిరు తెలిపినట్టు సమాచారం. సుకుమార్ ప్రస్తుతం రామ్‌చరణ్‌తో 'రంగస్థలం' చిత్రీకరణలో ఉన్నారు. ప్రస్తుతం సినిమాలోని చివరి పాటను చిత్రీకరిస్తున్నారట. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి ఈ చిత్రాన్ని మార్చి 30న విడుదల చేయనున్నారు. అనంతరం చిరంజీవికి సంబంధించిన సినిమా స్క్రిప్ట్‌పై వర్క్ చేయడానికి ప్లాన్ చేసుకుంటున్నారని టాక్. చిరంజీవి నటిస్తున్న 151వ చిత్రం 'సైరా నరసింహారెడ్డి'కి సురేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న విషయం విదితమే. ఇందులో నయనతార కథానాయిక. అమితాబ్ బచ్చన్, విజయ్ సేతుపతి, సుదీప్, జగపతిబాబు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల ఓ షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలో నెక్స్ట్ షెడ్యూల్ జరుపుకోనుంది. గ్రాఫిక్ కోసం చిరు మీసం, గడ్డం తీసేశారు. పూర్తి గడ్డం వచ్చాక నెక్స్ట్ షెడ్యూల్ ఉంటుంది.

హ్యాట్రిక్ బ్లాక్‌బస్టర్ కోసం..!



విజయ్, కీర్తిసురేష్

విజయ్, ఎ.ఆర్.మురుగదాస్ కాంబినేషన్‌కి కోలీవుడ్‌లోనే కాదు సర్వత్రా ఓ మంచి క్రేజ్ ఉంది. వీరిద్దరి కాంబినేషన్‌లో రూపొందిన 'తుపాకి', 'కత్తి' చిత్రాలు ప్రేక్షకుల విశేషాదరణతో బ్లాక్‌బస్టర్స్‌గా నిలిచాయి. తాజాగా వీరిద్దరి కాంబినేషన్‌లో తెరకెక్కబోయే నూతన చిత్రం ఇటీవల చెన్నైలో ప్రారంభమైంది. ఇది కథానాయకుడు విజయ్‌కి 62వ చిత్రం కావడం విశేషం. ముహూర్తపు సన్నివేశానికి విజయ్ క్లాప్ ఇచ్చారు. ఎ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో విజయ్ సరసన కీర్తి సురేష్ నటిస్తోంది. గతంలో విజయ్, కీర్తి సురేష్ జోడీ 'భైరవ' చిత్రంలో నటించారు. ఆన్ స్క్రీన్ మీద వీరిద్దరి కెమిస్ట్రీ అందర్నీ మెప్పించింది. ఈ సినిమా కూడా బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. మరోసారి ఈ జోడీ ప్రేక్షకులను మెస్మరైజ్ చేసేందుకు రెడీ అవుతోంది. సన్‌పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని దీపావళి కానుకగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సినిమా ప్రారంభం రోజే విడుదల తేదీని ప్రకటించడంతో విజయ్ అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. అంతేకాదు విజయ్, మురుగదాస్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంతో హ్యాట్రిక్ బ్లాక్‌బస్టర్ ఖాయమంటూ అభిమానులు సోషల్ మీడియాలో హంగామా చేస్తున్నారు. దీనికి అనుగుణంగా దర్శకుడు మురుగదాస్ సైతం 'దీపావళి శుభాకాంక్షలు..' అంటూ ట్వీట్ చేయటం విశేషం. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏ.ఆర్.రెహ్మాన్ స్వరాలను సమకూరుస్తున్నారు. దీంతో ప్రారంభం నుంచి భారీ క్రేజ్‌ను సంపాదించుకుంటోంది చిత్రం.



శివ ఆకుల, సి.కళ్యాణ్, వినాయక్, బాలకృష్ణ, సాయి ధరమ్ తేజ్

ఇండస్ట్రీ గర్వించదగ్గ దర్శకుడు వినాయక్

- 'ఇంటిలిజెంట్' టీజర్ రిలీజ్ సందర్భంగా బాలకృష్ణ

'ఇండస్ట్రీ గర్వించదగ్గ దర్శకుడు వి.వి.వినాయక్. ఆయన రూపొందించిన 'ఇంటిలిజెంట్' సినిమా ఎప్పుడెప్పుడు చూద్దామా అన్నంత బాగుంది' అని బాలకృష్ణ అన్నారు. సాయిధరమ్ తేజ్, లావణ్య త్రిపాఠి జంటగా వి.వి.వినాయక్ దర్శకత్వంలో సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై. లిమిటెడ్ పతాకంపై సి.కళ్యాణ్ నిర్మిస్తున్న చిత్రం 'ఇంటిలిజెంట్'. ఈ చిత్రం టీజర్‌ను బాలకృష్ణ శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ నాకు సొంత సంస్థ లాంటిది. ఇందులో సి.కళ్యాణ్‌గారు వి.వి.వినాయక్ దర్శకత్వలో నిర్మిస్తున్న నాలుగో సినిమా ఇది. వినాయక్ కాంబినేషన్‌లో ఇంతకుముందు 'చెన్నకేశవరెడ్డి' సినిమా చేశాం. మన కాంబినేషన్‌లో సినిమా ఎప్పుడు అని అడుగుతుంటాను. సినిమా విషయంలో ఆయన ఇన్‌వాల్వ్‌మెంట్, కలుపుగోలుతనం, ఆర్టిస్టు నుంచి సరైన పెర్‌ఫార్మెన్స్ రాబట్టుకోవడం ఆయనకు బాగా తెలుసు. కళ్యాణ్ పెద్ద హీరోలతో, చిన్న హీరోలతో ఇంకా సినిమా చేయాలి. వినాయక్, శివ కాంబినేషన్‌లో ఎన్నో అద్భుతమైన సినిమాలు వచ్చాయి. ఈ సినిమా టీజర్ మిస్టీరియస్‌గా బాగుంది. టీజర్ చూసిన తర్వాత సినిమా ఎప్పుడు చూడాలా అనిపిస్తుంది. టైటిల్ కూడా ఆకట్టుకునేలా ఉంది. మెగా అభిమానులకు, నా అభిమానులకు, ముఖ్యంగా యూత్‌కి ఈ సినిమా కనెక్ట్ అవుతుంది. సినిమా ఘనవిజయం సాధిస్తుంది' అని అన్నారు. 'జై సింహా'తో ఈ సంక్రాంతికి హిట్‌నిచ్చిన బాలకృష్ణ ఈ టీజర్‌ను విడుదల చేయడం ఆనందంగా ఉంది. వినాయక్ నాతో సినిమా చేయాలనేది వాళ్ళ నాన్న కృష్ణ కోరిక. తేజు ఈ సినిమా ఎంతో కష్టపడి చేశారు. మా తండ్రిగారు దాసరి నారాయణరావుగారి దీవెనలు, అన్నయ్య కృష్ణ దీవెనలు మాకు ఉంటాయి. వీటన్నింటిని మించి మా బాలయ్యబాబు మాకు ఆశీస్సులు అందించేందుకు రావడంతో పెద్ద సెన్సేషన్ హిట్ కొట్టినట్టు భావిస్తున్నాను. టీజర్ రిలీజ్ చెయ్యవలిసిందిగా బాబుని అడగడానికి వెళ్ళినప్పుడు ఒక టైమ్ చెప్పి అప్పుడు టీజర్ రిలీజ్ చెయ్యండి, సినిమా సూపర్‌హిట్ అన్నారు. 2018 ప్రారంభంలో 'జై సింహా' హిట్‌తో బాలకృష్ణ నాకు మంచి ఎనర్జీ ఇచ్చారు. ఫిబ్రవరిలో కూడా ఈ చిత్రంతో మరో హిట్ కొట్టబోతున్నాం' అని సి.కళ్యాణ్ తెలిపారు. వి.వి.వినాయక్ మాట్లాడుతూ, 'మేం అడగ్గానే బాలకృష్ణగారు రావడంతో ఈ సినిమా సూపర్‌హిట్ అయిపోయిందన్న ఫీలింగ్ వచ్చేసింది. మేమంతా ఆనందంతో ఉద్వేగంగా ఉన్నాం. యూనిట్‌లోని ప్రతి ఒక్కరి తరఫున బాలకృష్ణగారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను" అన్నారు. 'ముందుగా బాలకృష్ణగారికి థాంక్స్. కొత్త టాలెంట్‌ని ఎంకరేజ్ చేయడంలో బాలకృష్ణగారు ముందుంటారని అందరూ అంటారు. మా సినిమాకి ఆశీస్సులు అందించడానికి రావడంతో మరోసారి అది ప్రూవ్ అయ్యింది' అని సాయిధరమ్ తేజ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో శివ ఆకుల, సి.వి.రావు తదితరులు పాల్గొన్నారు.



కాజల్

వ్యోమగామి అవ్వాలనుకున్నా!

'నేను చిన్నప్పుడు వ్యోమగామి అవ్వాలనుకున్నా. కానీ అది అంత ఈజీ కాదని పెద్దయ్యాక తెలిసింది' అని అంటోంది కాజల్ అగర్వాల్. గతేడాది వరుసగా నాలుగు సినిమాలతో విజయాలను అందుకుంది కాజల్. అదే ఉత్సాహంతో ఈ ఏడాది కూడా సినిమాలు చేస్తుంది. ఈ నేపథ్యంలో ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంది. 'చిన్నప్పట్నుంచి నేను అల్లరి పిల్లను. స్నేహితులతో కలిసి స్కూల్ బంక్ కొట్టిన రోజులు కూడా ఉన్నాయి. కానీ మా పేరెంట్స్ నన్ను ఏమీ అనేవారు కాదు. అదే సమయంలో నన్ను చాలా పద్ధతిగా పెంచారు. నా మనస్తత్వం సాహసోపేతంగా ఉంటుంది. చదువుకునే రోజుల్లో కల్పనా చావ్లా అంతరిక్షంలోకి వెళ్ళారని తెలుసుకున్నా. నేను కూడా వ్యోమగామి కావాలనుకున్నాను. కానీ మనం కాలేమని తర్వాత తెలిసింది. దీంతో ఉన్నత విద్య చేసి వ్యాపారానికి సంబంధించిన ఉద్యోగాలు చేయాలనుకున్నా. అనుకోకుండా నటిని అయ్యాను. సినిమాల్లోకి వస్తానని అస్సలనుకోలేదు. అదొక ఊహించని మలుపు. అయినప్పటికీ మా ఫ్యామిలీ నాకు అన్ని రకాలుగా సపోర్ట్‌నిచ్చారు. చేసే ప్రతి పనికి అండగా నిలిచారు. ఆ విషయంలో నేను అదృష్టవంతురాలిని' అని తెలిపింది. ప్రస్తుతం కాజల్ 'ఎమ్మెల్యే', 'క్వీన్' తమిళ రీమేక్ 'పారిస్ పారిస్', 'అ' చిత్రాల్లో నటిస్తుంది.

మరో 'ఆపరేషన్ దుర్యోధన' అవ్వాలి

-'ఆపరేషన్ 2019' టీజర్ విడుదల కార్యక్రమంలో కృష్ణంరాజు



శ్యామలాదేవి, కృష్ణంరాజు, శ్రీకాంత్, కరణం బాబ్జి

శ్రీకాంత్, యజ్ఞశెట్టి హీరోహీరోయిన్లుగా కరణం బాబ్జి దర్శకత్వంలో అలివేలమ్మ ప్రొడక్షన్స్ పతాకంపై అలివేలు నిర్మిస్తున్న చిత్రం 'ఆపరేషన్ 2019'. 'బివేర్ ఆఫ్ పబ్లిక్' అనేది ట్యాగ్‌లైన్. ఈ చిత్ర టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం రిపబ్లిక్ డే సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. అతిథిగా విచ్చేసిన కృష్ణంరాజు టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'శ్రీకాంత్ నాకు తమ్ముడిగా 'సింహగర్జన'లో నటించాడు. 'నాన్నకు పెళ్ళి'లో కొడుకుగా నటించాడు. తను మంచి నటుడే కాదు, మంచి మనసున్న వ్యక్తి కూడా. గతంలో శ్రీకాంత్ చేసిన 'ఆపరేషన్ దుర్యోధన'కు మంచి పేరొచ్చింది. ఇప్పుడు చేస్తున్న 'ఆపరేషన్ 2019' టీజర్ కూడా చాలా బాగుంది. ఇప్పుడు జనానికి డబ్బుపై ఆశ పెరిగింది. పబ్లిక్‌తో జాగ్రత్తగా ఉండాలి. వారిని మార్చే విధంగా సినిమాలు రావాలి. ఈ సినిమా టీజర్ చూస్తుంటే దర్శకుడు మంచి కాన్సెప్ట్‌తో తీసినట్టు అనిపిస్తుంది. జనాన్ని ఎడ్యుకేట్ చేసే విధంగా ఉండబోతుందని అర్థమవుతుంది. 'ఆపరేషన్ దుర్యోధన' చిత్రంలా శ్రీకాంత్‌కు ఈ సినిమా మంచి పేరును తేవాలి' అని అన్నారు. 'ఈ చిత్ర టీజర్ కృష్ణంరాజు చేతుల మీదుగా విడుదల కావడం ఆనందంగా ఉంది. గతంలో కరణం బాబ్జి దర్శకత్వంలో 'మెంటల్ పోలీస్' చేశాను. టైటిల్ కాంట్రవర్సీ, రిలీజ్ సమస్య వల్ల ఆ సినిమాకు అనుకున్నంత పేరు రాలేదు. ఈ సారి కాంట్రవర్సీ లేకుండా మంచి కంటెంట్‌తో సినిమా చేద్దామనుకున్నాం. ఇందులో కాంట్రవర్సీ ఉన్నా కంటెంట్ బాగుంది. నిర్మాతలు రాజీపడకుండా నిర్మించారు. షకీల్ ఆరు అద్భుతమైన బాణీలను అందించారు. కచ్చితంగా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుందని భావిస్తున్నా' అని హీరో శ్రీకాంత్ తెలిపారు. దర్శకుడు కరణం బాబ్జీ చెబుతూ, "మెంటల్ పోలీస్' తర్వాత శ్రీకాంత్‌తో మరో సినిమా చేయాలని ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. నిర్మాతలు నన్ను నమ్మి ఈ సినిమా చేశారు. శ్రీకాంత్ అన్ని విధాలుగా సపోర్ట్ చేశారు. శ్రీకాంత్‌తోపాటు ఇందులో ఇద్దరు యంగ్‌స్టర్స్ నటించారు. వారెవరనేది త్వరలో వెల్లడిస్తాం. ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 6 వరకు చేయబోయే షెడ్యూల్‌తో షూటింగ్ పూర్తవుతుంది' అని చెప్పారు. 'మంచి కథనంతో తెరకెక్కించిన చిత్రమిది. శ్రీకాంత్ సహకారంతో అనుకున్న విధంగా సినిమా తీయగలిగాం' అని నిర్మాత అలివేలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివకృష్ణ, నాగినీడు, దీక్షాపంత్, హరితేజ, శ్యామలాదేవి తదితరులు పాల్గొని చిత్ర బృందాన్ని అభినందించారు.

నిర్మాతగా మ్యూజిక్ ఆల్బమ్

నటుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా, కొరియోగ్రాఫర్‌గా దక్షిణాది చిత్ర పరిశ్రమలో రాణిస్తున్నారు ప్రభుదేవా. తాజాగా ఆయన 'ఫేస్ ఆఫ్ ఇండియా' పేరుతో ఓ సంగీత ఆల్బమ్‌ను రూపొందించారు. వేల్స్ యూనివర్సిటీ అధినేత కె.గణేష్‌తో కలిసి ఈ ఆల్బమ్‌ను నిర్మించగా ఏజె దర్శకత్వం వహించారు. అమర్ గీత్ సంగీతమందించారు. 'గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రూపొందించిన ఈ మ్యూజికల్ ఆల్బమ్



ప్రభుదేవ

గ్రామీణ పాటలతో మన దేశంలోని భిన్న సంస్కృతులను, భాషల ప్రాముఖ్యతలను ఆవిష్కరించేలా ఉంటుంద'ని యూనిట్ వర్గాలు తెలిపారు. తరుణ్, వికాష్, వినోజ్, అంజలి జయప్రకాష్ నటించారు.



తాప్సీ

ప్రయారిటి ఇస్తేనే..

'నా కోసం ఎదురుచూసి, నన్ను గౌరవించి, హీరోతో సమానంగా చూసే చిత్ర బృందంతోనే పనిచేయాలనుకుంటున్నాను' అని అంటోంది తాప్సీ. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, 'ఇటీవల ఓ సినిమా విషయంలో జరిగిన సంఘటన నన్ను బాధించింది. ఆ సినిమాలో నా పరిచయ సన్నివేశాన్ని మార్చారు. ఆ విషయాన్ని దర్శకుడిని అడగ్గా హీరో మార్చమన్నాడని చెప్పారు. నాకెందుకు చెప్పలేదని ప్రశ్నిస్తే 'మీకు చెప్పాల్సిన అవసరం లేదని అనుకున్నా' అన్నారు. ఇది నన్ను చాలా బాధించింది. నాకు ప్రయారిటీ ఇచ్చే యూనిట్‌తోనే పనిచేయాలని నిర్ణయించుకున్నా. గతేడాది తెలుగులో వచ్చిన 'ఆనందో బ్రహ్మ' చిత్ర బృందం నాకోసం ఏడాది ఎదురుచూసింది. అందుకే ఆ సినిమా చేశా. ఆ సినిమా లాభంలో రూ.కోటీ పారితోషికంగా తీసుకున్నా. అయితే హీరోయిన్ల సినిమాలు పరాజయం చెందితే ఐరన్‌లెగ్ అనే ముద్ర వేస్తారు. పారితోషికం తగ్గించమంటారు. అదే హీరోల విషయంలో అలా ఎందుకు చేయరు?' అని ప్రశ్నించారు. ప్రస్తుతం తాప్సీ 'ముల్క్', 'దిల్ జంగ్లీ' చిత్రాల్లో నటిస్తుంది.



రవీందర్, అశోక్

దక్షిణాదిలో ఇదే తొలిసారి

అనుష్క ప్రధాన పాత్రధారిణిగా అశోక్ దర్శకత్వంలో యువి క్రియేషన్స్ పతాకంపై వంశీ,ప్రమోద్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'భాగమతి'. ఈ శుక్రవారం విడుదలైన ఈ సినిమాకు విశేష స్పందన వస్తోన్న నేపథ్యంలో శనివారం చిత్ర బృందం మీడియాతో ముచ్చటించింది. దర్శకుడు అశోక్ మాట్లాడుతూ, 'మహిళా ప్రధానమైన చిత్రంగా విడుదలైన 'భాగమతి'కి భారీ స్థాయిలో ఓపెనింగ్స్ వచ్చాయి. మంచి కంటెంట్ ఉంటే హీరో, హీరోయిన్ అనే తేడా లేకుండా మేం ఆదరిస్తామని ప్రేక్షకులు నిరూపించారు. అందుకు వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నా. విడుదలైన మధ్యాహ్నం ఆట నుంచే థియేటర్‌లు పెంచుకునే స్థాయికి చేరడం, ఉదయం తొలి ఆట నుంచి హిట్ టాక్‌తో ప్రదర్శించబడటం చాలా ఆనందంగా ఉంది. అలాగే విడుదలైన అన్ని సెంటర్ల నుంచి భారీస్థాయిలో కలెక్షన్లు వస్తున్నాయని చెబుతుంటే చాలా హ్యాపీగా అనిపిస్తుంది. అనుష్క, యువి క్రియేషన్స్‌పై ప్రేక్షకులు నమ్మకంతో ఉన్నారు. వారికి థ్యాంక్స్. ఈ క్రేజ్‌కు ముఖ్య కారణం ఆర్ట్ డైరెక్టర్ రవీందర్ వేసిన 'భాగమతి బంగ్లా'. ఆ బంగ్లా గురించి చాలా మంది ఫోన్‌లు చేసి అడుగుతున్నారు. మనిషి తెలివితేటలకు మించిన దెయ్యం ఉందా? అనే ఆలోచనతో చేసిన సినిమా ఇది. ఇంటర్వెల్, ద్వితీయార్థంలో వచ్చే ట్విస్టులు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. అది నచ్చడం వల్లే అనుష్క, వంశీ, ప్రమోద్‌లు ఈ సినిమా చేయడానికి ముందుకు వచ్చారు. మహిళా ప్రధాన చిత్రానికి ఇంత భారీ స్థాయిలో ఓపెనింగ్స్ రావడం దక్షిణాదిలో ఇదే తొలిసారి. ఈ విజయం టీమ్ అందరిది' అని అన్నారు. ఆర్ట్ డైరెక్టర్ రవీందర్ చెబుతూ, 'ఎక్కడ చూసినా ఇప్పుడు 'భాగమతి' గురించే చర్చించుకుంటున్నారు. కలెక్షన్లు బాగున్నాయి. ఆర్ట్ డిపార్ట్‌మెంట్‌కు అభినందనలు తెలపడం మరిచిపోలేని అనుభూతినిస్తుంది' అని చెప్పారు.

ప్రేమ కథలంటే ఇష్టం



సాగర్ మహతి

'నాపై నాన్న(మణిశర్మ) ప్రభావం ఉండదు. సంగీత పరంగా నాకంటూ ఓ ప్రత్యేకత ఉండాలని కోరుకుంటా' అని అంటున్నా సాగర్ మహతి. నాగశౌర్య, రష్మిక మండన్నా జంటగా వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన 'ఛలో' చిత్రానికి సాగర్ మహతి సంగీతం సమకూర్చారు. ఇటీవల విడుదలైన పాటలకు మంచి స్పందన లభిస్తోంది. ఫిబ్రవరి 2న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా సాగర్ మహతి శనివారం మీడియాతో మాట్లాడుతూ, 'సంగీత దర్శకుడిగా నాకిది మూడవ చిత్రం. నాగశౌర్యతో రెండవ చిత్రం. ఈ సినిమాలోని పాటలు సందర్భానుసారంగా బాగా కుదిరాయి. ముఖ్యంగా కాలేజ్ నేపథ్యంలో సాగే కథ రావడంతో బాణీలు అద్భుతంగా వచ్చాయి. ఇటీవల విడుదలైన పాటలకు మంచి స్పందన లభిస్తుంది. 'చూసి చూడంగానే.. ' అంటూ సాగే పాట అందరినీ ఆకట్టుకుంటుంది. అయితే ముందు దీన్ని బిట్ సాంగ్‌గా చేయాలనుకున్నాం. పూర్తి పాటగా ఎందుకు చేయకూడదని దర్శకుడు వెంకీ చెప్పడంతో పూర్తి స్థాయి పాటగా కంపోజ్ చేశాం. ఈ ఆల్బమ్‌లో నాకు బాగా నచ్చిన పాట కూడా ఇదే. దర్శకుడు వెంకీ పాటకు తగ్గ సన్నివేశాన్ని సృష్టించుకున్నాడు. ఐరా క్రియేషన్స్‌పై ఉషాగారు రాజీ పడకుండా సినిమాను నిర్మించారు. సాంగ్స్ విడుదలయ్యాక చాలా మంది నాన్నకు ఫోన్ చేసి అభినందించడం ఆనందంగా ఉంది. నాపై నాన్న ప్రభావం పడకుండా, కొత్తగా చేసేందుకు ప్రయత్నిస్తున్నాను. నా పనిలో ఆయన జోక్యం చేసుకోరు. నాకంటూ ఓ స్టయిల్‌ను ఏర్పర్చుకోవాలన్నదే నా కోరిక. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అనేది ప్రత్యేకమైన కళ. దానిలో ఒక్కొక్కరిది ఒక్కో స్టయిల్ ఉంటుంది. ఈ విషయంలో నాకు మానాన్నే గురువు. అయితే సంగీత దర్శకుడిగా ఎంట్రీ ఇవ్వడానికి ఆలస్యమైందని అంటున్నారు. కానీ ఏది ఎప్పుడు జరగాలో అప్పుడే జరుగుతుంది. నాన్నగారితో పాటు ఎం.ఎం.కీరవాణి, కళ్యాణ్ మాలిక్ వంటి సంగీత దర్శకుల వద్ద దాదాపు 180 చిత్రాలకు పనిచేశాను. ఒక్కొక్కరి నుంచి ఒక్కో స్పెషాలిటీని నేర్చుకున్నా. యువన్ శంకర్‌రాజాకు నేను వీరాభిమానిని. బేసిక్‌గా నేను లవ్ స్టోరీ చిత్రాలను ఇష్టపడతా. ప్రస్తుతం కన్నడంలో రీమేక్ అవుతున్న 'కుమారి 21ఎఫ్' చిత్రానికి సంగీతమందిస్తున్నా' అని అన్నారు.

నెల్లూరి పెద్దారెడ్డి పాటలొచ్చాయ్



సతీష్‌రెడ్డి, సాయి వెంకట్, రేలంటి నరసింహారావు, సాగర్, టి.రామసత్యనారాయణ

సతీష్‌రెడ్డి, మౌర్యాని, ముంతాజ్ హీరో హీరోయిన్లుగా వీజే రెడ్డి దర్శకత్వంలో సిద్ధి విఘ్నేశ్వరా క్రియేషన్స్ పతాకంపై సీహెచ్ రఘునాథరెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'నెల్లూరి పెద్దారెడ్డి'. గురురాజ్ సంగీతం అందించిన ఈ చిత్ర ఆడియో విడుదల కార్యక్రమం శనివారం హైదరాబాద్‌లో జరిగింది. అతిథులుగా విచ్చేసిన దర్శకులు సాగర్, రేలంగి నరసింహారావు పాటల సీడీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ, 'మంచి అవగాహనతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. మంచి చిత్రాన్ని రాజీపడకుండా క్వాలిటీగా తీయాలని కోరుకుంటున్నా' అని అన్నారు. దర్శకుడు వీజే రెడ్డి చెబుతూ, 'పల్లె వాతావరణంలో ఆహ్లాదకరమైన కథా, కథనాలతో సాగే చిత్రమిది. నెల్లూరి నుంచి ఖమ్మం జిల్లా సీతారాంపురానికి పెద్దారెడ్డి అనే వ్యక్తి వలస వస్తాడు. దీంతో అతన్ని నెల్లూరి పెద్దారెడ్డి అని పిలుస్తారు, గౌరవిస్తారు. ఆయన ఓ యువతి కుటుంబానికి ఆశ్రయమిస్తాడు. దీంతో అనుకోని పరిస్థితులు ఎదురవుతాయి. వాటి పర్యావసానంగా కథ ఎలాంటి మలుపు తిరిగిందనేది చిత్ర కథాంశం. ఇందులో కొన్ని విషాధ సన్నివేశాలున్నాయి. అలాగే జబర్దస్త్ టీమ్ చేసే కామెడీ కడుపుబ్బా నవ్విస్తుంది. కమలాకర కామేశ్వరరావు సాహిత్యానికి గురురాజ్ సంగీతం తోడవ్వడంతో పాటలు చాలా బాగా వచ్చాయి. నిర్మాణాంతర కార్యక్రమాలు చివరి దశకు చేరుకున్నాయి. ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేస్తాం' అని చెప్పారు. 'బ్రహ్మానందం చేసిన నెల్లూరి పెద్దారెడ్డి పాత్ర నవ్విస్తే ఇందులోని పెద్దారెడ్డి మంచి అనుభూతినిస్తాడు' అని హీరో సతీష్‌రెడ్డి తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురు కాల్పులు

- ఇద్దరు మావోయిస్టులు మృతి

నవతెలంగాణ-చర్ల

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో శనివారం జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు చనిపోయారు. సుకుమా జిల్లా ఎస్పీ అభిషేక్ మీనా వివరాల ప్రకారం.. చింతలనాడ్ పోలీస్‌స్టేషన్ పరిధి మొరంపల్లి దండకారణ్యంలో శనివారం తెల్లవారు జామున పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో స్మాల్ పారాకు చెందిన జన్‌మిలీషియా కమాండర్ గుంచె బంద్రి, మహిళా మావోయిస్టు మృతిచెందారు. నాలుగు రోజుల కింద నారాయణపూర్ జిల్లాలోని ఇర్పనార్ దండకారణ్యంలో మావోయిస్టులకు పోలీసులకు జరిగిన ఎదురు కాల్పులలో నలుగురు పోలీసులు మృతి చెందగా తొమ్మిది మంది తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలైన ఘటన పాఠకులకు విధితమే. దీనికి ప్రతీకార చర్యగా నారాయణపూర్, సుకుమా జిల్లాలలో భారీగా సీఆర్‌పీఎఫ్, జీఆర్‌జీ భారీగా పోలీసు బలగాలు మోహరించి కూంబింగ్ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే ఈ ఎన్‌కౌంటర్ జరిగింది.

'త్వరితగతిన పూర్తి చేయాలి'

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎమ్మెల్యేలకు నూతన క్వార్టర్లు రూపుదిద్దుకుంటున్నాయి. ఇప్పటికే హైదరాబాద్‌లోని హైదర్‌గూడలో శరవేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. రూ.132.73 కోట్లతో వీటిని నిర్మిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికే రూ.118.15 కోట్లు ఖర్చు చేసింది. మొత్తం 120 క్వార్టర్లలో 120 సర్వెంట్ క్వార్టర్స్ ఉంటే.. మరో 36 స్టాఫ్ క్వార్టర్లు ఉన్నాయి. వాటిలో 70 క్వార్టర్ల నిర్మాణాలు ఇప్పటికే పూర్తికాగా, మిగిలిన 50 క్వార్టర్లను వచ్చేనెలలో పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేస్తామని స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ శనివారం తెలిపారు. మండలి చైర్మెన్ స్వామిగౌడ్, స్పీకర్ మధుసూదనచారితో కలిసి మంత్రి నిర్మాణాలను పరిశీలించారు. వారి వెంట డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు, అసెంబ్లీ సెక్రెటరీ నర్సింహాతోపాటు ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

[illegible] ఉమ్మడి రిజర్వేషన్లు ఫెయిల్

ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ

- అన్నికులాల రిజర్వేషన్లు రాజ్యాంగంలో పొందుపర్చలేదు
- బ్రాహ్మణ భావజాలాన్ని తిప్పికొట్టాలి



నవతెలంగాణ - సిటీబ్యూరో

భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రవేశపెట్టిన ఉమ్మడి రిజర్వేషన్ల విధానం ఫెయిలైందని, అత్యంత కింది కులాలకు రిజర్వేషన్ ఫలాలు దక్కే వర్గీకరణ ద్వారానే నిజమైన సామాజిక న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ అన్నారు. సమాజంలో అంటరానితనం, అణచివేతకు గురైన వారి కోసం రాజ్యాంగంలో పొందుపర్చిన రిజర్వేషన్లు పాక్షిక ఫలితాలు మాత్రమే ఇచ్చాయని, సంపూర్ణమైన ఫలితాలు ఇవ్వలేదని చెప్పారు. హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనలో స్టూడెంట్ మార్చ్ ప్రచురణల ఆధ్వర్యంలో డాక్టర్ సి.కాశీం రచించిన 'ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ-సామాజిక న్యాయం', 'రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు-అగ్రకులతత్వం' పుస్తకాలను వీక్షణం సంపాదకులు వేణుగోపాల్ ఆవిష్కరించారు. స్టూడెంట్ మార్చ్ సంపాదకులు జగన్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో మందకృష్ణ మాట్లాడారు. దేశంలో ఏ రెండు కులాల మధ్య ఆర్థిక సమానత్వం లేని కారణంగా జనాభా దామాషా ప్రకారం అన్ని కులాలకు రిజర్వేషన్లు అందాలని అంబేద్కర్ భావించినా రాజ్యాంగంలో పొందుపర్చలేదన్నారు. ఫలితంగా ఎస్సీ రిజర్వేషన్లలో అప్పటికే అభివృద్ధి చెందిన ఒకవర్గం వాటిని పొందడంలో ముందు వరుసలో ఉండగా, చదువుకు దూరంగా ఉన్న మరో వర్గం రిజర్వేషన్లు అందుకోలేకపోయిందని అన్నారు. రిజర్వేషన్ల ఫలాలను ఎస్సీల్లోని ఒక వర్గమే అధికంగా పొందిందనడానికి దేశంలోని పలు రాష్ట్రాల్లో వేసిన కమిషన్‌లే నిదర్శనం అన్నారు. అంబేద్కర్ పుట్టిన మహారాష్ట్రలో వేసిన లాహూజీ సాల్వే కమిషన్ కూడా వ్యత్యాసాలు ఉన్నాయని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. మహారాష్ట్రలో అంబేద్కర్ కులమైన మహర్లు తప్ప మహర్లేతరులు ఒక్క ఐఏఎస్ కూడా లేరన్నారు. అంబేద్కర్‌కు జ్యోతిబాఫూలే గురువు అయితే, జ్యోతిబాఫూలే గురువు లాహూజీ సాల్వే అని అన్నారు. ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి హయాం(1965)లోనే రిజర్వేషన్ల వర్గీకరణపై లోకూర్ కమిషన్ ఏర్పాటైందని వివరించారు. రిజర్వేషన్ వర్గాల్లో కూడా దోపిడీ కులాలున్నాయన్నారు.

వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ.. రిజర్వేషన్లను నీరుగార్చే కుట్రలు బయలుదేరాయని, అందులో భాగంగానే ఒకప్పుడు రిజర్వేషన్లను వ్యతిరేకించినవారే ఇప్పుడు మాకూ కావాలంటున్నారని అన్నారు. రిజర్వేషన్ల వ్యతిరేక, బ్రాహ్మణ భావజాలాన్ని తిప్పికొట్టేందుకు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

పుస్తకాల రచయిత సి.కాశీం మాట్లాడుతూ.. అక్షరాలు అందకపోతే జీవితం ఎట్లయిపోతదో.. అందుకు మాదిగ జీవితమే ఉదాహరణ అన్నారు. ఈ కార్యక్రమంలో రహమాన్ (ఏఐఎస్ఎఫ్), మద్దిలేటి (టీవీవీ), గోవింద్ నరేష్ (ఎంఎస్ఎఫ్), అరుణాంక్ (డీఎస్‌యూ), నగేష్ (మాదిగ నవ నిర్మాణ్), విష్ణు, రంజిత్ (పీడీఎస్‌యూ) ప్రసంగించారు.

డీపీఓ ఉద్యోగుల వివరాలివ్వండి

- డీఈఓలను ఆదేశించిన విద్యాశాఖ

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

'పేరోల్ లేక పరేషాన్' శీర్షికతో శనివారం నవతెలంగాణలో ప్రచురితమైన కథనానికి విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. సర్వశిక్షా అభియాన్ జిల్లా ప్రాజెక్టు ఆఫీసుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాలను వెంటనే పంపించాలని డీఈఓలకు ఫైనాన్స్ విభాగం ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగుల హోదా, పొందుతున్న వేతనం, డిప్యూటేషన్‌పై పనిచేస్తే వారి వివరాలూ పంపించాలని సూచించారు. పేరోల్ విభాగంలో 'బీ' కేటగిరిని చేర్చకపోవడంతో సకాలంలో ఉద్యోగులకు వేతనాలు అందడం లేదు. ఇదే విషయాన్ని 'నవతెలంగాణ' తన కథనంలో వివరించింది. అయితే బి కేటగిరిలోని ఉద్యోగుల వివరాలు ఇప్పటికే పేరోల్‌లో నమోదై ఉండటంతో, అధికారులు వీరినీ దీని పరిధిలోకి తీసుకొచ్చే ఆలోచన చేస్తున్నారు.

గిరిజన నాయకుడిపై మావోయిస్టుల కాల్పులు అమానుషం :సీపీఐ(ఎం)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం సుందరయ్య నగర్‌కు చెందిన సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మడివి రమేశ్‌పై శుక్రవారం రాత్రి మావోయిస్టులు హత్యాయత్నం చేయటాన్ని సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటన విడుదల చేశారు. రమేశ్ నిత్యం గిరిజన సమస్యలపై కృషిచేస్తున్నారని తెలిపారు. పోడుభూములు, ఉపాధి హామీ, సంక్షేమ పథకాలు తదితర అనేక ప్రజా సమస్యలపై పని చేయటం ద్వారా ఆయన మంచి గుర్తింపు పొందారని పేర్కొన్నారు. పౌర, ప్రజాస్వామ్య హక్కులపై ప్రభుత్వం తీవ్ర నిర్బంధం ప్రయోగిస్తున్నదని తెలిపారు. ప్రజలకిచ్చిన హామీల అమలును పక్కకుపెట్టి ప్రజలను దగా చేస్తున్నదని విమర్శించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తున్న సమయంలో ప్రజల తరపున నిలబడి, ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలు నిర్వహిస్తున్న గిరిజన నాయకుడిపై కాల్పులు జరపటం అమానుషమని తమ్మనేని పేర్కొన్నారు. తమ చర్యను సమర్థించుకోవటానికి వీలుగా రమేశ్‌పై ఇన్‌ఫార్మర్ అనే ముద్ర వేస్తున్నారని విమర్శించారు. ఈ తరహా దాడులు మావోయిస్టులు అనుకుంటున్న సమాజ మార్పునకు దోహదపడవనే విషయాన్ని గమనించాలని, తద్వారా వాటిని సరిచేసుకోవాలని హితవు పలికారు.

సాగు కేటాయింపులపై ప్రత్యేక చట్టం చేయాలి..

మొదటిపేజీ తరువాయి

శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, టి.జ్యోతి, బి.వెంకట్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 4 నుంచి 7 వరకు నల్లగొండలో నిర్వహించబోయే పార్టీ రాష్ట్ర ద్వితీయ మహాసభ పోస్టర్‌ను ఈ సందర్భంగా వారు ఆవిష్కరించారు. పంట ఉత్పత్తికి వెచ్చించిన ఖర్చు కంటే ఒకటిన్నర రెట్లు గిట్టుబాటు ధర కల్పించాలని ఈ సందర్భంగా రాఘవులు డిమాండ్ చేశారు. అలా చేసినప్పుడే వ్యవసాయం బాగుపడు తుందని తెలిపారు. ప్రధానమంత్రి మోడీ తీసుకున్న నోట్ల రద్దు, జీఎస్టీ చర్యల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు. ఈ క్రమంలో వ్యవసాయ కేటాయింపులు కత్తిరించారని చెప్పారు. ఫలితంగా ఆ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టాలంటే గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకోవాలని హితవు పలికారు. ఫిబ్రవరి ఒకటిన కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో కార్పొరేట్లకు కాకుండా.. వ్యవసాయానికి ప్రాధ్యామివ్వాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న రాఘవులు, జ్యోతి, జూలకంటి, తమ్మినేని, వెంకట్

కేంద్రంపై ఒత్తిడి తేవాలి...

రైల్వేబడ్జెట్‌ను సాధారణ బడ్జెట్లో విలీనం చేసిన తర్వాత తెలంగాణకు కేటాయింపులు తగ్గాయని రాఘవులు తెలిపారు. గత బడ్జెట్లలో ప్రతిపాదించినవి కూడా అమలు కాలేదన్నారు. కేంద్రంపై ఒత్తిడి చేయడం ద్వారా వాటిని సాధించుకోవాలని సీఎం కేసీఆర్‌కు సూచించారు. తెలంగాణకు డ్రైపోర్టు సాధించడానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని అన్నారు. తెలంగాణలో సముద్రం లేనందున ఎగుమతులు, దిగుమతులు డ్రైపోర్టు ద్వారానే జరగాల్సి ఉంటుందన్నారు. ఈ అంశంపై గతంలో ఒక సంస్థకు సర్వే బాధ్యత అప్పగిస్తే.. రూ.2,700 కోట్లతో దామరచర్ల, భువనగిరి, జడ్చర్ల, జహీరాబాద్ ప్రాంతాల్లో డ్రైపోర్టులు ఏర్పాటు చేయవచ్చంటూ ఆ సంస్థ నివేదికను ఇచ్చిందని గుర్తు చేశారు. దీనిపై ఒకటిన్నర ఏండ్ల జాప్యం తర్వాత కూడా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సరైన రీతిలో నివేదిక పంప లేదన్నారు. రాష్ట్ర విభజనకు ముందు తెలంగాణ నుంచి రూ.1.15లక్షల కోట్ల ఎగుమతులు జరగగా విభజన తరువాత లక్ష కోట్లకు అవి పడిపోయాయని చెప్పారు. ఈ నేపథ్యంలో ఇలాంటి అంశాలపై పోరాడకుండా బంగారు తెలంగాణను ఎలా సాధిస్తారంటూ ప్రశ్నించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా.. బంగారు తెలంగాణ వచ్చిందంటూ వ్యాఖ్యానించిన గవర్నర్ నరసింహన్.. ఆ కల ఎలా సాకారమైందో చెప్పాలంటూ ప్రశ్నించారు.

తమ్మినేని మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ రాజకీయంగా తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. గతంలో మహా కూటమిలో ఉన్న కేసీఆర్.. అప్పటి ఎన్నికల ఫలితాలు రాకముందే బీజేపీ నేతలతో మంతనాలు సాగించారని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో ఎవ్వరితోనూ పొత్తులుండబోవంటూ చెబుతున్న ఆయన.. అదే సమయంలో అనేక కీలకాంశాల్లో కేంద్రంలోని బీజేపీకి బాహాటంగా మద్దతు పలుకుతున్నారని చెప్పారు. జీఎస్టీ, పెద్దనోట్ల రద్దు తదితర విషయాలతోపాటు రాష్ట్రానికి నష్టం జరుగుతుందని తెలిసి కూడా ఆర్థిక బిల్లులపై కూడా మోడీ చర్యలను సపోర్టు చేశారని విమర్శించారు. ఆ తర్వాత నాలుక్కరుచుకున్నారని ఎద్దేవా చేశారు. ఒకవైపు బీజేపీతోను, మరోవైపు ఎంఐఎంతోనూ దోస్తీ చేస్తూ డబుల్ స్ట్రాటజీతో వెళుతున్నారని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిపై సరైన ప్రణాళిక లేని కేసీఆర్.. గందరగోళంగా వ్యవహరిస్తూ తుగ్లక్ నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. సరైన ప్రాతిపదిక లేకుండా ఇష్టారాజ్యంగా కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారు.. కానీ అక్కడ అధికారుల్లేరు, వారికి బల్లలు కూడా లేవని ఎద్దేవా చేశారు.

భూ రికార్డుల ప్రక్షాళన వంటి నిర్ణయాలు మంచివే అయినా.. వాటి ఫలితాలు బాగా లేవని తెలిపారు.పంచాయతీ ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో కాకుండా పరోక్షంగా నిర్వహించాలన్న ప్రభుత్వ ఆలోచనను ఆయన తప్పుబట్టారు. దీన్ని తాము వ్యతిరేకిస్తామని చెప్పారు. మేజిస్ట్రేట్ అంశాల్లో ఆర్డీవో, ఎమ్మార్వోలకు ఉన్న అధికారాలను కూడా కలెక్టర్లకు బదలాయిస్తామని చెప్పటం తొందరపాటు నిర్ణయమని విమర్శించారు. వ్యవసాయరంగం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు మూలాలను గమనించకుండా.. పంట పెట్టుబడి ఇవ్వడం వల్ల ఉపయోగమేమీ ఉండబోదని తెలిపారు. గిట్టుబాటు ధరలను నిర్ణయిస్తేనే.. వ్యవసాయ సంక్షోభం నుంచి రాష్ట్రం గట్టెక్కుతుందని చెప్పారు. పెట్టుబడి సాయం పథకాన్ని సమగ్రంగా అమలు చేయాలని, కౌలు రైతులకు కూడా దీన్ని వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

బీఎల్ఎఫ్‌కు బలమైన పునాదేస్తాం..

సీపీఐ (ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభ ఫిబ్రవరి 4 నుంచి 7 వరకు నల్లగొండలో జరుగుతుందని తమ్మినేని తెలిపారు. ఈ సందర్భంగా నాలుగో తేదీన పట్టణంలో ఎర్రదండు కవాతు నిర్వహిస్తామని చెప్పారు. ఆ తర్వాత ప్రతినిధుల సభ ప్రారంభమవుతుందని అన్నారు. ప్రస్తుత రాజకీయాల విధానాలకు భిన్నమైన ప్రత్యామ్నాయ రాజకీయ విధానాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లడంపై మహాసభల్లో ప్రధానంగా చర్చిస్తామని తెలిపారు. సామాజిక న్యాయం- సమగ్రాభివృద్ధి ఎజెండాగా మహాజన పాదయాత్ర నిర్వహించామని తెలిపారు. దాని కొనసాగింపుగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి వీలుగా 'టీ మాస్' ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుత పాలక పార్టీ పరిపాలన బాగాలేనందున ఆ పార్టీని దింపడానికి వీలుగా అన్ని శక్తులను ఏకం చేసి 'బహుజన లెఫ్ట్ ఫ్రంట్'ను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కూటమికి ప్రజల్లో బలమైన పునాది వేసేందుకు వీలుగా మహాసభలో మూడేండ్ల కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు. బీఎల్ఎఫ్‌లో సీపీఐ చేరుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర మహాసభకు సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్, బివి రాఘవులు, కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు తదితరులు హాజరవుతారని తమ్మినేని ఈ సందర్భంగా చెప్పారు. సీపీఐతోపాటు ఇతర వామపక్ష పార్టీల నాయకులు సౌహార్ద సందేశాలనిస్తారని వివరించారు.

జాతర విజయవంతానికి కృషి చేయాలి : స్పీకర్



నవతెలంగాణ-భూపాలపల్లి

మేడారం జాతరను ఉద్యోగులందరూ సమష్టిగా పని చేసి విజయవంతం చేయాలని స్పీకర్ మధుసూదనాచారి సూచించారు. జాతర ఏర్పాట్లపై భూపాలపల్లి కలెక్టర్, ఆయా శాఖల అధికారులతో మేడారంలో శనివారం స్పీకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మరో నాలుగు రోజుల వ్యవధిలో కోటిమంది సందర్శకుల రానున్నారని, ఆసియా ఖండంలోనే అత్యంత వైభవంగా జరుగుతున్న మేడారం జాతర విజయవంతానికి కృషి చేసే అధికారి ఎక్కడనైనా సమర్ధవంతంగా పని చేస్తారని అన్నారు. గతంలో ఇక్కడ పని చేసిన కలెక్టర్లు మళ్లీ సర్వీస్ చేయడానికి ఇష్టపడుతున్నారని వివరించారు. అనంతరం మేడారంలో ఏర్పాటు చేసిన గిరిజన మ్యూజియంను సందర్శించారు. స్పీకర్ తన నిలువెత్తు బంగారాన్ని(బెల్లం) అమ్మవార్లకు సమర్పించారు. అనంతరం మేడారం జాతరలో సేవలు అందించే ఆయా పత్రికల విలేకర్ల కోసం ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను స్పీకర్ ప్రారంభించారు.

చంద్రశేఖర్ కొత్త పుస్తకాలు విడుదల

- ఆవిష్కరించిన ప్రముఖ నటి సంజనా కపూర్



హైదరాబాద్: ప్రముఖ ఒరియా సాహితీవేత్త, ఆచార్య చంద్రశేఖర్ రథ్ రచించిన కొత్త పుస్తకాలను హైదరాబాద్ సాహిత్యోత్సవంలో శనివారం విడుదల చేశారు. ఈ పుస్తకాలను ప్రముఖ రంగస్థల నటి సంజనా కపూర్ ఆవిష్కరించారు. చంద్రశేఖర్ అస్వస్థత కారణంగా..ఆయన విద్యార్థి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బిపి ఆచార్య పుస్తకాలను సంజనా కపూర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బిపి ఆచార్య.. సంస్కృతం,ఆంగ్ల భాష పుస్తకమైన 'రితు చిత్రశాల'లోని పద్యాలను చదివి వినిపించారు.

చెరువు నిండా నీళ్లు.. రైతన్నకు కన్నీళ్లు

నవతెలంగాణ-జనగామ ప్రతినిధి

అది దేవాదుల ప్రాజెక్టు కింద నిర్మాణం చేసిన రిజర్వాయర్. దీని నీటి సామర్థ్యం 0.74 టీఎంసీలు. రిజర్వాయర్ కింద సాగు భూమి 1800 ఎకరాలు. ఏం లాభం గతేడాది నుంచీ రైతులు సాగుకు దూరమయ్యారు. నార్లు పోసి నీటి విడుదల కోసం ఎదురు చూసినా అధికారులు, ప్రజాప్రతినిధులు కనికరించడం లేదు. దీనిలో ఏం చేయాలో పాలుపోక ఎండిపోతున్న నారుమళ్లను చూసి అన్నదాతలు కండ్లళ్ల నీళ్లు దెచ్చుకుంటున్నరు. 'అయ్యా మా గోడు ఆలకించండి' అంటూ కనిపించిన అధికారినల్లా వేడుకుంటున్నారు.

జనగామ జిల్లా అసలే ఎగువ ప్రాంతం. దేవాదుల ప్రాజెక్టు ద్వారా ఎక్కువ రిజర్వాయర్లు నిర్మాణం చేసిన జిల్లా కూడా ఇదే. అందులో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం మొదటిది. ఆ నియోజకవర్గంలోని రఘునాథపల్లి మండలం అశ్వరావుపల్లి చెరువు అతి పురాతనమైంది. ఈ చెరువును కాకతీయుల కాలంలో నిర్మాణం చేయగా దేవాదుల ప్రాజెక్టు ద్వారా దీని సామర్థ్యం పెంచారు. ఈ రిజర్వాయర్ కింద అశ్వరావుపల్లి, వీరారెడ్డి తండా, నూనెముంతల గూడెం, వెంకటాయపాలెం, కోమల్ల గ్రామాల రైతుల భూములకు నీటి సరఫరా జరుగుతున్నది. మరికొన్ని రాఘవాపూర్, కుర్చపల్లి, గోవర్ధనగిరి గ్రామాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయి. ఈ రిజర్వాయర్ కింద 1800 ఎకరాల సాగు భూమి ఉండగా ఖరీఫ్, రబీలో అత్యధికంగా వరిని దిగుబడి చేస్తారు. ఎకరాలకు 40 నుంచి 50 బస్తాల ధాన్యం దిగుబడి అవుతుంది. ఈ భూములకు తూము ద్వారా విడుదల చేసిన నీరు సరిపోతుంది. తూము అభివృద్ధి పేరుతో పూర్తిగా మూసేశారు. దీంతో నీరు రావడం ఆగిపోయింది. గత ఖరీఫ్‌లో నార్లుపోసిన రైతులు నీరు రాకపోవడంతో ఎండబెట్టారు. రబీలో నార్లుపోసి నీటి సరఫరా కోసం ఎదురు చూస్తున్నారు.

తూము నిర్మాణంలో అవినీతిఅశ్వరావుపల్లి తూము నిర్మాణం కోసం ప్రభుత్వం 47 లక్షల రూపాయలు విడుదల చేసింది. సురేందర్‌రెడ్డి అనే కాంట్రాక్టర్ తక్కువకు టెండర్ కోడ్‌చేశారు. 37లక్షల రూపాయలతో పనులు చేయడానికి అంగీకరించారు. తూము మొత్తాన్ని మరమ్మతు చేయాలి. అలా కాకుండా నీరు ఉన్న చెరువు వైపు రెండు పైపులు, ఇవతల కింది వైపు రెండు పైపులు వేసినట్లు స్థానిక రైతులు చెబుతున్నారు. మధ్యలో పైపులు అమర్చకపోవడంతో నీరు ఆగిపోయింది.

30 మోటర్ల నీరు వచ్చే తూము నుంచి ఒకటి, రెండు మోటర్ల నీరు మాత్రమే వస్తున్నది. దీంతో పొలాలకు నీరు సరిపోవట్లేదు. రైతులు దున్ని నాటు పెట్టే పరిస్థితి లేకుండా పోయింది. 37 లక్షల రూపాయలతో చేయాల్సిన పనిని 10లక్షల రూపాయలతో పూర్తి చేసి 27 లక్షల రూపాయలు కాజేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పనుల అవినీతిపై సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆందోళన చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు.

మమ్మల్ని ఆదుకోండి : గాదెపాక పద్మ, రైతు

నాకు అరెకరం పొలముంది. మరో ఎకరం కౌలుకు తీసుకుని సాగుచేస్తున్న. ఇక్కడ వడ్లు పండిస్తేనే తిండి. లేకుంటే పస్తులే. ఇప్పుడు తిండి గింజలు కరువయ్యాయి. గతేడాది నుంచి నీరివ్వట్లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలి.

ఇంత అధ్వానమా : భూక్య లచ్చిరాం, రైతు

నాకు నాలుగెకరాల పొలముంది. ఖరీఫ్, రబీ రెండు పంటలు పండించేటోన్ని. రిజర్వాయర్ చేయకుండా చెరువుగా ఉన్నప్పుడే నీరు మంచిగా వచ్చేది. గతేడాది నుంచి సాగుకు దూరమయ్యాం. ఎందుకు నీటిని విడుదల చేయట్లేదో అర్థం కావట్లేదు. ఎమ్మెల్యేను బతిమిలాడినా పట్టించుకోవట్లేదు.

నీరివ్వకుంటే దిక్కేలేదు: తూరుగొండ స్వామి, రైతు

నాకు ఎకరం పొలం ఉంది. మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నా. ఎకరాకు 40 బస్తాల చొప్పున కారుకు (ఖరీఫ్, రబీ వేరువేరుగా) 120 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చేది. ఈ ఏడాది నీటిని వదలలేదు. నీరు ఇవ్వకుంటే పంటలు వేసే పరిస్థితి లేదు. తాము దిక్కులేని వారిమి అవుతాం.

సమస్య పరిష్కరిస్తాం : వనజాదేవి, జనగామ జాయింట్ కలెక్టర్

రైతులు సమస్యను నా దృష్టికి తీసుకొచ్చారు. రిజర్వాయర్‌లో నీరున్నందున దేవాదుల నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

బిల్లుల చెల్లింపులో జాప్యం

- టీఆర్ఎస్ సర్పంచ్ ఆత్మహత్యాయత్నం



నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

బిల్లుల చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ టీఆర్ఎస్ సర్పంచ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండల సర్వసభ్య సమావేశంలో శనివారం జరిగింది. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం సముద్రాలలో మరుగుదొడ్లు, డ్రెయినేజీలు, గ్రామంలోని కుక్కల నిర్మూలన కోసం చేపట్టిన పనులకు ఖర్చయిన నిధుల కోసం బిల్లులు చేయాలని గ్రామ కార్యదర్శిని సముద్రాల సర్పంచ్ తాటికొండ కుమారస్వామి కోరారు. కార్యదర్శికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో శనివారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో సమావేశానికి వచ్చారు. కార్యదర్శి నిర్వాహకాన్ని సర్పంచ్ విన్నవిస్తూనే తనవెంట తెచ్చుకున్న పురుగుల మందు డబ్బాను తాగేందుకు యత్నించాడు. దీంతో వెంటనే ఎంపీపీ, జెడ్పీటీసీ, అధికారులు ఆ డబ్బాను లాక్కుని సముదాయించారు. ఇంతలో అక్కడకు చేరుకున్న తహసీల్దార్, ఎంపీడీఓలు సమస్యలను పరిష్కరిస్తామని, బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కార్యదర్శి శ్రీనివాసపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామానికి 307 మరుగుదొడ్లు మంజూరయ్యాయని, అందులో 194 వరకు పూర్తిచేశామని తెలిపారు. ఆ డబ్బులు వచ్చి మూడు నెలలు అవుతున్నా నిర్మించుకున్న లబ్దిదారులకు ఇవ్వలేదని వాపోయారు. దీంతో లబ్దిదారులు తన ఇంటికిపైకి వచ్చి తిడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ(ఎం) ఎంపీటీసీ ఎన్నపూస రాంనర్సయ్య మాట్లాడుతూ ప్రజాప్రతినిధులుగా ఎంపికై గ్రామాల్లో పనులు చేయలేక సిగ్గుపడుతున్నామని, ఏ ఒక్క పనికూడా ఇప్పటి వరకు చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. నిధులు ఎంపీటీసీలకు రావట్లేదని, ప్రజలు మమ్మల్ని ఈసడించుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ఇలాగే చేస్తే మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని రాంనర్సయ్య హెచ్చరించారు.

మడివి రమేష్‌కు ఎమ్మెల్యే సున్నం రాజయ్య పరామర్శ



నవతెలంగాణ-భద్రాచలం


మావోయిస్టుల కాల్పుల్లో శుక్రవారం రాత్రి గాయపడిన భద్రాద్రి జిల్లా సీపీఐ(ఎం) పినపాక మండల నాయకులు మడివి రమేష్ భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనను భద్రాచలం ఎమ్మెల్యే సున్నం రాజయ్య, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య శనివారం పరామర్శించారు. ఆయనకు మెరుగైన అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ కోటిరెడ్డికి సూచించారు. రమేష్‌ను పరామర్శించిన వారిలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యలమంచి రవికుమార్, కొక్కరపాటి పుల్లయ్య, బి.వెంకటరెడ్డి, ఖమ్మం జిల్లా నాయకుల వేదగిరి శ్రీనివాసరావు, పినపాక మండల నాయకులు నిమ్మల వెంకన్న, తదితరులు ఉన్నారు.

సర్పంచ్‌లకు ప్రత్యక్ష ఎన్నికలే మేలు

రౌండ్‌టేబుల్‌లో రిటైర్డ్ ఐఏఎస్ గోపాలరావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పంచాయతీరాజ్ ఎన్నికల నిర్వహణ ప్రస్తుత పద్ధతిలోనే నిర్వహించాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి. గోపాలరావు అన్నారు. సర్పంచ్‌లకు వార్డు సభ్యుల ద్వారా పరోక్ష ఎన్నికలు కాకుండా, నేరుగా ప్రజలచేత ఎన్నుకునేలా ఉన్న ప్రస్తుత వ్యవస్థనే కొనసాగించాలని, అదే ఉత్తమమని వ్యాఖ్యానించారు. శనివారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో ఉన్న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పంచాయతీరాజ్ కొత్త చట్టంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్), తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల సంఘం, తెలంగాణ రాష్ట్ర స్వచ్ఛంద సంస్థల సంఘం, భవన నిర్మాణ కార్మిక యూనియన్ సంయుక్తంగా రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టసవరణతో ఇబ్బందులు తలెత్తే ప్రమాదముందన్నారు. అగ్రకులాల ఆధిపత్యం పెంచడానికి మాత్రమే ఉపయోగపడుతుందన్నారు. పరోక్ష విధానం మూలంగా గ్రామాల్లో ముఠా కక్ష్యలు ఏర్పడతాయని అభిప్రాయపడ్డారు. గ్రామాలు పూర్తిగా కలుషితమవుతాయని చెప్పారు. డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పి.శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో బలహీనవర్గాల నాయకత్వాన్ని దెబ్బకొట్టడానికే పంచాయతీరాజ్ చట్ట సవరణ చేస్తున్నారని విమర్శించారు. గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు, మైనారిటీలకు వచ్చిన అవకాశాలు కొత్త చట్టంతో పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అవకాశాలను రాకుండా చేయడమే కేసీఆర్ సర్కారు లక్ష్యమన్నారు. ఇందుకు కేసీఆర్ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. దీనికి స్వస్తిపలకకుంటే ప్రజలు కేసీఆర్‌కు తగిన గుణంపాఠం చెబుతారని హెచ్చరించారని చెప్పారు. మండల, జిల్లా పరిషత్ అధ్యక్షులు పరోక్షంగా ఎన్నుకోవడం మూలంగా సమస్యలు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. పదవులను కాపాడుకోవడంతోనే సమయం గడిచిపోతున్నదన్నారు. ఎంబీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఆశయ్య మాట్లాడుతూ పాతపద్ధతిలోనే పంచాయతీరాజ్ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల ద్వారా రావాల్సిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అన్యాయం జరుగుతుందన్నారు. ధనవంతులకు, డబ్బులు ఉన్న వారికే ఎక్కువ అవకాశాలు వస్తాయని చెప్పారు. గ్రామాల్లో హింస పెరుగుతుందని, కిడ్నాపులు, క్యాంపు రాజకీయాలు చోటుచేసుకుంటాయని అన్నారు. ఆయా సంఘాల నాయకులు చంద్రన్న, కేసీఎస్ ప్రసాద్, ఎం. వెంకటయ్య, శోభారాణి, కల్పన, పి.కిరణ్ పాల్గొన్నారు.



సెన్సెక్స్ ▼111 36,050	నిఫ్టీ ▼16 11,069	డాలరుకు రూపాయి విలువ 63.54	బంగారం(10.గ్రా) రూ. 31,304	వెండి (కేజీ) రూ. 42,200

శుక్రవారం స్టాక్ మార్కెట్ ముగింపు సమయానికి

కోడిగుడ్లు			
హైదరాబాద్	368	విజయవాడ	374
ఒక్కగుడ్డుకు	4.30	చెన్నై	397
వరంగల్	370	ముంబయి	410

డీబీటీతోనే అవినీతి నిర్మూలన సాధ్యం!

- ఇప్పటికే రూ.65,000 కోట్ల 'ప్రత్యక్ష ప్రయోజనం'



న్యూఢిల్లీ: ప్రభుత్వ పథకాలన్నింటిని 'ప్రత్యక్ష ప్రయోజన బదిలీ' (డీబీటీ) విధానానికి అనుసంధానం చేయకుండా దేశంలో అవినీతిని దూరం చేయడం సాధ్యం కాదని నితి ఆయోగ్ చైర్మెన్ అమితాబ్‌కాంత్ అభిప్రాయపడ్డారు. పలు పథకాల్లో డీబీటీని అమలు చేయడం ద్వారా ప్రభుత్వానికి దాదాపు రూ.65,000 కోట్ల ప్రజాధనం ఆదా అయినట్టు ఆయన వెల్లడించారు. అన్ని ప్రభుత్వ పథకాలను డీబీటీతో అనుసంధనం చేయడం మేలని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం దాదాపు 300 ప్రభుత్వ పథకాల్లో డీబీటీ అమలవుతోందని అన్నారు. తద్వారా దాదాపు 41 కోట్ల మంది ప్రజలకు మేలు జరుగుతోందని వివరించారు. దేశంలో వ్యాపార నిర్వహణను సులభతరం చేసేందుకు గాను ప్రభుత్వ ఇప్పటికే 1,200 పాత చట్టాలను పక్కనబెట్టిందని పేర్కొన్నారు. ఈజ్‌ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మరింత సులభతరం చేసేందుకు గాను ప్రభుత్వ పత్రాలను కేవలం ఒకే ఫారమ్‌కు కుదించాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఇందుకోసం ఏ విధానము రెండు పేజీలకు మించకూడదని, ఏ చట్టము మూడు పేజీలను మించకుండా చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు.

రిటైల్ బ్యాంకింగ్ సేవలలోకి అమెజాన్..!

- వేగంగా పావులు కదుపుతున్న ఆన్‌లైన్ దిగ్గజం



న్యూఢిల్లీ: ఈ-కామర్స్ రంగ దిగ్గజం అమెజాన్ భారత్, మెక్సికో లాంటి దేశాల్లో పేమెంట్ బ్యాంకింగ్ సేవలను ప్రారంభించేందుకు కసరత్తు చేస్తోన్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే భారత బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అయినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదంటున్నారు బ్యాంకింగ్ రంగ విశ్లేషకులు. ఇప్పటికే ఆన్‌లైన్ మార్కెట్‌లో వినూత్న పోకడల ద్వారా అమెజాన్ అనేక స్టోర్లు, చిన్న, మధ్య తరగతి వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపుతున్న సంగతి తెలిసిందే. బ్యాంకింగ్ సేవల కోసం అమెజాన్ పెట్టుబడులు, కొనుగోళ్ల కోసం ఫైనాన్స్ టెక్నాలజీ స్టార్టప్‌లను కూడా సంప్రదిస్తున్నట్టు సీబీ ఇన్‌సైట్స్ రీసెర్చ్ ఒక రిపోర్టులో తెలిపింది. పైగా ఇంటివద్దే నగదు తీసుకునే సర్వీసుల కోసం అమెజాన్ ప్రత్యేకంగా డిజిటల్ వ్యాలెట్‌ను తీసుకొస్తుంది. భారత్‌లోనూ ఈ సేవలు ప్రారంభించనుంది. అదే జరిగితే వినియోగదారుడు ఈ వాలెట్‌లో నగదు డిపాజిటును ఇంటి వద్ద నుంచే చేయవచ్చు. ఈ వ్యాలెట్ కూడా బ్యాంక్ ఎలా పని చేస్తుందో అదే విధమైన సర్వీసులను అందించనుంది. విత్త స్టార్టప్‌లను కొనుగోలు చేయడం వాటిల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా వేగంగా విస్తరించాలని అమెజాన్ భావిస్తోంది. కాగా మెక్సికోలో కూడా క్రెడిట్, డెబిట్ కార్డులకు ప్రత్యామ్నాయంగా అమెజాన్ క్యాష్‌పేమెంట్ సర్వీసులను తీసుకొస్తున్నట్టు తెలుస్తోంది. కాగా అమెరికాలో ప్రారంభించిన ఈ సర్వీసులకు అనూహ్య స్పందన లభిస్తుంది. అమెరికాలో ఈ సేవలను 3 కోట్ల మంది ఉపయోగించుకుంటున్నారని, దీంతో వారు సాంప్రదాయ బ్యాంకులకు వెళ్లడం మానేశారని పలు రిపోర్టులు పేర్కొన్నాయి. ఇది ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరమని అక్కడి నిపుణులు, బ్యాంకింగ్ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

తక్కువ సమయంలో

జీఎస్టీ నిలదొక్కుకుంది

విదేశాలకంటే మనమే మేలు • పన్ను పరిధిని మరింత విస్తరిస్తాం • జీఎస్టీని మరింత హేతుబద్ధీకరిస్తాం: జైట్లీ



న్యూఢిల్లీ: దేశంలో తాము కొత్తగా అమలులోకి తెచ్చిన వస్తుసేవల పన్ను (జీఎస్టీ) చాలా అనతికాలంలోనే నిలదొక్కుకొందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. జీఎస్టీ నిలదొక్కుకోవడంతో దాని విస్తృతిని పెంచేందుకు, భవిష్యత్తులో పన్నులను మరింతగా హేతుబద్ధీకరించేందుకు అవకాశం ఏర్పడిందని వివరించారు. జీఎస్టీ పన్ను విధానం దేశంలోని పరోక్ష పన్నుల విధానంలో సమూల మార్పును తీసుకు వచ్చేందుకు దోహదం చేసిందని వివరించారు. ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో జీఎస్టీ చాలా అనతి కాలంలోనే నిలదొక్కుకొందని వివరించారు. జీఎస్టీ పన్ను పరిధి పెంచడం, హేతుబద్ధీకరించే ప్రక్రియ ఇకపై కూడా కొనసాగుతుందని అన్నారు. శనివారం ఇక్కడ ఏర్పాటు చేసిన అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుతం దేశంలో జీఎస్టీ 5%, 12%,18% మరియు 28% శ్లాబులలో అమలవుతున్న విషయం తెలిసిందే. గత నవంబరులో సమావేశమైన జీఎస్టీ కౌన్సిల్ కేవలం సిన్ గూడ్స్‌ను మాత్రమే 28% పన్ను పరిధిలో ఉంచి, మిగతా 178 వస్తువులను అత్యధిక పన్ను పరిధి నుంచి 18 శాతం పన్ను పరిధిలోకి తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. డిసెంబరు నెలలో జీఎస్టీ వసూళ్లు పెరగడం సర్కారుకు నూతనోత్తేజాన్ని ఇస్తోంది. సెప్టెంబరు మాసంలో 92,150 కోట్లు అక్టోబరులో రూ.83,000 కోట్లుగా ఉన్న జీఎస్టీ వసూళ్లు డిసెంబరులో రూ.86,703 కోట్లకు చేరుకున్న సంగతి తెలిసిందే.

అంతర్జాతీయ సులభ వ్యాపార సూచీలో భారత్ మరింత మెరుగు పడటానికి అవకాశాలు ఉన్నాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. ముఖ్యంగా మూడు అంశాలపై దృష్టి పెట్టడం ద్వారా ర్యాంకింగ్‌ను మెరుగుపర్చుకోవచ్చన్నారు. ప్రపంచ బ్యాంకు ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సూచీలో టాప్ 50 ర్యాంకు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇంటర్నేషనల్ కస్టమ్స్ డే సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన అధికారుల సమావేశానికి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా సెంట్రల్ బోర్డు ఆఫ్ ఎక్సైస్ అండ్ కస్టమ్స్ శాఖ రూపొందించిన ఐసెట్రాక్, ఐసెట్యాప్ రెండు టెక్నలాజీ వేదికలను మంత్రి ఆవిష్కరించారు. ఈ రంగంలో వ్యాపారాన్ని మెరుగుపర్చడానికి ఈ వెబ్‌సైట్లు దోహదం చేస్తాయి. ఈ మధ్య కాలంలోనే ప్రపంచ బ్యాంకు

టాప్ 50 ర్యాంకే లక్ష్యంగా..

వెల్లడించిన ర్యాంకింగ్‌లో భారత్ 142వ స్థానం నుంచి 100వ స్థానానికి చేరిందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.గత 30 సంవత్సరాల్లో చేయలేనిది తాము స్వల్ప వ్యవధిలోనే చేశామని పేర్కొన్నారు. ఎన్ని సవాళ్ల ఎదురైనా 50వ ర్యాంకుకు చేరడానికి ప్రయత్నించాలని ప్రధానీ తమకు లక్ష్యంగా పెట్టారని అన్నారు. సులభ వ్యాపార ర్యాంకింగ్‌లో ప్రపంచ బ్యాంకు 10 ప్రాతిపదికలను పరిగణలోకి తీసుకుంటుందన్నారు. కాగా భారత్ ముఖ్యంగా మూడు అంశాల్లో మెరుగు పడాల్సి ఉంది. ఇందులో భూమి, నిర్మాణాలకు మున్సిపల్ శాఖల అనుమతులు, అన్ని దేశాలతో వ్యాపారం, కాంట్రాక్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ పెరగాలి. డబ్ల్యుటిఒను అన్ని అంశాల్లోనూ సంతృప్తి పర్చాల్సి ఉందన్నారు. చాలా వరకు పెద్ద కష్టమేమీ కాదన్నారు.

మారుతున్న ఆర్థిక తీరుతెన్నులు

పరిశ్రమల విధాన, ప్రోత్సాహక శాఖ కూడా మూడు అంశాలను మెరుగుపర్చడంపై దృష్టి కేంద్రీకరించిందని జైట్లీ అన్నారు. వీటితో భారత ర్యాంకింగ్ 100 దిగువకు చేరనుందని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. కాగా వాణిజ్య కల్పనలో కస్టమ్స్ శాఖ పాత్ర కీలకమైందన్నారు. కస్టమ్స్ అధికారులు రెండు పాత్రలు పోశించాల్సి ఉందన్నారు. వాణిజ్య పన్ను ఎగవేతలను గుర్తించడం అదే విధంగా నిస్పక్షపాతంగా సరిహద్దుల్లోకి సరుకు వచ్చేలా చూడాలన్నారు. ఇవి రెండు ప్రధాన సవాళ్లే అయినప్పటికీ, ఉద్యోగులు అనుభవంతో చాకచక్యంగా వ్యవహరించాలన్నారు. కస్టమ్స్, మొత్తం పన్ను శాఖ పాత్రపై జైట్లీ మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులు మారుతున్నాయన్నారు. అదే విధంగా టెక్నలాజీ లభ్యమవుతుందన్నారు. ఆర్థిక వ్యవస్థ విస్తరించడంతో పాటు ప్రతీ పన్ను శాఖ మారుతుందన్నారు. ఆదాయపు పన్ను శాఖ పరిధి కూడా పెద్దదన్నారు. అనాదిగా కొన్ని ఎంపిక చేసిన వర్గాలపై అధిక పన్నులు అమల్లో ఉన్నాయని, ఈ తీరు మారుతుందన్నారు.

మెట్రో రెండో దశ సన్నాహకాలు షురూ!

- డీపీఆర్ పనులు డీఎంఆర్‌సీకి..
- సీఎం ఆదేశాలతో అప్పగింత



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: హైదరాబాద్ మెట్రో రైలు (హెచ్ఎంఆర్) రెండో దశ సన్నాహకాలను సర్కారు వేగవంతం చేసింది. ప్రస్తుతం చేపడుతున్న తొలి దశ మెట్రో పనులకు విస్తరణగా చేపట్ట తలపెట్టిన రెండో దశ పనులకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీ పనులను ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు (డీఎంఆర్‌సీ) సర్కారు అప్పగించింది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు తాము చర్య తీసుకున్నట్టుగా హెచ్ఎంఆర్ ఒక ప్రకటనలో తెలిపింది. సన్నాహక చర్యలో భాగంగా డీఎంఆర్‌సీకి చెందిన మెట్రో రైలు నిపుణులు హైదరాబాద్‌కు వచ్చి ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డితో చర్చలు జరిపినట్టుగా హెచ్ఎంఆర్ఎల్ వివరించింది. మెట్రో రైలు మొదటి దశకంటే కూడా.. రెండో దశ ఆర్థిక సాధ్యత పెద్ద సవాళుగా నిలుస్తోందని రెడ్డి తెలిపారు. దీనిని అధిగమించి రెవెన్యూను పెంపొందించుకొనేందుకు గాను అందుబాటులో ఉన్న అన్ని చర్యలను సమీక్షిస్తున్నట్టుగా ఆయన వెల్లడించారు. రెండో దశ మెట్రో పనులను చేపట్టేందుకు అవకాశం ఉన్న మార్గాల సమగ్రంగా తనిఖీ నిర్వహించిన తరువాత మెట్రో అధికారులు డీఎంఆర్‌సీ అధికారులు మేథోమథనం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి మాట్లాడుతూ ప్రజా రవాణా డిమాండ్‌ను గరిష్టంగా ఎదుర్కొనేలా కొత్త రూట్లను సూచించాలని కోరారు. మొదటి దశలో ఏర్పడ్డ ఖాళీలను భర్తీ చేసే విధంగా రెండో దశ పనులను సూచించాలని వివరించారు. దీనికి తోడు ప్రస్తుతం అందుబాటులో ఉన్నరైలు, రోడ్డు, విమాన మార్గాల అనుసంధానత పెరిగేలా కొత్త మార్గాలుండాలని ఆయన డీఎంఆర్‌సీ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

లాయల్ ఎల్ఈడీలకు ఆదరణ



హైదరాబాద్: దేశంలోనే తొలిసారిగా మూడేండ్ల వారంటీతో తాము మార్కెట్లోకి అందుబాటులోకి తెచ్చిన లాయల్ ఎల్ఈడీ బల్బులకు ప్రజల నుంచి మెరుగైన స్పందన లభిస్తోందని లాయల్ ఎల్ఈడీ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ ఎండీ నిరంజన్ పన్సారి తెలిపారు. ఒక వాటు నుంచి మొదలుకొని 70 వాట్ల సామర్థ్యం వరకు కలిగిన దాదాపు నలభై రకాల మోడళ్లను తాము మార్కెట్లోకి ప్రవేశపెట్టినట్టుగా ఆయన తెలిపారు. తొలత తమ వ్యాపారాన్ని తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభిచామని ఆయన అన్నారు. ఇక్కడి మార్కెట్లో అపూర్వ స్పందన లభించడంతో త్వరలోనే దేశ వ్యాప్తంగా తమ ఉత్పత్తులను విస్తరించనున్నట్టుగా ఆయన తెలిపారు. స్వీడన్‌కు చెందిన బహుళజాతి కంపెనీ (ఎంఎన్‌సి) వెల్‌కాస్ట్ సంయుక్త భాగ్నస్వామ్యంలో తమ సంస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భారత్‌తోసహా 30 దేశాలో ఉనికిని కలిగి ఉన్న ఎల్ఈడిల సంస్థ వెల్‌కాస్ట్.. లాయల్ ఎల్ఈడికి నాణ్యమైన, ధీర్ఘకాలం మన్నే ఉత్పత్తుల తయారీకి అవసరమైన సాంకేతికత, యంత్రాలతోపాటు ముడిసరుకులను సమకూర్చుతోందని తెలిపారు.


ఓటముల నుంచి నేర్చిన పాఠమో, క్లీన్‌స్వీప్ తప్పించుకోవాలన్న సంకల్పమో భారత్‌ను విజయతీరాన నిలిపింది. క్రీజులో ఎల్గార్ పాతుకుపోయినా, హాషీం ఆమ్లా ధనాధన్ అర్ధ శతకంతో రాణించినా.. భారత పేస్ ధాటికి సఫారీలు దాసోహమయ్యారు. మహమ్మద్ షమి మెరుపులకు బుమ్రా, ఇషాంత్ శర్మలు తోడవటంతో 241 పరుగుల ఛేదనలో 177 పరుగులకే చేతులెత్తేశారు. బౌన్సీ పిచ్‌పై అదిరిపోయే బంతులతో మూడో టెస్టును నాల్గు రోజుల్లోనే ముగించిన టీమ్ ఇండియా.. దక్షిణాఫ్రికాపై 63 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఫ్రీడం సిరీస్‌ను 1-2తో ముగించింది. భారత్, దక్షిణాఫ్రికాల మధ్య ఆరు మ్యాచుల వన్డే సిరీస్ ఫిబ్రవరి ఒకటో తేదినుంచి ప్రారంభం అవుతుంది.

బంతి మెరిసే భారత్ మురిసే..

ఆఖరి టెస్టులో 63 పరుగులతో దక్షిణాఫ్రికాపై ఘనవిజయం

- షమి దెబ్బకు సఫారీలు విలవిల
- ఎల్గార్, ఆమ్లా అర్ధ శతకాలు వృథా
- నాల్గురోజుల్లోనే టెస్టు ఫలితం


విజయానందంలో కోహ్లి సేన


మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ భువనేశ్వర్ కుమార్

నవతెలంగాణ-జోహానెస్‌బర్గ్

మహమ్మద్ షమి (5/28) విజృంభించటంతో తుది టెస్టులో టీమ్ ఇండియా 63 పరుగులతో ఘనవిజయం సాధించింది. వాండరర్స్ మైదానంలో మెరుగైన రికార్డున్న టీమ్ ఇండియా అదే ఆనవాయితీ కొనసాగిస్తూ మూడు టెస్టు మ్యాచుల ఫ్రీడం సిరీస్‌లో తుది టెస్టు గెలుపొంది 1-2తో నిలిచింది. అనూహ్య బౌన్స్‌తో బ్యాట్స్‌మెన్‌కు చెమటలు పట్టించిన పిచ్‌పై ఓ దశలో డీన్ ఎల్గార్ (86 నాటౌట్), హాషీమ్ ఆమ్లా (52)లు నిలదొక్కుకున్నా.. భారత పేసర్ల దెబ్బకు సఫారీలు తలొగ్గారు. 241 పరుగుల లక్ష్య ఛేదనలో టీమ్ ఇండియా బౌలింగ్ దాటికి రెండో ఇన్నింగ్స్‌లో 177 పరుగులకే కుప్పకూలారు. అంతకు ముందు రెండో ఇన్నింగ్స్‌లో 247 పరుగులకు ఆలౌటైంది. రెండు ఇన్నింగ్స్‌లో కలిపి 4 వికెట్లు కూల్చటమే కాక 63 పరుగులతో భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన భువనేశ్వర్ కుమార్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ దక్కింది. సిరీస్‌లో 15 వికెట్లు పడగొట్టి, 94 పరుగులు చేసిన దక్షిణాఫ్రికా పేసర్ వెర్నన్ ఫిలాండర్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు గెల్చుకున్నాడు.


షమి (5/28)

ఎల్గార్, ఆమ్లా నిలకడ : లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా ఏమంత ఒత్తిడికి గురికాలేదు. మూడో రోజు చివరి సెషన్లో ఓపెనర్ ఏడెన్ మార్క్‌రం (4) వికెట్ కోల్పోయిన ఆతిథ్య జట్టు 17 పరుగుల ఓవర్నైట్ స్కోరుతో నాల్గో రోజు ఆట కొనసాగించింది. అయితే క్రీజులో పాతుకుపోయిన ఓపెనర్ డీన్ ఎల్గార్ (86 నాటౌట్, 240 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్), హాషీమ్ ఆమ్లా (52, 140 బంతుల్లో 5 ఫోర్లు) భారత బౌలర్లను అసహనానికి గురి చేశారు. విపరీత బౌన్స్‌తో మూడో రోజు బ్యాట్స్‌మెన్‌ను ఉక్కిరిబిక్కిరి చేసిన వాండరర్స్ పిచ్ వరుణుడి పలకరింపుతో శనివారం ఉదయం సెషన్లో బ్యాట్స్‌మెన్‌కు అనుకూలించింది. కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో టీమ్ ఇండియా బౌలర్లు బంతులేసినా వికెట్లు కూల్చలేకపోయారు. దీంతో లంచ్ విరామానికి 28 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి దక్షిణాఫ్రికా 69 పరుగులు చేసింది. లంచ్ అనంతరం దూకుడు పెంచిన హాషీం ఆమ్లా, ధాటిగా ఆడిన డీన్ ఎల్గార్‌లు హాఫ్ సెంచరీకి చేరువయ్యారు. హార్దిక్ పాండ్య బౌలింగ్‌లో 46వ ఓవర్ రెండో బంతిని స్లిప్స్ మీదుగా బౌండరీ చేర్చిన ఎల్గార్ అర్ధ శతకం అందుకున్నాడు. బుమ్రా బౌలింగ్‌లో టెస్టు కెరీర్‌లో 38వ హాఫ్ సెంచరీ నమోదు చేశాడు ఆమ్లా. వీరిద్దరి శతాధిక భాగస్వామ్యం, పిచ్‌నుంచి సహకారం కొరవడటం, వెరసి భారత శిబిరంలో గెలుపు ఆశలు వాడిపోసాగాయి. అర్ధ శతకం చేసిన ఆమ్లాను మరుసటి ఓవర్ నాల్గో బంతికే ఇషాంత్ శర్మ పెవిలియన్ బాట పట్టించాడు. ఆమ్లా స్థానంలో విధ్వంసక బ్యాట్స్‌మెన్ ఏబీ డివిలియర్స్ బ్యాటింగ్‌కు వచ్చాడు.

ఏబీ ఔట్‌తో మలుపు : ఎల్గార్ ఓ వైపు నుంచి చెత్త బంతులకే పరుగులు చేస్తూ, వికెట్ కాపాడుకోగా మరో వైపు డివిలియర్స్ (6) బౌలర్లపై దాడికి దిగాడు. అయితే పిచ్‌నుంచి బౌన్స్ లభిస్తుండటంతో భారత పేసర్లు చెలరేగారు. 56వ ఓవర్ జస్‌ప్రీత్ బుమ్రా వేసిన ఆఖరు బంతికి డివిలియర్స్ గల్లిలో అజింక్య రహానెకు క్యాచ్ ఇచ్చాడు. అక్కడినుంచే సఫారీల పతనం మొదలైంది. వికెట్ కీపర్ పార్థీవ్ పాటేల్ వేలుకు గాయం కావటంతో దినేశ్ కార్తీక్ కీపర్‌గా సబ్‌స్టిట్యూట్ అయ్యాడు. దక్షిణాఫ్రికా చేతిలో ఏడు వికెట్లున్నాయి. విజయానికి అవసరమైనవి సరిగ్గా వంద పరుగులు. ఈ సమయంలో సఫారీల సారథి డుప్లెసిస్ (2)ను ఇషాంత్ శర్మ అద్భుతమైన బంతితో బౌల్డ్ చేశాడు. బ్యాటింగ్‌కు దిగిన క్వింటన్ డికాక్ (0) బుమ్రా వేసిన బంతికి ఎల్‌బిడబ్ల్యూగా వెనుదిరిగాడు. అప్పటికి దక్షిణాఫ్రికా స్కోరు 145/4. ఓ పక్క డీన్ ఎల్గార్ క్రీజులో కుదురుకున్నాడు. టెయిలెండర్ల సహకారం దక్కితే దక్షిణాఫ్రికాకు విజయం దక్కేదే. ఈ దశలో సఫారీల దిశ మార్చేశాడు షమి.

సాహో షమి : షమి బౌలింగ్‌లో దక్షిణాఫ్రికా టెయిలెండర్ల వికెట్లు ఒక్కోటీ వరుస పెట్టి కూలాయి. వెర్నన్ ఫిలాండర్ (10)ను బౌల్డ్ చేసిన షమి వెనువెంటనే అందిలె (0)ను డకౌట్ చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో రాణించిన కగిసో రబాడా (0)ను భువనేశ్వర్ వచ్చీ రాగానే వెనక్కు పంపాడు. ఆఖర్లో మోర్నీ మోర్కెల్ (0), లుంగిసాని ఎంగిడి (4)లు షమి బంతికి బలయ్యారు. ఆఖరు తొమ్మిది వికెట్లను సఫారీలు 53 పరుగులకే కోల్పోయారంటే టీమిండియా బౌలర్లు ఏ స్థాయిలో గర్జించారో అర్థం చేసుకోవచ్చు. అయితే డీన్ ఎల్గార్ 86 పరుగులతో నాటౌట్‌గా నిలిచినా.. అతనికి సహచరుల సహకారం కొరవడటంతో దక్షిణాఫ్రికాకు ఓటమి తప్పలేదు.

భారత్ తొలి ఇన్నింగ్స్ : 187/10 (76.4 ఓవర్లలో)
దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ : 194/10 (65.5 ఓవర్లలో)
భారత్ రెండో ఇన్నింగ్స్ : 247/10 (80.1 ఓవర్లలో)

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ : ఏడెన్ మార్క్‌రం (సి) పార్థీవ్ పటేల్ (బి) మహమ్మద్ షమి 4, డీన్ ఎల్గార్ నాటౌట్ 86, హాషీమ్ ఆమ్లా (సి) హార్దిక్ పాండ్య (బి) ఇషాంత్ శర్మ 52, ఏబీ డివిలియర్స్ (సి) అజింక్య రహానె (బి) బుమ్రా 6, డుప్లెసిస్ (బి) ఇషాంత్ శర్మ 2, క్వింటన్ డికాక్ ఎల్‌బిడబ్ల్యూ (బి) జశ్‌ప్రీత్ బుమ్రా 0, వెర్నన్ ఫిలాండర్ (బి) మహమ్మద్ షమి 10, అందిలె ఫెహ్లుక్వాయో (బి) మహమ్మద్ షమి 0, కగిసో రబాడ (సి) చటేశ్వర్ పుజారా (బి) భువనేశ్వర్ కుమార్ 0, మోర్నీ మోర్కెల్ (బి) మహమ్మద్ షమి 0, లుంగిసాని ఎంగిడి (సి) కార్తీక్ (బి) మహమ్మద్ షమి 4, ఎక్స్‌ట్రాలు 13,

మొత్తం : (73.3 ఓవర్లలో 10 వికెట్లకు) 177.

వికెట్ల పతనం : 1-5, 2-124, 3-131, 4-144, 5-145, 6-157, 7-157, 8-160, 9-161, 10-177.

బౌలింగ్ : భువనేశ్వర్ 18-4-39-1, మహమ్మద్ షమి 12.3-2-28-5, జశ్‌ప్రీత్ బుమ్రా 21-3-57-2, ఇషాంత్ శర్మ 16-3-31-2, హార్దిక్ పాండ్య 6-1-15-0.



ప్రాధాన్యతల పరమార్థం

మానవ జీవితం ఉరుకులుపరుగులమయం. ఎప్పుడూ ఒత్తిడే. దైనందిన కార్యాల చిట్టా చాంతాడు.. పూర్తయ్యేది మాత్రం బెత్తెడే. పని ఎక్కువ, సమయం తక్కువ. అన్నీ అసంపూర్తే. ఒకదాని తర్వాత ఇంకోటి చేయాలన్నా హడావుడి నడుమ మన జాబితాలోని పనులు సగం కన్నా ఎక్కువే మిగిలిపోతాయి. అప్పుడు ఏం చేయాలో పాలుపోదు. ఒకటే టెన్షన్. ఈ పరిస్థితులు ఒకరిద్దరికి కాదు.. మనలో చాలామందికి ఎదుర వుతాయి. పనులు చేయాలని ఆతృత ఉన్నా ఎక్కడి గొంగడి అక్కడే అన్నట్టు అవి అలాగే ఉండిపోతాయి. అలాంటప్పుడు ఏం చేయాలి?

అనుకున్న పనులు సక్రమంగా, సమర్థంగా పూర్తి చేయాలంటే కొన్ని పద్ధతులు పాటించడం తప్పనిసరి. ఏది? ఎప్పుడు? ఎక్కడ? ఎలా ? అనే ప్రాధాన్యతల క్రమంలో వాటిని నిర్దేశించుకోవాలి. ఈ ప్రాధాన్యతల వల్ల చేయబోయే పనుల పట్ల ఒక స్పష్టత ఏర్పడుతుంది. ఎలాంటి గందరగోళానికి ఆస్కారం ఉండదు. అనుకున్న పనిని వియవంతంగా పూర్తి చేయొచ్చు. ఒక క్రమ పద్ధతిలో చేయాల్సిన పనులను ఆచరణలో పెడితే ఫలితం కచ్చితంగా సానుకూలంగా ఉంటుంది. ఎలాంటి టెన్షన్ లేకుండా పనులను ప్రశాంతంగా పూర్తి చేయొచ్చు.

ప్రాధాన్యతల ప్రకారం పనులు చేయడానికి ప్రతిఒక్కరూ పూనుకోవాలి. ఇందులో ఎవరికీ మినహాయింపు లేదు. వయసు ఏదైనా, వృత్తి ఎలాంటిదైనా ఇది పాటించాల్సిందే. పని చిన్నదైనా, పెద్దదైనా ఈ పద్ధతిని అనుసరించాల్సిందే.

కంగారు పడొద్దు

మనకు నిత్యం అనేకమంది తారస పడుతుంటారు. వారిని జాగ్రత్తగా గమనిస్తే ప్రాధాన్యతల విలువేమిటో తెలుస్తుంది. కొందరు వ్యక్తులు చేయాల్సిన పనుల్లో అనవసరంగా కంగారు పడిపోతారు. హడావుడిగా పనులన్నింటినీ కలగాపులగం చేస్తారు. చివరికి ఏ పనినీ సక్రమంగా పూర్తి చేయరు. తద్వారా నిరాశకు గురవుతారు. ఈ పనులు తాను చేయలేనని వారిలో ఆత్మనూన్యత ఆవరిస్తుంది. మరికొందరు ఎలాంటి



హడావుడి, కంగారు లేకుండా అనుకున్న పనులు విజయవంతంగా పూర్తి చేయగలుగుతారు. పనులను ప్రాధాన్యతాక్రమంలో చేపట్టడం వల్లే వారికి అది సాధ్యమవుతుంది.

ఈ ఆధునిక యుగంలో మనుషుల మధ్య పోటీతత్వం పెరిగింది. కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమైపోయిన నేపథ్యంలో ఎవరి పనులు వారే చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మనకు మనమే ఆసరాగా నిలవాల్సి వస్తోంది. ఎవరి జీవితానికి వారే భరోసా. మారుతున్న సామాజిక పరిస్థితుల దృష్ట్యా పనుల్లో ప్రాధాన్యతలు ఆవశ్యం. ఏ స్థాయిలో ఉన్నవారైనా ఈ పద్ధతి పాటిస్తే కచ్చితంగా సత్ఫలితాలు కనిపిస్తాయి.

ఇలా చేద్దాం..

- చేయబోయే పనిపట్ల పూర్తిగా అవగాహన కలిగి ఉండాలి.
- ఏ పని.. ఎప్పుడు? ఎలా? అనే ప్రాధాన్యతల పట్టికను తయారు చేసుకోవాలి.
- అనుకున్న పనిని మొదలు పెట్టినప్పుడు వేరొక పనిలో తలదూర్చొద్దు. ప్రాధాన్యతల పట్టిక ప్రకారం పనిని కొనసాగించాలి.
- ఏ పనిని ప్రారంభించినా అనుకున్న సమయానికే ఆచరణ మొదలు కావాలి. లేదంటే ఆ పనిని ముగించేటప్పుడు ఒత్తిడికి గురి కావాల్సి వస్తుంది.
- ప్రాధాన్యతల పట్టిక ప్రకారం పనులు చేస్తున్నప్పుడు మార్కు చేసుకుంటూ పోవాలి. తదుపరి పనిని ఆచరణలో పెట్టాలి.
- పనికి కావాల్సిన వనరులు సక్రమంగా అమర్చుకోవాలి. ఉదాహరణకు ఏ సబ్జెక్టు మొదలు పెట్టాలి? మొదలు పెట్టిన సబ్జెక్టులో ఏయే పాఠాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.. ఉద్యోగ ప్రయత్నాల్లో మన సబ్జెక్టు, నాలెడ్జ్, సామాజిక అంశాలపై ఎలా అవగాహన పెంచుకోవాలి? అనేది తెలుసుకోవాలి. చేరబోయే కంపెనీకి సంబంధించిన వివరాలకు అనుగుణంగా కార్యాచరణ ఉండాలి.
- ఏ పని ఎప్పుడు పూర్తవుతుందనే అంచనాల్లో తేడాలు ఉండొచ్చు. అందుకే పని కొనసాగే మొదటి లేదా రెండో ప్రయత్నంలో సమయానికి సంబంధించిన అంచనాలు కూడా మనకు అర్థమవుతాయి. దానికి తగ్గట్టుగా మార్పులు, చేర్పులు చేయాలి. దీంతో సమయం వృథా కాదు. పనులను సక్రమంగా పూర్తి చేయొచ్చు.
- పనుల ప్రాధాన్యతల్లో అవగాహన లేకపోతే అనుభవజ్ఞుల సలహాలు తీసుకోవటంలో ఏ మాత్రం సంశయించొద్దు. కొన్ని సందర్భాల్లో అనుభవజ్ఞుల సలహాలే మన అభివృద్ధికి రాచబాట వేయొచ్చు.
- ప్రాధాన్యతలను అనుసరించి మన ప్రయత్నాలు సాగుతున్నప్పుడు అత్యవసరంగా ఇతర ఏ పనిలోనైనా హాజరు కావాల్సి వస్తే మనం చేస్తున్న పని ఎంతవరకు చేశామో అంత వరకు గుర్తు పెట్టుకోవాలి. అవసరమైతే చిన్న నోట్స్ రాసుకోవాలి. దీని వల్ల ప్రాధాన్యతల వరుస దెబ్బతినదు. జ్ఞాపకం చెదరదు. పని సజావుగా సాగుతుంది.



అమరనాథ్ జగర్లపూడి,
కౌన్సెలింగ్ సైకాలజిస్ట్,
9849545257

వ్యసనాలకు దూరంగా ఉండాలంటే...

యువతలో చాలామంది వ్యవసనాలకు బానిసలవుతున్నారు. మద్య, దూమపానానికి అలవాటు పడుతున్నారు. వీటిని ఒక ఫ్యాషన్‌గా భావిస్తూ దాని నుంచి బయటపడలేకపోతున్నారు. అలాగే స్మార్ట్‌ఫోన్‌ను పరిమితంగా వాడకుండా అదేపనిగా దానికి అతుక్కుపోతున్నారు. చాలామంది పోర్న్ వీడియోలకు అలవాటుపడి సమయాన్ని వృథా చేసుకోవడమే కాకుండా మానసిక సమస్యలకు గురవుతున్నారు. ఇలాంటి వారు సామాజిక రుగ్మతలకు కారణమవుతున్నారు. ఎంత వదిలించుకోవాలన్నా ఈ వ్యసనాలను వీడలేకపోతున్నారు. అయితే.. ఇది కష్టమైన పనేం కాదు. కొన్ని చిట్కాలు పాటిస్తే ఎలాంటి వ్యసనాన్నయినా వదిలేయొచ్చని అంటున్నారు మానసిక నిపుణులు. అవేమిటో చూద్దాం...



- వ్యసనాలు మానేయడం అంతా ఈజీ కాదు. వీటికి బానిస అయిన వారికి ఇదెంతో కష్టమైన పని. అలాగని అసాధ్యమేమీ కాదు. దీనికో ప్రక్రియ ఉంటుంది. దాన్ని ప్రణాళికాబద్ధంగా అనుసరించాలి. ముందుగా ఇక వ్యసనాల జోలికి వెళ్లనని గట్టిగా నిర్ణయించుకోవాలి. స్వతహాగా ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రణాళికను పాటించడంపైనే దృష్టి పెట్టాలి.
- ముందుగా 'ఈ రోజు నుంచి నేను ఎలాంటి వ్యసనాల జోలికి వెళ్లను' అని సంకల్పించాలి. ఇలా ఏరోజుకారోజు అలాగే అనుకుంటూ పోవాలి. మళ్లీ ఆ వ్యసనాల దగ్గరికి వెళ్లకుండా జాగ్రత్తపడాలి. కనీసం మూడు నెలల వరకు ఇలా నియంత్రించుకుంటే మీ లక్ష్యం నెరవేరినట్టే.
- మానేసిన తర్వాత కూడా కొన్ని రోజులపాటు మీలో మీరుగా 'నేనిక వ్యసనాల బారినపడను' అని దృఢ నిశ్చయంతో ఉండాలి. 'ఒక సారి కమిట్ అయ్యాక నా మాట నేనే వినను' అనే నిర్ణయానికి రావాలి.
- కొంత మంది వ్యసనాలు మానేసిన తర్వాత వాటిపై ఉన్న వ్యామోహంతో తిరిగి ప్రారంభిస్తారు. అలా మనసులో అనిపించనప్పుడల్లా తనను తాను నిందించుకోవాలి. 'నాకు ఇలాంటి ఆలోచనలు వస్తున్నాయేమిటి?' అని ప్రశ్నించుకోవాలి.
- ఎంత ప్రయత్నించినా వ్యసనాలకు దూరం కానప్పుడు మీ లక్ష్యాలు, ప్రణాళికల గురించి కుటుంబ సభ్యులతో చర్చించండి. వీలుంటే వారి సహాయం తీసుకోండి. ఎక్కువ సమయం వారితో గడపటం వల్ల మీ ఆలోచనలు వ్యసనాల వైపు మల్లవు.
- అవసరమైతే మానసిక నిపుణులను సంప్రదించండి. డిఅడిక్షన్ సెంటర్‌లో తమ సమస్యను పరిష్కరించుకోండి.

ప్రేమ గుబాళింపు

నీ కనుసన్నుల అంచున
కన్నీళ్ల ముత్యంలో
గింజుకొంటున్న నన్ను
జారిపడకుండా చూసుకో!

ప్రియా!
నీ ...
హృదయ కుహరంలో
పరిమళిస్తున్న
ప్రేమ గుబాళింపు
ప్రవహిస్తున్నది
నా రక్తనాళాలలో
ప్రాణవాయువై!!

\- అష్జద్





లవ్వు.. పువ్వు

- జీవితం పువ్వులాంటిది. అందులోని మకరందమే ప్రేమ.
- ప్రేమ అంగట్లో దొరికే వస్తువు కాదు. అది స్వతహాగా మనసులో పుట్టుకొచ్చే పుట్టుమచ్చ లాంటిది.
- ప్రేమించటానికి హృదయం ఉండాలి. ప్రేమింపబడటానికి వ్యక్తిత్వం ఉండాలి.
- ఒకరి అందం, అర్హతల వల్ల మొదట ఆకర్షణ ఏర్పడుతుంది. వారి ప్రవర్తన వల్ల అది స్నేహంగా మారుతుంది. వ్యక్తిత్వం వల్ల ప్రేమగా రూపాంతరం చెందుతుంది.
- ఇష్టం ప్రేమగా మారాలంటే దానికి గౌరవం తోడుకోవాలి.
- ప్రేమ కోపాన్ని చంపుతుంది. చిరునవ్వుని పుట్టిస్తుంది.
- ప్రేమ శత్రువులను కూడా మిత్రులుగా మారుస్తుంది.
- ప్రపంచంలో ప్రేమకు కూడా ఏదో వ్యతిరేకత, అర్హత ఉండాలంటే ఇంత మంది ప్రేమించేవారే కాదు. ప్రేమించబడే వారే కాదు.

ప్రతిభే పునాది




- మనలో దాగి ఉన్న టాలెంట్‌ని ఏమాత్రం దాచిపెట్టొద్దు.
- అవకాశం వస్తే సృజనాత్మకతను కచ్చితంగా బహిర్గతం చేయాలి.
- టాలెంట్ పర్సన్‌గా మారాలంటే ఒకే మూసలో ఆలోచించడం మానుకోవాలి.
- పాతుకుపోయిన అలవాట్లు, అభిప్రాయాలు బహుముఖ దృష్టిని మందగింపజేస్తాయి. సమస్యల పరిష్కారాన్ని గుర్తించే ముందే ఓ నిర్ణయానికి వచ్చి దాని చుట్టూ పరిభ్రమించే బదులు వివిధ ప్రత్యామ్నాయాలను పరిశీలించాలి.
- టాలెంట్ బయట పట్టే ముందే లేనిపోని చిక్కులు, ప్రతిబంధకాలను ఊహించుకుని కంగారు పడొద్దు.
- తప్పు చేస్తామనే భయంతో కొత్తదనాన్ని తోసిపుచ్చొద్దు.
- కొత్త పద్ధతిని అనుసరించితే మొదట్లో అన్నీ విడమరచినట్టు స్పష్టంగా కనిపించకపోవచ్చు. ప్రాథమికంగా మన ఆలోచనలో లోపం లేకపోతే క్రమంగా స్పష్టత వస్తుంది.
- పరిష్కారాలను అన్వయించేటప్పుడు కూడా ఆలోచనా శక్తిని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి.
- అసందర్భమైన పద్ధతులను ఆశ్రయించొద్దు. ఆ మార్గం తప్పని ఆచరణలో వెల్లడైతే వెంటనే మార్చుకోవాలి.
- ప్రమాదంలేని రీతిలో ప్రయోగాత్మక కృషికి చొరవ చూపాలి.
- పరిశీలించి తెలుసుకోవాల్సిన విషయాలపై ముందే ఒక నిర్ణయానికి రావొద్దు.

గుడ్డి నమ్మకం

మజాక్

'మీరిద్దరిది లవ్ మ్యారేజా.. అరేంజా?' తల్లిదండ్రులను అడిగాడు కొడుకు.
'లవ్ మ్యారేజ్' సమాధానం చెప్పాడు తండ్రి.
మళ్లీ ఇంకో ప్రశ్న వేశాడు కొడుకు
'ప్రేమ గుడ్డిదంటారు నిజమేనా..?'
ఈసారి తల్లి కల్పించుకుంది.
'అవును... అయినా ఇప్పుడా ప్రశ్న ఎందుకు వేయాల్సి వచ్చింది?' అనడిగింది.
'మరేం లేదు.. ఇందాక నువ్వు వడ్డించిన పప్పుచారులో బుద్దింక ఉన్నా చూసుకోకుండా నాన్న అలాగే తినేశారు' అసలు విషయం చెప్పాడు కొడుకు.



కలల అభిసారిక

రాతిరి నా కలలోకొచ్చిన
నా స్వప్నాల చిలుకయే
నా ఊహల మొలకయే
తెల్లారి పెరటి తోటలో సీతాకోకచిలుకైంది
తూనీగైంది ప్రేమ భ్రమరమైంది
పువ్వైంది నవ్వైంది
నిజానికా నవ్వే వేకువైంది వెలుగైంది
ఆ నవ్వుతోనే పొద్దు పొడుపు వెలుగులొచ్చాయి
తిరిగి తిరిగి పెండోటకెళ్లితే
పూవు పూవులో ఆమె నవ్వే
రెమ్మ రెమ్మలో ఆమె పరిమళమే
కొమ్మ కొమ్మలో ఆమె సోయగమే
ఆకు ఆకులో ఆమె కలికితనమే
వనమంతా ఆమె రూపమే
విశ్వంభరయై గోచరించే

\- జనమేజయ,
7013028101



ఆవేశం.. విఘాతం



- తన కోపమే తనకు శత్రువు అంటారు. ఆవేశమనేది సర్వసాధారణమైనా దానిని అదుపు చేసుకోవడమే ముఖ్యం.
- కోపాన్ని ప్రదర్శించడం మంచిది కాదు. దీంతో మానవ సంబంధాలు చెడిపోతాయి.
- ఫ్రెండ్‌షిప్ అయినా, లవ్ అయినా, మరే రిలేషన్‌షిప్ అయినా ఆగ్రహావేశాలకు లోనుకావద్దు.
- మనకు నచ్చని అంశం ఏదైనా ఉంటే దానిపై సంయమనం, సహనం పాటించడం నేర్చుకోవాలి. అప్పుడే రిలేషన్‌షిప్ పదికాలాల పటు పదిలంగా ఉంటుంది.
- కోపానికి కారణాలు ఏమైనప్పటికీ అది తారస్థాయికి చేరితే ప్రమాదమే. దీని ప్రభావం రిలేషన్‌షిప్‌పై పడుతుంది. కోపాన్ని అదుపు చేసుకోకపోతే సంబంధాలు చెడిపోతాయి.
- చాలా సమయాల్లో కోపం ఆవేశం వల్ల కలుగుతుంది. కొద్ది సమయం తర్వాత అది తగ్గిపోతుంది. అయితే.. ఈలోగా జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఆ తర్వాత పశ్చాత్తాప పడినా ప్రయోజనం ఉండదు.
- కోపాన్ని కంట్రోల్ చేయడం చాలా క్లిష్టమైన పని. అయితే.. ఇది అసాధ్యమేమీ కాదు.
- ఆగ్రహావేశాన్ని అదుపు చేయడానికి ఒక కమిట్మెంట్ అవసరం. మన తప్పులను మనమే నమ్రతతో ఒప్పుకునే అలవాటు చేసుకోవాలి. పరిస్థితిని చక్కదిద్దేందుకు ఏదోకటి చేయాలనే ఆలోచన అప్పటికప్పుడు కలగాలి.
- కోపం తగ్గడానికి అంకెలు లెక్కపెట్టాలనే విషయం కొత్తేమీ కాదు. ఇది ప్రతిఒక్కరూ చాలాసార్లు వినే ఉంటారు. నిత్యం గుర్తుపెట్టుకోవాల్సిన అంశం కాబట్టి ప్రతిసారీ ఏదోఒక సందర్భాన ఈ విషయాన్ని ఎవరో ఒకరు చెబుతూనే ఉంటారు. కోపం తారస్థాయికి చేరుకున్న వెంటనే ఒకటి నుంచి పది వరకు అంకెలను లెక్కించాలి. దీంతో క్షణాల్లోనే క్రోధం తగ్గిపోతుంది.
- పరిస్థితులు మీకు అనుకూలంగా లేకుండా చాలా కోపం కలిగించేలా ఉన్నప్పుడు సంయమనం పాటించాలి. ఆ అంశాన్ని అక్కడే వదిలేసి, దీనిని చర్చించేందుకు మరో సమయాన్ని కేటాయించాలి. ఆ స్థలం నుంచి పక్కకు వెళ్లిపోవాలి. ఇలా చేయటం వల్ల మీ ప్రవర్తన గురించి మీరు అవలోకనం చేసుకోవటానికి వీలవుతుంది. మీ కోపతాపాలు చల్లారిన తర్వాత మీరు వివేకంతో ప్రవర్తిస్తారు.
- మీరు కోపంగా ఉన్నప్పుడు ఒక్క మాట కూడా మాట్లాడకుండా మౌనం పాటించడం మంచిది. లేదంటే ఆ తర్వాత పశ్చాత్తాప పడాల్సి వస్తుంది. ఎంత సేపు వీలైతే అంత సేపు మౌనంగానే ఉండండి. అవతలి వారు ఎం ప్రేరేపించినా రెచ్చిపోవద్దు.
- నడక మీ శారీరకంగా ఆరోగ్యాన్ని మెరుగుపరచాటమే కాకుండా కోపాన్ని తగ్గించుకోవటానికి కూడా ఉపయోగపడుతుంది. వ్యాయామం చేయటం వల్ల మీరు సంతోషంగా ఉండటానికి అవసరమైన హార్మోన్లు శరీరంలో విడుదలవుతాయి. మీ కోపం తారస్థాయికి చేరినప్పుడు మీరు నడక ఆరంభించటం చాలా ఉత్తమం. ఇలా చేయటం వల్ల మీ నరాలు చల్లబడి ప్రశాంతతను కలిగిస్తాయి.

తొలి చూపులు

నీ తొలిచూపుల
భావ బంధురతను
తూచడానికి
నా కవితా కాసులనెన్నింటిని
వేసినా
నిస్సహాయుడనవుతున్నా
నీరజముఖీ! సఖీ!

\- రఘువర్మ,
9290093933



మీరూ రాయొచ్చు

హాయ్ ఫ్రెండ్స్. ఈ పేజీకి మీరేదైనా రాయాలనుకుంటున్నారా.. అయితే ఆలస్యం దేనికి? కలం పట్టండి. ముఖ్యమైన ఈవెంట్స్, సక్సెస్ స్టోరీలు, సమాజ శ్రేయస్సు కోసం చేపడుతున్న కార్యక్రమాలు.. ఇలా యూత్‌కు సంబంధించి సమాచారం ఏదైనా మాకు పంపండి.

మా అడ్రస్ : జోష్ పేజీ, నవ తెలంగాణ తెలుగు దినపత్రిక, ఎం.హెచ్.భవన్,
ఫ్లాట్ నం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కల్యాణ మండపం వీధి,
బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్ - 500020.
e-mail :josh@navatelangana.com

రాయల్ చాలెంజర్స్ బెంగళూర్

ఖర్చు చేసినది : 64.15 కోట్లు, మిగిలినది : 15.85 కోట్లు

ఆటగాడు	శైలి	ధర (రూ. కోట్లు)
విరాట్ కోహ్లి	బ్యాట్స్‌మన్	17.00
ఏబీ డివిలియర్స్	బ్యాట్స్‌మన్	11.00
క్రిస్ వోక్స్	ఆల్‌రౌండర్	7.40
యుజ్వేంద్ర చాహల్	బౌలర్	6.00
ఉమేశ్ యాదవ్	బౌలర్	4.00
మెక్‌కలమ్	బ్యాట్స్‌మన్	3.60
నవదీప్ షైని	బౌలర్	3.00
సర్ఫరాజ్ ఖాన్	బ్యాట్స్‌మన్	3.00
క్వింటన్ డికాక్	వికెట్‌కీపర్	2.80
కొలిన్ గ్రాండ్‌హోమె	ఆల్‌రౌండర్	2.20
మొయిన్ అలీ	ఆల్‌రౌండర్	1.70
మనన్ వోహ్రా	బ్యాట్స్‌మన్	1.10
కుల్వంత్ ఖెజ్రోలియ	బౌలర్	0.85
అనికెత్ చౌదరి	బౌలర్	0.30

కోల్‌కత నైట్ రైడర్స్

ఖర్చు చేసినది : 72.4 కోట్లు, మిగిలినది : 7.6 కోట్లు

ఆటగాడు	శైలి	ధర (రూ. కోట్లు)
సునీల్ నరైన్	బౌలర్	12.50
క్రిస్ లిన్	బ్యాట్స్‌మన్	9.60
మిచెల్ స్టార్క్	బౌలర్	9.40
అండ్రూ రస్సెల్	ఆల్‌రౌండర్	8.50
దినేశ్ కార్తీక్	వికెట్‌కీపర్	7.40
రాబిన్ ఉతప్ప	వికెట్‌కీపర్	6.40
కుల్దీప్ యాదవ్	బౌలర్	5.80
పియూశ్ చావ్లా	బౌలర్	4.20
నితీశ్ రానా	ఆల్‌రౌండర్	3.40
కమలేశ్ నగర్‌కోటి	బౌలర్	3.20
సుభ్‌మన్ గిల్	ఆల్‌రౌండర్	1.80
ఇషాంక్ జెగ్గీ	బ్యాట్స్‌మన్	0.20

కింగ్స్ ఎలెవన్ పంజాబ్

ఖర్చు చేసినది : 58.1 కోట్లు, మిగిలినది : 21.9 కోట్లు

ఆటగాడు	శైలి	ధర (రూ. కోట్లు)
అశ్విన్	ఆల్‌రౌండర్	7.60
డెవిడ్ మిల్లర్	బ్యాట్స్‌మన్	3.00
మార్కస్ స్టోయినిస్	ఆల్‌రౌండర్	6.20
యువరాజ్ సింగ్	ఆల్‌రౌండర్	2.00
మయాంక్ అగర్వాల్	బ్యాట్స్‌మన్	1.00
కరుణ్ నాయర్	బ్యాట్స్‌మన్	5.60
కెఎల్ రాహుల్	బ్యాట్స్‌మన్	11.00
అరోన్ ఫించ్	బ్యాట్స్‌మన్	6.20
అనికెత్ రాజ్‌పుత్	బౌలర్	3.00
అక్షర్ పటేల్	ఆల్‌రౌండర్	12.5

చెన్నై సూపర్‌కింగ్స్

ఖర్చు చేసినది : 63 కోట్లు, మిగిలినది : 17 కోట్లు

ఆటగాడు	శైలి	ధర (రూ. కోట్లు)
ఎం.ఎస్ ధోని	వికెట్‌కీపర్	15.00
కేదార్ జాదవ్	ఆల్‌రౌండర్	7.80
హర్భజన్ సింగ్	బౌలర్	2.00
కర్ణ్ శర్మ	బౌలర్	5.00
అంబటి రాయుడు	బ్యాట్స్‌మన్	2.20
ఇమ్రాన్ తాహిర్	బౌలర్	1.00
డుప్లెసిస్	బ్యాట్స్‌మన్	1.60
డ్వేన్ బ్రావో	ఆల్‌రౌండర్	6.40
షేన్ వాట్సన్	ఆల్‌రౌండర్	4.00
రవీంద్ర జడేజా	ఆల్‌రౌండర్	7.00
సురేశ్ రైనా	బ్యాట్స్‌మన్	11.00

ముంబయి ఇండియన్స్

ఖర్చు చేసినది : 64.2 కోట్లు, మిగిలినది : 15.8 కోట్లు

ఆటగాడు	శైలి	ధర (రూ. కోట్లు)
కీరన్ పొలార్డ్	ఆల్‌రౌండర్	5.40
ముస్తాఫిజుర్	బౌలర్	2.20
సుర్యకుమార్	బ్యాట్స్‌మన్	3.20
కృనాల్ పాండ్య	ఆల్‌రౌండర్	8.80
పాట్ కమిన్స్	బౌలర్	5.40
ఇషాన్ కిషన్	వికెట్ కీపర్	6.20
రోహిత్ శర్మ	బ్యాట్స్‌మన్	15.00
హార్దిక్ పాండ్య	ఆల్‌రౌండర్	11.00
జశ్‌ప్రీత్ బుమ్రా	బౌలర్	7.00

ఢిల్లీ డెర్‌డెవిల్స్

ఖర్చు చేసినది : 67.7 కోట్లు, మిగిలినది : 12.3 కోట్లు

ఆటగాడు	శైలి	ధర (రూ. కోట్లు)
కొలిన్ మన్రో	ఆల్‌రౌండర్	1.90
గౌతం గంభీర్	బ్యాట్స్‌మన్	2.80
జేసన్ రాయ్	బ్యాట్స్‌మన్	1.50
అమిత్ మిశ్రా	బౌలర్	4.00
గ్లెన్ మాక్స్‌వెల్	ఆల్‌రౌండర్	9.00
పృథ్వీ షా	బ్యాట్స్‌మన్	1.10
హర్షల్ పటేల్	ఆల్‌రౌండర్	0.20
రాహుల్ తెవాటియా	ఆల్‌రౌండర్	3.00
విజయ్ శంకర్	ఆల్‌రౌండర్	3.20
మహ్మద్ షమి	బౌలర్	3.00
కగిసో రబాడ	బౌలర్	4.20
క్రిస్ మోరీస్	ఆల్‌రౌండర్	11.00
శ్రేయాష్ అయ్యర్	బ్యాట్స్‌మన్	7.00
రిషబ్ పంత్	బ్యాట్స్‌మన్	15.00

రాజస్థాన్ రాయల్స్

ఖర్చు చేసినది : 56.5 కోట్లు, మిగిలినది : 23.5 కోట్లు

ఆటగాడు	శైలి	ధర (రూ. కోట్లు)
స్టువర్ట్ బిన్నీ	ఆల్‌రౌండర్	0.50
అజింక్య రహానె	బ్యాట్స్‌మన్	4.00
డార్సీ షార్ట్	ఆల్‌రౌండర్	4.00
జోశ్ బట్లర్	వికెట్ కీపర్	4.40
బెన్ స్టోక్స్	ఆల్‌రౌండర్	12.50
సంజూ శాంసన్	వికెట్ కీపర్	8.00
రాహుల్ త్రిపాఠి	బ్యాట్స్‌మన్	3.40
జోఫ్రా ఆర్చర్	ఆల్‌రౌండర్	7.20
స్టీవెన్ స్మిత్	బ్యాట్స్‌మన్	12.50


ఇషాంత్


జో రూట్


క్రిస్‌గేల్


విజయ్

అమ్ముడుపోని ఆటగాళ్లు!

పొట్టి ఫార్మాట్ గ్లోబల్ స్టార్, టీ20ల్లో పది వేల పరుగులు చేసిన ఏకైక బ్యాట్స్‌మన్ క్రిస్ గేల్‌కు మరోసారి ఐపీఎల్ వేలంలో మొండిచెయ్యి తప్పలేదు. దిగ్గజ జాబితాలో ఉన్న క్రిస్ గేల్‌ను తీసుకునేందుకు ఏ ఫ్రాంఛైజీ ఆసక్తి కనబర్చలేదు. లసిత్ మలింగ సైతం అమ్ముడుపోని సరకుగా మిగిలిపోయాడు. తొలిసారి ఐపీఎల్‌లో ఆడాలనుకున్న ఇంగ్లాండ్ స్టార్ ఆటగాడు జో రూట్‌కు చుక్కెదురు. రూట్ సైతం ఎవ్వరికీ అవసరం లేకుండా పోయాడు. ప్రస్తుత భారత జట్టులోని మురళీ విజయ్, పార్థివ్ పటేల్, ఇషాంత్ శర్మ సహా హషీమ్ ఆమ్లా, మార్టిన్ గప్టిల్, జేమ్స్ ఫాల్క్‌నర్, జోని బెయిర్‌స్టో, మిచెల్ జాన్సన్, ఆడం జంపాలు వేలంలో అన్‌సోల్డ్‌గా మిగిలారు. ఈ రంజీ సీజన్ బౌలింగ్ సంచలనం రజ్నీష్ గుర్బానీనీ ఎవ్వరూ తీసుకోలేదు.





ఐపీఎల్ వేలం మరోమారు క్రికెటర్లపై కోట్ల వర్షం కురిపించింది. విదేశీ ఆటగాళ్లపై మోజు కనిపించినా.. మన క్రికెటర్ల కోసం ఫ్రాంఛైజీలు పోటీ పడ్డాయి. కెఎల్ రాహుల్, మనీశ్ పాండేలు తొలి రోజు వేలంలో జాక్‌పాట్ కొట్టేశారు. వేలంలో వీరికి రూ. 11 కోట్లు దక్కాయి. బెన్ స్టోక్స్ రూ. 12.5 కోట్లతో రిచ్ ప్లేయర్‌గా నిలిచాడు. రషీద్ ఖాన్ కోసం సన్‌రైజర్స్ ఏకంగా రూ. 9 కోట్లు వెచ్చించింది. చాహల్, కృనాల్ పాండ్య, సంజూ శాంసన్, కుల్దీప్, కేదార్ జాదవ్‌లపైనా కాసులు కురిపించారు. 110 క్రికెటర్లు తొలి రోజు వేలం ముందుకు రాగా వీరిలో 78 మందిని మాత్రమే ఫ్రాంఛైజీలు తీసుకున్నాయి. క్రిస్ గేల్, జో రూట్, మురళీ విజయ్, ఆమ్లాలు అక్కరకు రాని సరకుగా మిగిలిపోయారు!.

కోట్లు కొల్లగొట్టారు

రాహుల్, మనీశ్‌లకు రూ. 11 కోట్లు


మనీశ్ పాండే

- బెన్ స్టోక్స్‌కు మరోమారు రూ. 12.5 కోట్లు
- రషీద్ ఖాన్ కోసం సన్‌రైజర్స్ రూ. 9 కోట్లు
- చాహల్, కుల్దీప్ యాదవ్, కృనాల్ పాండ్య, సంజూ శాంసన్, కేదార్ జాదవ్ జాక్‌పాట్

నవతెలంగాణ-బెంగళూర్

ఐపీఎల్ తొలి రోజు వేలం భారత క్రికెటర్ల చుట్టూనే తిరిగింది. కెఎల్ రాహుల్, మనీశ్ పాండేలు కండ్లుచెదిరే రీతిలో చెరో రూ. 11 కోట్లు దక్కించుకున్నారు. కింగ్స్ ఎలెవన్ పంజాబ్ రాహుల్‌ను తీసుకోగా, మనీశ్ పాండేను సన్‌రైజర్స్ హైదరాబాద్ కొనుక్కున్నది. ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ కోసం ఫ్రాంఛైజీలు మరోసారి పోటీపడ్డాయి. నిరుడు ఐపీఎల్‌లో విశేషంగా రాణించిన స్టోక్స్ కోసం రాజస్థాన్ రాయల్స్ రూ. 12.5 కోట్లు వెచ్చించింది. దేశవాళీ అన్‌క్యాప్‌డ్ క్రికెటర్ల కొందరు రాత్రికి రాత్రి కోటీశ్వరులు అయిపోయారు. రెండో రోజు వేలం నేడు కొనసాగుతుంది. అన్ని జట్లు ప్రధాన జట్టును ఎంచుకోవటంలో తొలి రోజు సఫలీకృతమయ్యాయి.

హాట్‌కేక్‌లు : కెఎల్ రాహుల్, మనీశ్ పాండేలు వేలంలో హాట్‌కేక్‌లు అయ్యారు. దాదాపుగా అన్ని ఫ్రాంఛైజీలు వీరి కోసం ఓ ప్రయత్నం చేశాయి. తుదకు కెఎల్ రాహుల్‌ను కింగ్స్ ఎలెవన్ పంజాబ్ తీసుకోగా, మనీశ్ పాండేను సన్‌రైజర్స్ హైదరాబాద్ సొంతం చేసుకున్నది. బెన్ స్టోక్స్‌ను రాజస్థాన్ రాయల్స్ వేలంలోనే అత్యధిక ధర రూ. 12.5 కోట్లకు కొనుగోలు చేసింది. దిగ్గజ ఆటగాళ్లలో తొలుత అశ్విన్ కోసం చెన్నై పోటీపడింది. అశ్విన్ 4 కోట్లను దాటగానే చెన్నై ఆగిపోయింది. కానీ కింగ్స్ ఎలెవన్ పంజాబ్, రాజస్థాన్‌లు పోటాపోటీగా బిడ్ వేశాయి. తుదకు పంజాబ్ 7.6 కోట్లకు అశ్విన్‌ను దక్కించుకున్నది. కీరన్ పొలార్డ్‌ను రూ.5.4 కోట్లకు ముంబయి రైట్ టూ మ్యాచ్ ద్వారా దక్కించుకున్నది. కృనాల్ పాండ్యను సైతం రైట్ టూ మ్యాచ్‌తో రూ.8.8 కోట్లకు వెనక్కి తెచ్చుకున్నది. శిఖర్ ధావన్, రషీద్ ఖాన్‌లను సన్‌రైజర్స్ రైట్ టు మ్యాచ్‌తో తిరిగి దక్కించుకున్నది. ధావన్‌కు రూ.5.2 కోట్లు, రషీద్ ఖాన్‌కు రూ.9 కోట్లు దక్కాయి. ముంబయి వదులుకున్న హర్భజన్ సింగ్‌ను ధోని సారథ్యంలోని చెన్నై సూపర్ కింగ్స్ తీసుకున్నది. కనీస ధర రూ. 2 కోట్లకే భజ్జీ చెన్నై సొంతమయ్యాడు. డ్వేన్ బ్రావో, డుప్లెసిస్‌ల కోసం చెన్నై తన రెండు రైట్ టు మ్యాచ్ కార్డ్‌లను వినియోగించింది. మిచెల్ స్టార్క్ రూ. 9.4 కోట్లకు కోల్‌కతకు వెళ్లిపోగా, మణికట్టు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను కోల్‌కత 5.8 కోట్లకు తిరిగి తెచ్చుకున్నది. దినేశ్ కార్తీక్ రూ. 7.4 కోట్ల దక్కించుకోగా, క్రిస్ లిన్ ఏకంగా రూ. 9.6 కోట్లు కొల్లగొట్టాడు. రాబిన్ ఉతప్ప కోసం కోల్‌కత రూ. 6.4 కోట్లను వెచ్చించింది.

దేశవాళీ మెరుపులు : అండర్-19 ఆటగాళ్లు వేలంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సుభ్‌మన్ గిల్ రూ. 1.8 కోట్లు, పృథ్వీ షా రూ. 1.1 కోట్లు దక్కించుకున్నారు. బౌలర్ నగర్‌కోటి ఏకంగా రూ. 3.2 కోట్లు దక్కించుకున్నాడు. నితీశ్ రానా, పియూష్ చావ్లాలు తమ ధరను రెట్టింపు చేసుకున్నారు. ఐపీఎల్‌లో సక్సెస్‌ఫుల్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ కోసం బెంగళూర్ రైట్ టు మ్యాచ్ ఉపయోగించింది. చాహల్ వేలంలో రూ. 6 కోట్లు దక్కించుకోగా.. క్రిస్ వోక్స్ కోసం ఆర్‌సీబీ రూ. 7.4 కోట్లు ఖర్చు చేసింది. ఇక తొలి రోజు వేలంలో సన్‌రైజర్స్ ఏకంగా 14 మంది ఆటగాళ్లను సొంతం చేసుకున్నది. రాజస్థాన్ బౌలర్ ఖలీల్ అహ్మద్‌కు సన్‌రైజర్స్ రూ. 3 కోట్లు పెట్టగా, సిద్దార్థ్ కౌల్‌కు రూ. 3.8 కోట్లు, వృద్ధిమాన్ సాహాకు రూ. 5 కోట్లు, షకిబ్ అల్ హసన్ కోసం రూ. 2 కోట్లు, కార్లోస్ బ్రాత్‌వైట్‌కు రూ. 2 కోట్లు, దీపక్ హుడాకు రూ. 3.6 కోట్లు వెచ్చించింది.

ఫైనల్లో సైనా

ఇండోనేషియా మాస్టర్స్


రచనోక్‌పై 2-0తో గెలుపు
సెమీస్‌లో ఓడిన సాత్విక్ జోడీ

జకర్తా : సరిగ్గా ఏడాది తర్వాత భారత అగ్రశ్రేణి షట్లర్ సైనా నెహ్వాల్ ఓ అంతర్జాతీయ టోర్నీ ఫైనల్లోకి అడుగుపెట్టింది. నిరుడు మలేషియా మాస్టర్స్ నెగ్గిన తరువాత సైనా నెహ్వాల్ మరో టోర్నీలో టైటిల్ పోరుకు చేరుకోలేదు. వరుసగా పి.వి సింధు, రచనోక్ ఇంటానన్‌లను ఓడించిన సైనా ఇండోనేషియా మాస్టర్స్ ఫైనల్లోకి ప్రవేశించింది. 69 నిమిషాల సెమీస్ సమరంలో సైనా నెహ్వాల్ 21-19, 21-19తో వరుస సెట్లలో గెలుపొందింది. నేడు జరిగే ఫైనల్లో వరల్డ్ నెం.1 తైజు యింగ్ (చైనీస్ తైపీ)తో సైనా అమీతుమీ తేల్చుకోనున్నది. చైనా అమ్మాయి హీ బింగ్జియావోపై 19-21, 21-15, 21-15తో తైజు యింగ్ విజయం సాధించింది. పురుషుల డబుల్స్‌లో యువ సంచనలనం సాత్విక్ సాయిరాజ్ జోడీ జోరుకు తెరపడింది. సెమీఫైనల్లో సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్ శెట్టిలు టాప్ సీడ్ చేతిలో ఓటమిపాలయ్యారు. 14-21, 11-21తో ఇండోనేషియా జోడీ మనోళ్లపై గెలుపొందింది.

మహిళల సింగిల్స్ సెమీస్‌లో తొలుత వరల్డ్ నెం.4 రచనోక్ ముందంజ వేసింది. 3-1తో ఆధిక్యంలోకి వెళ్లినా.. సైనా పుంజుకుని స్కోరు 5-5తో సమం చేసింది. అయినా రచనోక్ 8-5తో ఆధిక్యం నిలుపుకున్నది. విరామ సమయానికి 11-8తో ముందంజలో నిలిచిన రచనోక్‌ను ద్వితీయార్థంలో సైనా నిలువరించింది. 11-13న నుంచి 14-13తో రేసులోకి వచ్చింది. ఈ దశలో ప్రతి పాయింట్ కోసం సుదీర్ఘ ర్యాలీలు, బాడీలైన్ స్మాష్‌లతో రెచ్చిపోయారు. 18-18తో ఉత్కంఠ తారాస్థాయికి చేరిన తరుణంలో సైనా మెరిసింది. 21-19తో తొలి గేమ్ గెల్చుకున్నది. ఇక రెండో గేమ్‌లో సైనా విజృంభించింది. 6-1తో ఆరంభంలోనే భారీ ఆధిక్యం సాధించింది. ఓ దశలో 17-11తో నిలిచిన సైనా ఆఖర్లో తడబడింది. అయినా రచనోక్ పుంజుకునే అవకాశం ఇవ్వలేదు.

సన్‌రైజర్స్ హైదరాబాద్

ఖర్చు చేసినది : 72.5 కోట్లు, మిగిలినది : 7.95 కోట్లు

ఆటగాడు	శైలి	ధర (రూ. కోట్లు)
ఖలీల్ అహ్మద్	బౌలర్	3.00
కేన్ విలియమ్సన్	బ్యాట్స్‌మన్	3.00
వృద్ధిమాన్ సాహా	వికెట్ కీపర్	5.00
శిఖర్ ధావన్	బ్యాట్స్‌మన్	5.20
మనీశ్ పాండే	బ్యాట్స్‌మన్	11.00
యూసుఫ్ పఠాన్	ఆల్‌రౌండర్	1.90
సిద్దార్థ్ కౌల్	బౌలర్	3.80
కార్లోస్ బ్రాత్‌వైట్	ఆల్‌రౌండర్	2.00
దీపక్ హుడా	ఆల్‌రౌండర్	3.60
షకిబ్ అల్ హసన్	ఆల్‌రౌండర్	2.00
రికీ భుయ్	బ్యాట్స్‌మన్	0.20
బసిల్ తంపీ	బౌలర్	0.95
రషీద్ ఖాన్	బౌలర్	9.00
నటరాజన్	బౌలర్	0.40
భువనేశ్వర్	బౌలర్	8.50
డెవిడ్ వార్నర్	బ్యాట్స్‌మన్	12.50

వోజ్నియాకిదే టైటిల్

ఆస్ట్రేలియా ఓపెన్

- అగ్ర తారల తుదిపోరులో హాలెప్‌పై విజయం
- పురుషుల డబుల్స్ విజేత పావిచ్ జోడీ

మెల్‌బోర్న్ : అగ్ర తారల తుది సమరంలో డెన్మార్క్ భామ వోజ్నియాకినే ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ వరించింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్ మ్యాచ్‌లో మాజీ నెంబర్ వన్ కరొలిన వోజ్నియాకి (డెన్మార్క్) 7(7)-6(2), 3-6, 6-4తో ప్రస్తుత ప్రపంచ నెంబర్ వన్ సిమోన హాలెప్ (రొమేనియా)పై గెలుపొందింది. వోజ్నియాకికి ఇది కెరీర్ తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ కాగా డెన్మార్క్ నుంచి గ్రాండ్‌స్లామ్ సాధించిన తొలి క్రీడాకారిణిగా వోజ్నియాకి చరిత్ర సృష్టించింది. తాజా విజయంతో ప్రపంచ నెంబర్ వన్ స్థానాన్ని తిరిగి చేజిక్కించుకోనున్న వోజ్నియాకి.. 'ఈ క్షణం కోసం ఎన్నో ఏండ్లుగా కలలు కన్నా. ఇది ఉద్వేగభరిత సమయం. సిమోన హాలెప్‌కు నా అభినందనలు.' అని చెమర్చిన కండ్లతో అన్నది.

దాదాపు మూడు గంటలు సాగిన ఉత్కంఠ పోరును 3-0 ఆధిక్యంతో వోజ్నియాకి ఆరంభించింది. అయితే టాప్ సీడ్ హాలెప్ ఏమాత్రం తొణకలేదు. 1-3తో మొదలెట్టి 5-5తో పోటీలోకొచ్చింది. 7-6తో ఆధిక్యాన్ని నిలబెట్టుకున్న వోజ్నియాకి టైబ్రేకర్‌లో మెరుగ్గా ఆడి 7-2తో నెగ్గింది. రెండో సెట్ ఆరో గేమ్ వరకు నువ్వా నేనా అన్నట్టు తలపడగా 3-3తో టాప్ సీడెడ్ క్రీడాకారిణీలు నిలిచారు. కానీ ఆరు ఏస్‌లతో విరుచుకపడిన హాలెప్ వరుసగా మూడు గేములు నెగ్గి 6-3తో రెండో సెట్ వశం చేసుకున్నది. ఈ సమయంలో ఉష్ణోగ్రత అధికంగా ఉండటంతో నిర్ణాయక సెట్‌కు ముందు పది నిమిషాల విరామాన్నిచ్చారు. చెరో సెట్ నెగ్గటంతో నిర్ణాయక సెట్ రసవత్తరంగా సాగింది. 2-0తో సెట్ ఆరంభించిన వోజ్నియాకి.. 3-3, 4-4తో హాలెప్ అడ్డుతగిలినా.. తుది రెండు గేమ్‌లు నెగ్గి 6-4తో ఆఖరు సెట్‌నూ 2-1 విజయంతో మహిళల సింగిల్స్ టైటిల్‌నూ గెల్చుకున్నది. ఇక పురుషుల డబుల్స్ టైటిల్‌న్ ఆలివర్ మారచ్ (ఆస్ట్రియా), మేట్ పావిచ్ (క్రియేషియా)ల ఏడో సీడ్ జంట గెల్చుకున్నది. ఫైనల్స్‌లో 11వ సీడ్ కొలంబియా జంట రాబర్ట్ ఫరాహ్, జువాన్ సెబాస్టియన్ కబాల్‌ను 6-4, 6-4తో వరుస సెట్లలోనే ఓడించింది. నేడు పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెడరర్ (స్విట్జర్లాండ్), మారిన్ సిలిచ్ (క్రొయేషియా)లు అమీతుమీ తేల్చుకోనున్నారు. మిక్స్‌డ్ విభాగంలో బోపన్న, బాబోస్ జోడీ.. దబ్రోవ్‌స్కీ, పావిచ్‌ల జంటతో టైటిల్ పోరులో తలపడనున్నది. **మహిళల డబుల్స్ విజేత బాబోస్, పురుషుల డబుల్స్‌ల విజేత పావిచ్.. మిక్స్‌డ్ టైటిల్ పోరులో నిలవటం విశేషం.**


సిమోన హాలెప్
కరొలిన వోజ్నియాకి

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.